


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 110 | సోమవారం 20 - 04 -2026 | పేజీలు : 12 | వెల-3


## ఎన్డీయే వైఫల్యానికి ఇది నిదర్శనం




## ఒప్పందానికి ఒప్పుకోకపోతే విధ్వంసమే..

## ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక!

- ఇరాన్‌లోని ప్రతి విద్యుత్ కేంద్రం, వంతెనను కూల్చేస్తామన్న అమెరికా
- సోమవారం ఇస్లామాబాద్‌లో ఇరు దేశాల మధ్య మరో విడత చర్చలు
- హార్మూజ్ జలసంధిలో కాల్పుల విరమణను ఇరాన్ ఉల్లంఘించిందని ఆరోపణ
- విఫలమైన గత చర్చల తర్వాత పశ్చిమాసియాలో పెరిగిన ఉద్రిక్తతలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్‌కు మరోసారి తీవ్ర మైన హెచ్చరికలు జారీ చేశారు.



## తమిళనాడులో ఘోర విషాదం...

### బాణసంచా పరిశ్రమలో పేలుడు, 18 మంది మృతి

- తమిళనాడు విరుధునగర్‌లో భారీ పేలుడు
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆందోళన
- దుర్ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం స్టాలిన్
- సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశం

తమిళనాడులోఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. విరుధునగర్ జిల్లా, కట్టనార్‌పట్టిలోని ఓ బాణసంచా ఫ్యాక్టరీలో ఆదివారం భారీ విస్ఫోటనం



## మహిళా బిల్లుపై కేంద్రం తదుపరి అడుగులు ఇవే!

- అన్ని పార్టీలతో మరోసారి చర్చలు జరిపి ఏకాభిప్రాయం సాధించాలని యోచన
- జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే రిజర్వేషన్ల అమలు
- బిల్లును మళ్లీ ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్న ప్రభుత్వం



# పారదర్శకంగా ఉన్నాం.. ప్రజలకు వాస్తవాలు చేరవేయండి:

- పార్టీ ముఖ్య నేతలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపు
- ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమం, అభివృద్ధిలో రాజీపడటం లేదు
- శిక్షణా తరగతులతో లీడర్-కేడర్ మధ్య భావోద్వేగ బంధం
- ఈ నెల 29న టీడీపీ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ
- ప్రజలే ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలి: సీఎం



రాష్ట్ర ప్రభుత్వం పూర్తి పారదర్శకతతో పనిచేస్తోందని, ఈ వాస్తవాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, ప్రత్యర్థులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సంక్షేమం, అభివృద్ధి, ప్రభుత్వ సేవల విషయంలో తాము అనుసరిస్తున్న పారదర్శక విధానాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత నేతలపై ఉందని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న పార్టీ ముఖ్య నేతలతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, తాజా రాజకీయ పరిణామాలపై సమీక్షించారు.రాష్ట్రం ఆర్థికంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ, వాటిని

# చెన్నై జిల్లాకు 'సూపర్ 6' పేరుతో ప్రత్యేక మేనిఫెస్టో

- చెన్నై సూపర్ 6... 20 పాయింట్ల ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేసిన స్టాలిన్
- ఆరు కీలక రంగాల్లో 20 ప్రధాన ప్రకటనలు
- 1000 కొత్త మినీ బస్సులు,
- ఏఐ ఆధారిత ట్రాఫిక్ వ్యవస్థ
- మౌలిక వసతుల ప్రాజెక్టులకు
- కచ్చితమైన గడువులు
- రూ.10,000 కోట్లతో గ్లోబల్ సెంటర్,
- 20,000 ఉద్యోగాల కల్పన



తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, చెన్నై జిల్లాను లక్ష్యంగా చేసుకుని 'చెన్నై సూపర్ 6' పేరుతో ఒక ప్రత్యేక ఎన్నికల మేనిఫెస్టోను ఆదివారం విడుదల చేశారు. నగర మౌలిక సదుపాయాలు, రవాణా, పట్టణ సౌకర్యాలు, భవిష్యత్ ఆర్థిక వృద్ధి వంటి ఆరు కీలక రంగాల్లో మొత్తం 20 హామీలను ఇందులో పొందుపరిచారు.పట్టణ రవాణా వ్యవస్థను మెరుగుపరచడంలో భాగంగా, చివరి మైలు కనెక్టివిటీ కోసం 1,000 కొత్త మినీ బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు డీఎంకే హామీ ఇచ్చింది. ఈ బస్సులు వీధులను బస్టాప్‌లు, మెట్రో స్టేషన్లు,

## పవన్ కళ్యాణ్ గారూ... మీరు త్వరగా కోలుకోవాలి:




- శస్త్రచికిత్స చేయించుకున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- ఆయన త్వరగా కోలుకోవాలంటూ ఆకాంక్షించిన జగన్
- సోషల్ మీడియా వేదికగా స్పందించిన మాజీ సీఎం
- హైదరాబాద్‌లో పవన్‌కు విజయవంతంగా ముగిసిన సర్జరీ

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ శనివారం సాయంత్రం శస్త్రచికిత్స చేయించుకున్న నేపథ్యంలో, వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ స్పందించారు. పవన్ త్వరగా, సంపూర్ణంగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పవన్ కల్యాణ్ కు నిన్న హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ సర్జరీ విజయవంతం అయిందని, ప్రస్తుతం

# అన్న క్యాంటీన్ల కు రూ.76 లక్షల విరాళం ఇచ్చిన నారా భువనేశ్వరి

- ఏప్రిల్ 20న పుట్టినరోజు జరుపుకోనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- రేపు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 269 అన్న క్యాంటీన్లలో పేదలకు ఉచితంగా భోజనం
- ఈ ఏడాది మీ పుట్టినరోజు బహుమానం ఇదే" అంటూ ఆమె చంద్రబాబుకు భువనేశ్వరి విషెస్
- అర్ధాంగిని అభినందించిన సీఎం



## పవన్ కల్యాణ్ త్వరగా కోలుకోవాలి: కేటీఆర్



- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ త్వరగా కోలుకోవాలని కేటీఆర్ ఆకాంక్ష
- సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాక్షేత్రంలోకి రావాలని కేటీఆర్ ట్వీట్
- హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్య మంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ త్వరగా కోలుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆకాంక్షించారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స జరిగిన

# రంగులు మార్చడంలో నరేంద్ర మోదీజీ అభినవ ఊసరవెల్లి

- మహిళా బిల్లుపై ప్రధాని మోదీ రంగులు మారుస్తున్నారని షర్మిల విమర్శ
- రిజర్వేషన్ల అమలుకు డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం కుట్రేనని ఆరోపణ
- చట్టాన్ని వెంటనే అమలు చేసి 543 స్థానాలకు వర్తింపజేయాలని డిమాండ్
- 2029 లోపు కులగణన, శాస్త్రీయ పునర్విభజన పూర్తి చేయాలని సవాల్



మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినవ ఊసరవెల్లిలా రంగులు మారుస్తున్నారని, 33 శాతం రిజర్వేషన్ల అమలుకు అసలు ద్రోహి ఆయనేనని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నారీశక్తి ముసుగులో డీలిమిటేషన్ బిల్లును తెరపైకి తెచ్చిన కపట సూత్రధారి మోదీ అని, ఇప్పుడు ప్రతిపక్షాలపై పెడబొబ్బలు పెడుతూ మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆమె విమర్శించారు. సోషల్ మీడియాలో ఆమె స్పందిస్తూ.. "2023లో పార్లమెంట్ ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని వెంటనే అమలు చేయకుండా, దానికి నియోజకవర్గాల

# పవన్ కల్యాణ్ గారూ... మీరు త్వరగా కోలుకోవాలి

ఆయన కోలుకుంటున్నారని తెలిసింది. ఈ క్రమంలో పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు, అభిమానులు ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగిరావాలని సోషల్ మీడియా వేదికగా ఆకాంక్షలు తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలోనే జగన్ కూడా స్పందించారు. "పవన్ కల్యాణ్ గారు శస్త్రచికిత్స అనంతరం త్వరగా, సంపూర్ణంగా కోలుకోవాలని ఆశిస్తున్నాను" అని తన పోస్టులో జగన్ పేర్కొన్నారు.

# అన్న క్యాంటీన్ల కు రూ.76 లక్షల విరాళం ఇచ్చిన నారా భువనేశ్వరి

రాష్ట్రంలో పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లు, అన్నం పెట్టే అమ్మను తలపిస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అర్ధాంగి నారా భువనేశ్వరి అన్నారు. రేపు (ఏప్రిల్ 20) ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆమె అన్న క్యాంటీన్లకు రూ.76 లక్షల భారీ విరాళాన్ని ప్రకటించారు. ఈ విరాళంతో రేపు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 269 అన్న క్యాంటీన్లలో పేదలకు ఉచితంగా భోజనం అందించనున్నారు. శనివారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో అన్న క్యాంటీన్ సీఈవోకు ఆమె చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ.. లక్షల మంది పేదల కడుపు నింపే మహోన్నత కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం తిరిగి ప్రారంభించడం ఎంతో గొప్ప విషయమన్నారు. కేవలం రూ.5 లకే అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో, గౌరవంగా భోజనం అందించడం అభినందనీయమని కొనియాడారు. రోజువారీ కూలీలు, నిరుపేదలు ఈ పథకం ద్వారా ఎంతో లబ్ధి పొందుతున్నారని, ఏ ఒక్కరూ ఆకలితో ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. చంద్రబాబు పుట్టినరోజున పేదల కడుపు నింపే కార్యక్రమానికి విరాళం ఇవ్వడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని ఆమె పేర్కొన్నారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం కన్నా మించిన సంతృప్తి మరొకటి ఉండదని, తాను పలు సందర్భాల్లో అన్న వితరణలో పాల్గొన్నప్పుడు కలిగిన అనుభూతిని గుర్తుచేసుకున్నారు. తమ మనవడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా కూడా 12 ఏళ్లుగా ఏటా తిరుమల అన్నప్రసాదానికి రూ.44 లక్షలు విరాళంగా ఇస్తున్న విషయాన్ని ఆమె ప్రస్తావించారు. "ఈ ఏడాది మీ పుట్టినరోజుకు మేమిచ్చే బహుమానం ఇదే" అంటూ ఆమె చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.మరోవైపు, తన పేరు మీద అన్న క్యాంటీన్లకు ఒక రోజు అన్నదానానికి భారీ విరాళం ఇచ్చిన అర్ధాంగి భువనేశ్వరిని ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రాష్ట్రంలో అన్నదాన కార్యక్రమాన్ని ఒక గొప్ప యజ్ఞంలా ముందుకు తీసుకెళుతున్నాం. తిరుమలలో భక్తుల సహకారంతో నాలుగు దశాబ్దాలుగా అన్నదానం జరుగుతోంది. అదే స్ఫూర్తితో అన్న క్యాంటీన్ల సేవలను మరింత విస్తరించాలి" అని అన్నారు. నాణ్యతను పాటిస్తూ, పవిత్రంగా, గౌరవంగా ఆహారం అందించే ఈ కార్యక్రమానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి ప్రత్యేక సందర్భాల్లో భోజనానికి అయ్యే ఖర్చును విరాళంగా ఇచ్చేందుకు ప్రజలు ముందుకు రావాలని, తద్వారా ఈ కార్యక్రమం ఒక స్ఫూర్తిదాయక బ్రాండ్‌గా మారాలని ఆకాంక్షించారు.

# రంగులు మార్చడంలో నరేంద్ర మోదీజీ అభినవ ఊసరవెల్లి

పునర్విభజనతో లింకు పెట్టాల్సిన అవసరం ఏమొచ్చింది? మళ్లీ సవరణ బిల్లు తెచ్చి, ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని బీద ఏడుపులు ఎందుకు? రాజకీయ స్వలాభం కోసం విపక్షాలపై శాపనార్థాలు పెట్టడం దేనికి?" అని ప్రధానిని సూటిగా ప్రశ్నించారు. ప్రధాని మోదీకి మహిళల ఆత్మగౌరవంపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే, 'నారీ శక్తి వందన్ అధినియమ్-2023' చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీలిమిటేషన్‌తో ఎలాంటి సంబంధం లేకుండా ప్రస్తుతమున్న 543 పార్లమెంట్ స్థానాల్లోనే మహిళా రిజర్వేషన్లు పాటించాలని కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ అత్యంత శాస్త్రీయంగా జరగాలని షర్మిల అభిప్రాయపడ్డారు. "ముందుగా 2026 జనాభా లెక్కలు అందుబాటులోకి రావాలి. ఆ తర్వాత కులగణన జరిపి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల జనాభా తేల్చాలి. ఈ గణాంకాల ఆధారంగానే డీలిమిటేషన్‌లో రిజర్వేషన్లు కేటాయించాలి. వెనుకబడిన కులాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించి న్యాయం చేయాలి. చిన్న రాష్ట్రాల వాదనలను పరిగణనలోకి తీసుకొని ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపాలి. బీజేపీకి దమ్ముంటే 2029 ఎన్నికలలోపు ఈ ప్రక్రియ మొత్తం పూర్తి చేయాలి" అని ఆమె సవాల్ విసిరారు. "శాశ్వత అధికారం కోసం రాజ్యాంగాన్ని మార్చాలన్న బీజేపీ కుతంత్రాన్ని అడ్డుకోవడంలో విపక్షాలు విజయం సాధిస్తే, ఆడలేక మద్దెల ఓడు అన్నట్లు మహిళలను అడ్డుపెట్టుకుని మోదీ మాట్లాడటం సిగ్గుచేటు. 2029 ఎన్నికల్లో లబ్ధి కోసం రాష్ట్రాల సమైక్యతను దెబ్బతీయాలని చూస్తే విపక్షం గుణపాఠం చెబుతుంది" అని షర్మిల హెచ్చరించారు. చేతనైతే మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేసి చూపాలని, శాస్త్రీయ పద్ధతిలో పునర్విభజన చేపట్టాలని ప్రధాని మోదీకి, మతతత్వ బీజేపీకి, ఎన్డీఏ పక్షాలకు కాంగ్రెస్ పార్టీ తరఫున సవాల్ విసురుతున్నానని ఆమె స్పష్టం చేశారు.

## పవన్ కల్యాణ్ త్వరగా కోలుకోవాలి: కేటీఆర్

నేపథ్యంలో కేటీఆర్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. గత కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న పవన్ కల్యాణ్.. శుక్రవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తుండగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయనకు శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న కేటీఆర్.. "పవన్ కల్యాణ్ గారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆశిస్తున్నాను" అని తన ట్వీట్‌లో పేర్కొన్నారు.


# హైదరాబాదులో ఈదురుగాలులు, వడగళ్ల వాన బీభత్సం

**హైదరాబాద్‌లో పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన**

**గాలివాన ధాటికి నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు**

**హైదరాబాద్ నగరానికి రాత్రి 7 గంటల వరకు వర్ష సూచన**

**మేడ్చల్, రంగారెడ్డి సహా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ**




హైదరాబాద్ నగరంలో ఆదివారం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉదయం నుంచి ఎండలు మండిపోగా, మధ్యాహ్నం తర్వాత ఆకస్మికంగా ఆకాశం మేఘావృతమైంది. నగరంలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. చాలాచోట్ల వడగళ్లు కూడా పడటంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈదురు గాలుల ధాటికి చింతల్, పద్మనగర్ ప్రాంతాల్లో ఒక భారీ చెట్టు వేర్లతో సహా కూలిపోయింది. దీని ప్రభావంతో రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈ ఘటనలో పలు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. అయితే, ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని ప్రాథమిక సమాచారం. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, సికింద్రాబాద్, జీడిమెట్ల, కొంపల్లి, దుండిగల్, నిజాంపేట, బాలానగర్ సహా నగరంలోని అనేక ప్రాంతాల్లో వడగండ్ల వాన ప్రభావం చూపింది. ఇదిలా ఉండగా, హైదరాబాద్‌లో రాత్రి 7 గంటల వరకు భారీ వర్షం కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, వికారాబాద్ సహా మరికొన్ని జిల్లాలకు యెల్లో అలర్ట్ ప్రకటించింది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచించారు.

# వలస జీవితాలపై వాస్తవిక వీక్షణం

వలస వెళ్ళిన ఎన్నారైలు తమ పిల్లలని విదేశంలో సామాజిక రాజకీయ పరిస్థితులని గమనించుకుంటూ కాపాడుకోవాలి. వారికి అవసరమైన చేయూతనివ్వాలి. మారుతున్న సమాజం, టెక్నాలజీ పిల్లలపై మానసికంగా మోపుతున్న బరువు ఎంతటిదో, వారిని కాచుకునే క్రమంలో తల్లిదండ్రుల మానసిక సంఘర్షణ అంతగా ఊహకందనిది, ఇప్పటి దాకా ఎవరూ ప్రస్తావించనిది. ఈ నేపథ్యంలో ఐదు తరాల అమెరికా వలస వాతావరణాన్ని కళ్ళకి కట్టినట్టుగా చూపిస్తూ సుస్మిత రాసిన నవల 'వలస'. ఈ నవల దేశీయ పాఠకుల్ని కూడా సమానంగా ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా రచయిత్రి సుస్మితతో నవల గురించి రెండు ప్రశ్నలు:వలస నవల రాయడానికి ప్రధాన ప్రేరణ ఏమిటి? ప్రధానంగా జెండర్ డిస్ఫోరియాను చర్చించటానికి ఈ నవల రాశారని అనుకోవచ్చా? కోవిడ్ తరువాత జీవితాల్లో వచ్చిపడిన మార్పులకి మూలం ఏమిటనే ఆలోచనలోంచి 'వలస' నవల పుట్టింది. టెక్నాలజీ ఒళ్ళో కూర్చుని పాటలు వింటూ, తిండి తింటూ పెరుగుతున్న పిల్లల మానసిక శారీరక ఆరోగ్యం ఎలా ఉండబోతోందనే ఆలోచనే ఈ నవలకి ప్రేరణ. 'నేనెవరు?' అనే తాత్విక ప్రశ్నకి సమాధానాన్ని హిమాలయ యోగుల దగ్గరనుంచీ, ప్రతీ ఒక్కరూ ఏదో ఒక సందర్భంలో అన్వేషిస్తారు. ఆ ఐడెంటిటీ క్వెస్ట్ – 'గుర్తింపు కోసం అన్వేషణ' జెండర్‌కి సంబంధించినదైనప్పుడు, నూటికి నూరుసార్లు డయాగ్నసిస్ సరైనదే అయుండాల్సిన అవకాశం లేనప్పుడు, జెండర్ ఐడియాలజీ స్కూళ్ళలో, సినిమాల్లో ప్రస్తావిస్తున్నప్పుడు, హార్మోన్ థెరపీలూ, ప్రొసీజర్స్ సామాన్యులకి అందుబాటులోకి వస్తున్న సమయంలో సగటు తల్లిదండ్రులు తెలుసుకోవాల్సిన విషయాలను చర్చకు పెట్టేందుకు 'వలస'లో ప్రయత్నం చేసాను. స్కూళ్ళ నుంచి వచ్చే ఈమెయిల్స్ లో, కార్పొరేట్ ఆఫీసుల్లో సంబోధనలో వచ్చిన మార్పులు చూస్తున్నాం. ఇవి పిల్లల మీద ఎలాంటి ప్రభావాన్ని చూపిస్తున్నాయి, వాటిని తల్లిదండ్రులు ఎలా గమనించాలనేది తీసిపారేయదగిన విషయం కానేకాదు. వృత్తిరీత్యా ఆరోగ్య రంగానికి సంబంధించిన ఆర్థిక సమీకరణాల పట్ల నాకున్న అవగాహన కూడా ఈ నవలా రచనలో ఉపయోగపడింది.ప్రవాస జీవిత అనుభవాల గురించి రాసిన ఈ నవలకు ప్రవాసుల స్పందన ఎలా ఉంది? 'వలస'ని భారతదేశంలో ఉండే తెలుగు పాఠకులు ముందుగా అక్కునచేర్చుకుని ఆదరించారు. నవల భారత్‌లో అచ్చవడం, మార్కెట్‌లో ముందుగా అందుబాటులోకి రావడం వలన వెంటనే చదివి స్పందించినది వారే. ప్రవాస భారతీయులు 'వలస'లోని పాత్రలలో తమని తాము చూసుకున్నామని, బయటకు చెప్పేందుకు తటపటాయించే విషయాలని ప్రస్తావించడం బావుందని సంతోషపడ్డారు. ఉదాహరణకి ఇందులోని కమల పాత్ర విజిటర్లుగా అమెరికా వచ్చిన తల్లిదండ్రులందరికీ ఇదొక జైలు జీవితమన్నట్టు రాసే కథల స్టీరియో టైప్‌ని బద్దలుగొడుతుంది. అమెరికా జీవితాన్ని చాలా ఆస్వాదించే తల్లిదండ్రులు కూడా ఉంటారు. అమెరికా జీవనమొక అద్భుతమన్నట్టు కానీ, కాదని కానీ నేనెక్కడా వకాల్తా తీసుకోలేదు. సాధకబాధకాల్ని ఉన్నదున్నట్టు చూపించాను. నవల చదివిన చాలామంది ఎన్నారైలకి అది నచ్చింది.

# నేను మరిచినా నన్ను మరువని నేస్తం

ఎనభైల తొలి రోజులనుంచి నేను కవితలు రాస్తూనే ఉన్నా వాటిలో పత్రికలకు పంపించినవి దాదాపు లేవనే చెప్పాలి. రాసినవి మిత్రులతో పంచుకోవటంతోనే సరిపెట్టేవాడిని. ఇస్మాయిల్ గారు పుస్తకం వేసుకోమని చెప్పిన కొన్ని సంవత్సరాల తరువాత, 1993లో ఆ ప్రయత్నం మొదలుపెట్టాను. అప్పటికి నా వయసు 29 కావటంతో, రాసిన ఎన్నో కవితలలోనుంచి 29 మాత్రమే ఎంచి, టైపుసెట్టింగ్ చేయించాను. అధికార భాషా సంఘం సభ్యునిగా ఇస్మాయిల్ ఒక సమావేశానికి వచ్చిన సందర్భంలో దిల్-కుష్ గెస్టుహౌసుకి వెళ్ళి కలిసినప్పుడు, నన్ను చూడగానే, తెల్ల కాగితాల మీద తన అందమైన దస్తూరితో రాసిన ముందుమాటను అందించారు. అది చదివినప్పుడు ఎంతో ఆనందం కలిగింది. ఆయన సలహా మేరకు శీలా వీర్రాజు గారిని అడిగితే ఆదరంతో ముఖచిత్రం వేసి ఇచ్చారు. ఇస్మాయిల్ కవిత్వ సంపుటి 'చిలకలు వాలిన చెట్టు' మీద అభిమానంతో నేనూ ఈ పుస్తకాన్ని క్రౌన్ సైజులో తెచ్చినా, స్టాండర్డ్ సైజయిన 1/8 డెమ్మీలో తీసుకువస్తేనే బాగుండేదని ఇప్పుడు అనిపిస్తుంది. అర్భకంగా కనిపించే ఆ పుస్తకం అద్భుతాలు చేస్తుందనే ఆశలేవీ లేకపోవటంతో, మొదటి ప్రతి అందుకున్నప్పుడు మదిలో కోటి వీణలు మ్రోగటం లాంటివేమీ జరగలేదు. ముఖచిత్రం తడి వాసన మాత్రం గుర్తుంది. ఒకసారి పుస్తకం వచ్చాక ఆవిష్కరణ సభను ఏర్పాటు చేసే పనిని చిరకాల కవిమిత్రుడు శిఖామణి తన భుజాల మీద వేసుకున్నాడు. నాకెవరూ పెద్దగా పరిచయం లేకపోవడంతో, తనే పూనుకొని నారాయణరెడ్డిగారిని ఆవిష్కర్తగా, చేరాగారిని అధ్యక్షునిగా, శివారెడ్డిగారిని వక్తగా ఒప్పించాడు. నా కోరిక మేరకు అంపశయ్య నవీన్ గారు మరొక వక్తగా పాల్గొన్నారు. ఆవిష్కరణ రోజు ఏర్పాట్లలో సహకరించిన నా సోదరులు వక్తల ముందు ఉంచే గ్లాసులలో కొబ్బరి నీళ్లు నింపారు. శివారెడ్డి తన ప్రసంగంలో, మామూలు నీళ్ళనుకొని తాగితే అవి కొబ్బరి నీళ్ళని, అలాగే మామూలు కవిత్వమనుకొని పుస్తకం తెరిస్తే అద్భుతమైన కవిత్వం కనిపించిందని చమత్కరించారు. అయితే ఆ తరువాత తన మెప్పుదలను కొంతవరకు ట్రిమ్ చేశారనుకోండి. అంతేకాకుండా, ముందుమాటలో ఇస్మాయిల్ గారు సమకాలీన కవిత్వం గురించి చేసిన వ్యాఖ్యల మీద తీవ్రమైన విమర్శ చేసి, నా కవిత్వం తనలో కలిగించని కాకను తన మాటలతో సభలో కలిగించగలిగారు. చేరాగారి అధ్యక్షోపన్యాసమే తరువాత చేరాతల్లో రెండు వారాలపాటు సమీక్షగా వచ్చింది. అరుదైన కవిగా తను పేర్కొన్న నాకు, ఆయనిచ్చిన అరుదైన కానుక అది. సమీక్షలతోపాటు, ఆరుద్ర, ఆర్.ఎస్.సుదర్శనం, మో, ఎన్.గోపి, జయప్రభ వంటి వారు రాసిన ఉత్తరాలు ఉత్సాహం నింపాయి. హైదరాబాదులో ఎంతోమంది కవి మిత్రుల విలువైన పరిచయం లభించింది. ముకుంద రామారావు, వి.ఆర్. విద్యార్థి వంటి ఆత్మీయులు ఏర్పడ్డారు. అప్పట్లో కె.సదాశివరావుగారు కవుల పోర్ట్రయిట్ ఫోటోలు తీసి, వాటిలో రెండిటిని లామినేట్ చేసి గిఫ్టుగా ఇచ్చే ఒక ప్రాజెక్టులో నా ఫోటో కూడా తీసారంటే దానికి కారణం ఈ పుస్తకమే. ఐదు సంవత్సరాల తరువాత అమెరికా ప్రయాణానికి ఆకాశంలో పైకి లేచేవరకు అప్పటి హైదరాబాద్ మిత్రుల స్నేహపరిమళం నన్ను చుట్టుకునే ఉంది. గత నవంబర్లో ఇండియా వచ్చినప్పుడు శివారెడ్డిగారిని కలవడానికి వెళితే, రవిశంకర్ పేరు విన్న వారి శ్రీమతికుండీలో మర్రిచెట్టు కవేనా అని అడిగి నన్ను ఆశ్చర్యపరిచారు. చివరి పుస్తకం వీలునామా అవదేమోగాని, మొదటి పుస్తకం చిరునామా కావటం సాధ్యమే. ఏ కవికైనా అది గొప్ప అదృష్టం. నేను మరిచిపోయినా నన్ను మరువని తొలినాళ్ళ నేస్తం, కవితా సోపానంలో నేను ఏ మెట్టు మీద ఉన్నా, ఆదరంతో నా వైపు చూస్తూ ప్రోత్సహించే తొలిమెట్టు నా 'కుండీలో మర్రిచెట్టు'.




# ఒప్పందానికి ఒప్పుకోకపోతే విధ్వంసమే..

ఒప్పందానికి అంగీకరించకపోతే ఇరాన్‌లోని ప్రతి విద్యుత్ కేంద్రాన్ని, ప్రతి వంతెనను నాశనం చేస్తామని స్పష్టం చేశారు. అయితే, ఇదే సమయంలో ఇరు దేశాల మధ్య చర్చల కోసం రేపు (ఏప్రిల్ 20న) అమెరికా ప్రతినిధి బృందం పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌కు వెళ్లనుందని వెల్లడించారు ఈ మేరకు ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ఒక పోస్ట్ చేశారు. "మేం చాలా న్యాయమైన ఒప్పందాన్ని ప్రతిపాదిస్తున్నాం. దానికి వారు అంగీకరిస్తారని ఆశిస్తున్నాం. ఒకవేళ ఒప్పుకోకపోతే, ఇరాన్‌లోని ప్రతి విద్యుత్ కేంద్రాన్ని, ప్రతి వంతెనను అమెరికా కూల్చేస్తుంది. ఇకపై మంచిగా వ్యవహరించేది లేదు" అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇరాన్ హంతక యంత్రాంగాన్ని అంతం చేసే సమయం వచ్చిందని, గత 47 ఏళ్లుగా ఇతర అధ్యక్షులు చేయలేని పనిని తాను చేస్తానని అన్నారు. గతంలో ఏప్రిల్ 11న ఇస్లామాబాద్‌లో పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిలిపివేయాలని అమెరికా డిమాండ్ చేయగా, తమపై విధించిన ఆంక్షలు ఎత్తివేసి, స్తంభింపజేసిన ఆస్తులను విడుదల చేయాలని ఇరాన్ కోరింది. ఆ చర్చలు విఫలమవ్వడంతో హార్మూజ్ జలసంధిలో అమెరికా నావికాదళ దిగ్బంధనం విధించగా, దానికి ప్రతిగా ఇరాన్ ఆ జలసంధిని మూసివేసింది. కాగా, హార్మూజ్ జలసంధిలో ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ట్రంప్ ఆదివారం ఆరోపించారు. ఫ్రాన్స్, బ్రిటన్‌కు చెందిన నౌకలపై ఇరాన్ కాల్పులు జరిపిందని తెలిపారు. జలసంధిని మూసివేయడం వల్ల ఇరాన్‌కే రోజుకు 500 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లుతుందని అన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరిన నేపథ్యంలో సోమవారం జరగనున్న చర్చలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# తమిళనాడులో ఘోర విషాదం...

సంభవించింది. ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు 18 మంది కార్మికులు మరణించినట్లు తెలుస్తోంది.ప్రమాద తీవ్రతకు మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాక్టరీలో ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. అయితే, విస్ఫోటనానికి దారితీసిన కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ దుర్ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. "కట్టనార్‌పట్టి బాణసంచా ఫ్యాక్టరీలో జరిగిన విస్ఫోటనంలో పలువురు మరణించారన్న వార్త తీవ్ర వేదనకు గురిచేసింది" అని ఆయన తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాలని మంత్రులు కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, తంగం తెన్నరసులను సీఎం స్టాలిన్ ఆదేశించారు. బాధితుల కుటుంబాలకు అండగా నిలవాలని సూచించారు. జిల్లా కలెక్టర్‌తో కూడా మాట్లాడి, అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

# మహిళా బిల్లుపై కేంద్రం తదుపరి అడుగులు ఇవే!

దేశ రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారిన మహిళా రిజర్వేషన్ బిల్లు (నారీ శక్తి వందన్ అధినియం) అమలు ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) తర్వాతే రిజర్వేషన్లు అమలవుతాయని చెప్పడంపై విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్న నేపథ్యంలో, ఈ అడ్డంకులను అధిగమించేందుకు కేంద్రం కొత్త వ్యూహంతో ముందుకు సాగుతోంది.ఈ బిల్లు అమలుకు సంబంధించి ఏకాభిప్రాయం సాధించేందుకు, త్వరలోనే అన్ని రాజకీయ పార్టీలతో మరోసారి విస్తృత స్థాయి చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి వ్యక్తమవుతున్న ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని, అందరినీ కలుపుకొని పోవాలని యోచిస్తోంది. డీలిమిటేషన్ ప్రక్రియపై నెలకొన్న గందరగోళాన్ని నివారించేందుకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసే అవకాశాన్ని కూడా పరిశీలిస్తోంది. అయితే, జనాభా లెక్కల సేకరణ పూర్తయితేనే డీలిమిటేషన్ చేపట్టడం సాధ్యమవుతుంది. అందుకే, ముందుగా సెన్సస్ ప్రక్రియను పూర్తి చేసి, ఆ తర్వాతే రిజర్వేషన్ల అమలు దిశగా అడుగులు వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి రిజర్వేషన్లను అమలు చేయడం ద్వారా మహిళా ఓటర్ల మద్దతును కూడగట్టుకోవడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. మరోవైపు, డీలిమిటేషన్ ప్రక్రియతో సంబంధం లేకుండా మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, అవసరమైన సాంకేతిక మార్పులతో బిల్లును తిరిగి పార్లమెంటులో ప్రవేశపెట్టే అంశాన్ని కూడా కేంద్రం పరిశీలిస్తున్నట్లు సమాచారం.

# పారదర్శకంగా ఉన్నాం.. ప్రజలకు వాస్తవాలు చేరవేయండి:

ఒక్కొక్కటిగా అధిగమిస్తూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడకుండా ముందుకెళుతున్నామని చంద్రబాబు వివరించారు. ఈ కష్టాన్ని, ప్రభుత్వం పడుతున్న శ్రమను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని సూచించారు. ప్రభుత్వంపైనా, కూటమి పార్టీలపైనా కొందరు పనిగట్టుకుని అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, వివిధ మార్గాల ద్వారా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే ప్రయత్నం చేస్తున్నారని, ఈ కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని స్పష్టం చేశారు.

"ప్రజలకు వాస్తవాలు తెలిస్తే వారే విశ్లేషించుకుంటారు. పరిపాలనలో ప్రభుత్వం పడుతున్న కష్టాన్ని వారికి వివరిస్తే, ప్రత్యర్థుల కుట్రలను తిప్పికొట్టేలా ప్రజలే ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారతారు" అని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. గత ఎన్నికల్లో నాటి ప్రభుత్వం ఎన్ని అణచివేత చర్యలకు పాల్పడినా, ప్రజలు వాస్తవాలను గ్రహించి కూటమికి అద్భుతమైన విజయాన్ని అందించారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేయడమే మన ప్రధాన బాధ్యత అని ఆయన అన్నారు.పార్టీలో నేతలకు, కార్యకర్తలకు మధ్య భావోద్వేగ బంధాన్ని బలోపేతం చేసేందుకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు, 'కాఫీ కబుర్లు' వంటి కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయని చంద్రబాబు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తరగతుల ద్వారా పార్టీ సిద్ధాంతాలను వివరించడంతో పాటు, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఫీడ్‌బ్యాక్ తీసుకునే అవకాశం కలుగుతోందని తెలిపారు. పార్టీ కార్యకర్తల కుటుంబాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, వారి విద్య, వైద్యం, ఉపాధి కోసం 'ఎథిక్ ఎకనమిక్ ఎంపవర్‌మెంట్' అనే వ్యవస్థను సమగ్రంగా తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు.ఈ నెల 29వ తేదీన పార్టీ నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించనుందని, దీనికి సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయని నేతలు ముఖ్యమంత్రికి తెలియజేశారు. అలాగే, త్వరలో జరగనున్న మహానాడు నిర్వహణ కమిటీల ఏర్పాటుపైనా కసరత్తు చేస్తున్నట్టు సీఎంకు వివరించారు.

# చెన్నై జిల్లాకు 'సూపర్ 6' పేరుతో ప్రత్యేక మేనిఫెస్టో

రైల్వే హబ్‌లతో కలుపుతాయి. దీనికి తోడు, ట్రాఫిక్ రద్దీని తగ్గించి, ప్రయాణ సమయాన్ని 25 శాతం వరకు తగ్గించేందుకు ఏఐ (ఏఐ) ఆధారిత ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను తీసుకొస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు.కీలకమైన మౌలిక వసతుల ప్రాజెక్టుల పూర్తికి స్పష్టమైన గడువులను నిర్దేశించారు. ఎన్నూర్ నుంచి పూంజేరి వరకు చెన్నై పెరిఫెరల్ రోడ్ ప్రాజెక్టుతో సహా పదికి పైగా ప్రధాన పథకాలను 2027 నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. మెట్రో రైలు విస్తరణ, స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పనులను 2028 నాటికి, భూగర్భ డ్రైనేజీ ప్రాజెక్టులను 2027 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2029 నాటికి ప్రపంచ స్థాయి రహదారి మౌలిక వసతులను కల్పిస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్ ఆర్థిక వ్యవస్థను దృష్టిలో ఉంచుకుని, రూ.10,000 కోట్ల పెట్టుబడితో 'గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఏఐ, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్ వంటి రంగాలపై దృష్టి సారించే ఈ కేంద్రం ద్వారా 20,000 అధిక వేతన ఉద్యోగాలను సృష్టిస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు, వీధికుక్కల సమస్యకు శాస్త్రీయ పరిష్కారంగా, యానిమల్ బెర్త్ కంట్రోల్ కార్యక్రమాన్ని బలోపేతం చేస్తామని, వెటర్నరీ వైద్యులు, డాగ్ క్యాచర్ల సంఖ్యను మూడు రెట్లు పెంచుతామని తెలిపారు. వీటితో పాటు, మెట్రో వాటర్ కనెక్షన్లు లేని ప్రాంతాల్లో ఆర్వో ప్లాంట్లు, అన్ని నివాస ప్రాంతాల్లో హై-ఇంటెన్సిటీ వీధి దీపాలు వంటి హామీలను కూడా ఈ మేనిఫెస్టోలో పొందుపరిచారు.

# కిరాతకంగా కరీముల్లా దారుణ హత్య



## పైశాచికత్వానికి నిండు ప్రాణం బలి

**బండిఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 19:** కొందరు దుర్మార్గుల వైశాచికత్వానికి ఓ నిండు ప్రాణం బలైపోయింది. సొంత బావనే బావమరుదులు అత్యంత దారుణంగా, అతి కిరాతకంగా, పదునైన ఆయుధాలతో హత్య చేశారని హతుడి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. బండి ఆత్మకూరుకు చెందిన షేక్ కరిముల్లా (28) అనే యువకుడు కొత్తపల్లి మెట్ట వద్ద శనివారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. నిందితులు ఓ పథకం ప్రకారం కరీముల్లాను హతమార్చినట్లుగా తెలుస్తోంది. బండి ఆత్మకూరు చెందిన కరీముల్లా కు నంద్యాలలోని నడిగడ్డ ప్రాంతానికి చెందిన సలోమ అలియాస్ కరిష్మా అనే మహిళతో ఐదు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. సలోమాకు ఇదివరకే మేనత్త కొడుకుతో వివాహం జరిగింది. వీరి కుటుంబంలో కలహాలు ఏర్పడడంతో పెళ్లయిన ఆరు నెలలకే కొంత సొమ్ము ముట్ట చెప్పి ఆమెను వదిలించుకున్నాడని తెలుస్తోంది. తర్వాత బండి ఆత్మకూరుకు చెందిన కరిముల్లా తో సలోమకు వివాహం జరిగింది. వివాహం జరిగిన నాటినప్పటి నుండి వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతూ ఉండేవని తెలుస్తోంది. మధ్యలో పెద్ద మనుషులు జోక్యం చేసుకుంటూ ఉండటంతో గొడవలు కాస్త సద్దుమణుగుతూ ఉండేవి. అప్పటివరకు కుటుంబ సభ్యులందరూ కలిసి ఉంటుండగా కొద్ది కాలం క్రితమే కరిముల్లా భార్యని తీసుకొని బండి ఆత్మకూరులోని కొత్త కొట్టాలలో నివాసం ఉంటున్నాడు. ప్రతి విషయంలో తనదే పై చేయిగా ఉండాలంటూ సలోమ గొడవ పడుతూ ఉండేదని సమాచారం. గొడవలు జరిగిన ప్రతిసారి సలోమ తన ముగ్గురు అన్నదమ్ములకు సమాచారం అందిస్తూ ఉండటంతో, ముగ్గురు అన్నదమ్ములు బావ కరిముల్లాను తరచూ బెదిరిస్తూ ఉండేవారని కూడా తెలుస్తోంది. 15 రోజుల క్రితం భార్యాభర్తలు ఇరువురు గొడవపడ్డారు. ఇంట్లో తన భార్య సలోమ బిర్యానీ వండటం తో ఇది చూసిన కరిముల్లా తమ తల్లిదండ్రులకు బిర్యాని తీసుకొని వెళ్తానని చెప్పడంతో భార్య ఆగ్రహించి వాదనకు దిగిందని తెలుస్తోంది. దీనిపై ఆగ్రహించిన కరిముల్లా భార్యపై చేయి చేసుకున్నట్లుగా సమాచారం. ఈ విషయాన్ని సలోమ నంద్యాలకు వెళ్లి మరల అన్నదమ్ములకు చెప్పడంతో వారు కరీముల్లా పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిన్ను చంపేస్తామని బెదిరించారని తెలుస్తోంది. బావమరుదులు తనను చంపివేస్తామని బెదిరించడంతో ఆనాటి నుండి రోజు కరిముల్లా తాగడం మొదలుపెట్టాడు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు కూడా చెప్పుకొని వినిపించినట్లుగా తెలుస్తోంది. భార్యాభర్తలు గొడవ పడిన తర్వాత సలోమ పుట్టింటికి వెళ్ళిపోయింది. మూడు రోజుల క్రితం కరిముల్లా తల్లిదండ్రులు మద్దూరులో తమ బంధువుల వివాహానికి వెళ్లిపోయారు. కరీముల్లాను వివాహానికి రమ్మని శనివారం తల్లిదండ్రులు ఫోన్ చేసి చెప్పారు. ఈరోజు తన భార్య ఇంటికి వస్తుందని తల్లిదండ్రులతో కరిముల్లా చెప్పడం జరిగింది. తర్వాత తండ్రి జాకీర్ హుస్సేన్ రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో కొడుకుకు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అయినట్లుగా వచ్చింది. అప్పటికే కరిముల్లా భార్య బండి ఆత్మకూరుకు వచ్చింది. అదే సమయంలో ద్విచక్ర వాహనాలపై ఐదుగురు వ్యక్తులు వచ్చి కరిముల్లాను తీసుకొని వెళ్ళినట్లుగా పలువురు చర్చించుకుంటున్నారు. కరీముల్లాను వాహనాలపై తీసుకెళ్లిన వ్యక్తులు కొత్తపల్లి మెట్ట వద్ద వాహనాలను ఆపి రోడ్డుపైనే కరీముల్లాను అతి దారుణంగా ఛా తిపై, చేతులపై పదునైన ఆయుధాలతో పొడిచినట్లుగా తెలుస్తోంది. దీనితోపాటు మెడ వెనుక భాగంలో కూడా దారుణంగా నరికి, పొట్టలో కూడా పొడవడంతో పేగులు బయటికి వచ్చాయి. కరిముల్లా శరీరంపై 15 కు పైగా కత్తిపోట్లు పడ్డాయని తెలుస్తోంది. దీంతో కరిముల్లా అక్కడికక్కడే మృతి చెందడంతో కరిముల్లా మృతదేహాన్ని పొలాల్లో తోసి వెళ్లిపోయారు. హత్య చేసిన అనంతరం కొందరు నిందితులు బండి ఆత్మకూర్ కు వచ్చి తిరిగి హతుడి భార్య సలోమను నంద్యాలకు ద్విచక్ర వాహనంపై తీసుకొని వెళ్ళినట్లుగా తెలుస్తోంది. కరిముల్లా హత్యకు గురైనట్లుగా ఆదివారం నాడు బండి ఆత్మకూరులో దావనలంలా వ్యాపించడంతో గ్రామంలో బంధువులు, స్నేహితులు ఒక్కసారిగా షాక్ కు గురయ్యారు. కరిముల్లా హత్యకు గురి కావడం ఏమిటి అని ఆందోళనకు గురయ్యారు. అందరికీ అందుబాటులో ఉంటూ గ్రామంలో మంచి వ్యక్తిగా పేరు సంపాదించుకున్న కరిముల్లా హత్యకు గురైన సంఘటనను తలుచుకొని అందరూ కలవరపాటు కు గురయ్యారు. పాలిష్ కట్టర్ గా పనిచేస్తున్న కరీముల్లా కొంత కాలం నుండి హమాలీ పని చేస్తూ బ్రతుకుతున్నాడు. ఇలాంటి పరిస్థితులలో కరిముల్లా హత్యకు గురికావడం అందరిని దిగ్భ్రాంతికి గురిచేసింది. సంఘటన తెలిసిన వెంటనే కరీముల్లా తల్లిదండ్రులు నంద్యాల ప్రభుత్వాసుపత్రికి చేరుకొని బో రున విలిపించారు. తమ కొడుకు హత్యకు గురి కావడానికి అతని బావమరుదులు ముగ్గురే కారణమని తల్లి నజీమున్ ఆరోపిస్తూ ఉంది. తనను చంపేస్తారని తన కొడుకు తరచుగా తనతో చెబుతూ ఉండేవాడని పేర్కొంది. కరీముల్లా హత్యకు గురైన సంఘటన స్థలాన్ని నంద్యాల అడిషనల్ ఎస్పీ జావలితోపాటు తాలూకా పోలీసులు వచ్చి పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

**సీసీ కెమెరాలే ఆధారం** కరిముల్లా ను హత్య చేసిన వ్యక్తులను గుర్తించాలంటే పోలీసులు బండి ఆత్మకూరులో



ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలపైనే ఆధార పడాల్సి ఉంటుంది. బండి ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ పై భాగంలో ఉన్న కొత్త కొట్టాలలో కరిముల్లా నివాసం ఉంటున్నాడు. నిందితులు కరిముల్లాను హత్య చేయకముందు పోలీస్ స్టేషన్ పై నుండి కొత్తకోట్టాలకు వెళ్లి అతనిని తీసుకొని వెళ్లారని తెలుస్తోంది. బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్ లో కూడా సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు. స్టేషన్కు ఎవరు వస్తున్నారు ? ఎవరు వెళు తున్నారు? అన్న విషయాలను గుర్తించేందుకుగాను పోలీసులు స్టేషన్లో సీసీ కెమెరా ఏర్పాటు చేశారు. కెమెరా లోపలి భాగంలో ఉన్న కారణంగా పోలీస్ స్టేషన్కు వచ్చిపోయే వ్యక్తులు మాత్రమే కెమెరాలో రికార్డు అవుతారు. బయట ప్రాంతంలో తిరిగే వ్యక్తులు కెమెరాలో నమోదు కారు. పోలీస్ స్టేషన్లో కాకుండా, జ్యోతి పబ్లిక్ స్కూల్ ప్రాంతంలోనూ, బస్టాండ్ ప్రాంతంలోనూ పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ కెమెరాలను పరిశీలిస్తే, నిందితులను సులభంగా గుర్తుపట్టే అవకాశం ఉంటుంది. పోలీసులు ఆ దిశగా కూడా ప్రయత్నాలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. నెల రోజుల క్రితం బండి ఆత్మకూరులో జరిగిన ఓ దొంగతనం కేసులో నిందితుడిని సీసీ కెమెరాల ఆధారంగానే గుర్తించి అరెస్టు చేసి రిమాండ్కు పంపడం జరిగింది.



# ప్రతిపక్షాల విజయం కాంగ్రెస్ పార్టీ.

### దాసరి చింతలయ్య. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు.



**నంద్యాల ప్రతినిధి. ఏప్రిల్ 19. (నంది పత్రిక):**మహిళా రిజర్వేషన్ పేరిట బీజేపీ చేసిన మాయోపాయం పారలేదు. అక్రమ చట్టాలకు అవనిని అడ్డుపెట్టి ఆమోదించాలనే కుతంత్రం నిలబడలేదు. సాధికారిత పేరుతో సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీయాలన బీజేపీ కుయుక్తులు చెల్లలేదు. ఎన్డిఏ అధర్మంపై, ఐ ఎన్ డి ఐ ఏ కూటమి ధర్మయుద్ధం గెలిచింది. ప్రజాస్వామ్యం నిలబడింది. ఇది భారత దేశ ప్రజల విజయం. – బీజేపీ రాజకీయ దురుద్దేశ్యానికి ఇది నిజంగా చరమ గీతం.– మహిళల పేరుతో నీచ రాజకీయాలు చేసిన ప్రధాని నరేంద్ర మోడీజీకి మత పిచ్చి బీజేపీకి ఇది చెంపపెట్టు. వీగిపోయింది అతి గతి లేని డీ లిమిటేషన్ బిల్లే తప్పా మహిళా బిల్లు కాదు.విపక్షం ఎన్నడూ మహిళా రిజర్వేషన్ బిల్లుకు వ్యతిరేకం కాదు. నారీ పేరుతో తెచ్చింది డీ లిమిటేషన్ బిల్లు మాత్రమే. –ఇవ్వాళ వీగిపోయింది. నియోజక వర్గాల పునర్విభజన బిల్లే. ప్రతిపక్షాలు తిప్పికొట్టింది కేవలం రాజ్యాంగాన్ని మార్చే కుట్రనే. మహిళా బిల్లుకు ఆమోదం దక్కింది 2023 లోనే, ప్రతిపక్షాలపై బురదజల్లడం మాని ఇప్పటికైనామహిళా రిజర్వేషన్ బిల్లు–2023 తక్షణం అమలు చేయాలి. బీజేపీకి మహిళలపై చిత్తశుద్ధి ఉందన్న మాటను నిరూపించుకోవాలి. 543 స్థానాలకు వెంటనే 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు.

# నేడు ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ

### వేసవి దృష్ట్యా సమయ మార్పు - ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 1:00 వరకు



**నంద్యాల బ్యూరో, ఏప్రిల్ 19(నంది పత్రిక):–** జిల్లా వ్యాప్తంగా ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు నేడు (సోమవారం) ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం నంద్యాల జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాలు మరియు మున్సిపల్ కార్యాలయాల్లో ఒకేసారి నిర్వహించబడుతుందన్నారు. వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని కార్యక్రమాన్ని ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ అర్జీలను ప్రత్యక్షంగా సమర్పించడమే కాకుండా వెబ్‌సైట్ ద్వారా ఆన్లైన్‌లో కూడా నమోదు చేసుకునే సౌకర్యం కల్పించబడిందన్నారు. అర్జీల పరిష్కార స్థితిని అదే వెబ్‌సైట్‌లో లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు ముందుగా తమకు సంబంధించిన మండల, డివిజన్ లేదా మున్సిపల్ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు సమర్పించాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలనే జిల్లా స్థాయి వేదికకు తీసుకురావాలని సూచించారు. జిల్లా కేంద్రంలో ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి సంబంధిత శాఖల అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# వైసిపి నుంచి 250 కుటుంబాలుటిడిపిలోకి చేరిక






### తెలుగుదేశం పార్టీ వల్లే రాష్ట్ర అభివృద్ధి టిడిపి సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు

**నంది పత్రిక ఆదోని ప్రతినిధి** ఆదోని పట్టణంలో అరుణ్ జ్యోతి నగర్ వాసులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి తెలుగుదేశం పార్టీలోకి భారీగా చేరిక కావడం జరిగింది. ఈ సందర్భంగా ఆదోని నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు మీనాక్షి నాయుడు , టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు ,వారికి తెలుగుదేశం పార్టీ చేరిన మారెప్ప,భూపతి, నారాయణ, ఎతిరాజు, అశోక్, చిన్న తాయన్న, నరసన్న, రవి, మీరు వెంట 250 కుటుంబాలకు కండువా వేసి ఘనంగా తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు.

**ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు అన్నగారు మాట్లాడుతూ** ..ఆదోని పట్టణంలోని అరుణ్ జ్యోతి నగర్ నుండి ఈరోజు 250 కుటుంబాలు తిరిగి తెలుగుదేశం పార్టీలో చేరడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇవి మొదటి నుంచే తెలుగుదేశం పార్టీలో పాత కుటుంబాలేనని, కొన్ని వ్యక్తిగత సమస్యలు మరియు పరిస్థితుల కారణంగా కొంతకాలం వేరే పార్టీలో ఉన్నారని తెలిపారు. ఇప్పుడు మళ్లీ తమ సొంత ఇంటి వంటి తెలుగుదేశం పార్టీలోకి చేరడం పార్టీ బలోపేతానికి నిదర్శనమని అన్నారు. నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఆదోని పట్టణంలో తెలుగుదేశం పార్టీ మరింత బలపడుతుందని ధీమా వ్యక్తం చేశారు.నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ మాత్రమే రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తుందని, పార్టీ అధినేతల నాయకత్వంపై నమ్మకంతో ప్రజలు ముందుకు వస్తున్నారని అన్నారు. పార్టీలో చేరిన వారందరికీ స్వాగతం పలుకుతూ, వారికి తగిన గుర్తింపు, గౌరవం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ ఆదోని పట్టణ అధ్యక్షులు తిమ్మప్ప, మండల అధ్యక్షులు శివప్ప, సిద్ధలక్ష్మీనారాయణ, సంజీవ్,జయరాం, చిట్టిబాబు,పర్శవీరేష్, నాగరాజ్, శివ,వలమన్న వార్డ్ నాయకులు అమర్ ప్రకాష్, రామలింగ, ఈరన్న, నాగరాజ్, కృష్ణ, నరసన్న, ఇక వార్డ్ నాయకులు పాల్గొన్నారు

# చర్చి నిర్మాణాలకు రూ. 40వేల ఆర్థిక సహాయం చేసిన వైఎస్సార్ సీపీ నేత జక్కయ్య



**మంత్రాలయం,నంది న్యూస్ :–** నందవరం మండల కేంద్రం ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న ఇండియన్ ఎంబి చర్చ్ నిర్మాణానికి అలాగే ఎమ్మిగనూరు నియోజకవర్గంలో నిర్మిస్తున్న యెహోషువ, తండ్రి కుమార పరిశుద్ధాత్మ చర్చి నిర్మాణానికి, బూదురు గ్రామ వైసిపి నాయకుడు మీనిగి జక్కయ్య, ఒక్కో చర్చికి రూ. 20 వేల చొప్పున రెండు చర్చిలకు రూ. 40వేల ఆర్థిక సహాయం చేశారు. మంత్రాలయం మండలం బూదూరు గ్రామంలోజక్కయ్య స్వగృహం నందు సంఘ పెద్దలకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జక్కయ్యకు షాలువ కప్పి పూలమాలతో సన్మానించారు. సంఘపెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.సంఘ పెద్దలు ప్రభుదాస్ ,దేవ సహాయం,కిషోర్,నరసన్న, లాజరు,బుడ్డన్న,దేవదాస్, తదితరులు పాల్గొన్నారు

# సంకల్ప సేవకుడికి సన్మానం

### బదిలీపై వెళ్తున్న కమిషనర్ విశ్వనాథ్‌కు అధికారుల సత్కారం

### సమిష్టి సహకారంతోనే మార్పు సాధ్యమైంది



**కర్నూలు నంది పత్రిక బ్యూరో...** కర్నూలు నగర రూపురేఖలు మార్చాలనే సంకల్పంతో ఎన్నో వినూత్న కార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందిన పి.విశ్వనాథ్‌కు అధికారులు ఘనంగా సత్కరించారు. బదిలీపై వెళ్తున్న కమిషనర్‌కు ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. కమిషనర్ పనితీరును అభినందించిన అధికారులు, సిబ్బంది, శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అనతి కాలంలోనే క్లీన్ అండ్ గ్రీన్ సిటి, ప్రక్షాళనలు, వినూత్న కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించామంటే, కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది సహకారం ఎంతో కీలకమన్నారు. అందరి సమిష్టి కృషితోనే అన్నింటా అగ్రస్థానంలో ఉన్నామన్నారు.కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం.రఘు, ఆర్వో స్వర్ణలత, కార్యదర్శి నాగరాజు, ఎంఈ గిరిరాజ్, సూపరింటెండెంట్లు సుబ్బన్న, మంజూర్ బాష, నాగరాజు, రామకృష్ణ, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, బిల్డింగ్ ఇంస్పెక్టర్లు, డిఈలు, ఏఈలు, శానిటేషన్ ఇంస్పెక్టర్లు, ఆర్ఐలు, పాల్గొన్నారు.



# పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ప్రతిభకు పట్టాభిషేకం కార్యక్రమం

**నంద్యాల ప్రతినిధి. ఏప్రిల్ 19 . (నంది పత్రిక ):**ఉమ్మడి కర్నూలు జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో భీమనపల్లె వెంకటసుబ్బయ్య అధ్యక్షతన ఆదివారం శ్రీ చౌడేశ్వరి దేవస్థానం బయటి పేట నంద్యాల నందు చెన్న వెంకటేశ్వర్లు చేత ప్రతిభకు పట్టాభిషేకం కరపత్రం ఆవిష్కరించడం జరిగినది.ఉమ్మడి కర్నూలు జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పద్మశాలి విద్యార్థిని విద్యార్థులకు తమ యొక్క మార్కుల జాబితా 10-5-26 తేదీ లోపల కరపత్రంలో తెలియపరిచిన అడ్రస్ కు పంపగలరు ప్రతిభకు పట్టాభిషేకం కార్యక్రమం ఏర్పాటు చేయడమైనది.గత నాలుగు సంవత్సరముల నుండి ఈ కార్యక్రమము నిర్వహిస్తు పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు 540 పైన మార్కులు సాధించిన విద్యార్థులకు అదేవిధంగా ఇంటర్మీడియట్ 900 పైన మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు మొదటి బహుమతి పదివేల రూపాయలు,రెండవ బహుమతి 7500 ,మూడవ బహుమతి 5000 ,రూపాయలు కన్సోలేషన్ బహుమతులు 2000 రూపాయలు మరియు ప్రశంసా పత్రములు ఇవ్వడం జరుగుతుంది.కావున ప్రతి ఒక పద్మశాలి విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అధ్యక్షులు భీమనపల్లె వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఈ యొక్క ప్రతిభకు పట్టాభిషేకం కార్యక్రమాన్ని ప్రతి ఒక్క విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నా వెంకటేశ్వర్లు పుత్తా రామకృష్ణ కోటా బాల వెంకటసుబ్బయ్య గాజుల శంకర్ గుద్దేటి వెంకటరామయ్య. చెన్నా శ్రీనివాసులు ఉద్దంటి వెంకట సతీష్ మద్దాల మోహన్ గాజుల బ్రహ్మయ్య శ్రీనివాసులు దోమల చక్రపాణి చింతల పల్లె వాసు పల్లెఈశ్వరయ్య గాజుల పుల్లయ్య కూడపు సుబ్రహ్మణ్యం కోడి పరమేశ్వరుడు రంగా వేణుగోపాల్ పున్నా జయప్ప గుర్రం శ్రీనివాసులు గాజుల వీరయ్య పాల్గొన్నారు.



# మైనారిటీల సంక్షేమానికి తూట్లు పొడిచిన గత ప్రభుత్వం





## రాజకీయ కక్షతో నిధుల నిలిపివేత సొంత జిల్లాలో హజ్ భవన్ ను పూర్తి చేయలేదని ధ్వజమెత్తిన మంత్రి ఫరూక్

## రెండవ విడతలో 177 మంది హజ్ యాత్రకు జెండా ఊపి వీడ్కోలు పలికిన మైనారిటీ మంత్రి ఫరూక్

## విజయవంతంగా హజ్ యాత్రను పూర్తి చేసి రావాలని శుభాకాంక్షలు తెలిపిన మంత్రి ఫరూక్

## ప్రభుత్వ శాఖల అధికారులకు, సిబ్బందికి, మీడియాకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి

**అమరావతి, ఏప్రిల్ 19. నంది పత్రిక:**రాష్ట్రం లోని మైనారిటీల సంక్షేమానికి గత ప్రభుత్వం తూట్లు పొడిచిందని రాష్ట్ర మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ ద్వజమెత్తారు. విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుంచి రెండవ విడతలో హజ్ యాత్రకు వెళ్తున్న 177 మంది యాత్రికుల బృందానికి మంత్రి ఫరూక్ సారధ్యంలో వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు.మంత్రి ఫరూక్ తోపాటు మైనారిటీ వ్యవహారాల సలహాదారుడు ఎంఏ షరీఫ్, ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫారూక్ షుబ్లీ, హజ్ కమిటీ చైర్మన్ హసన్ భాషా, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ మౌలానా హజ్ కమిటీ సీఈవో గౌస్ పీర్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ యాకూబ్ భాషా, విజయవాడ లా అండ్ ఆర్డర్ డీసీపీ మురళీ కృష్ణ తదితరులు రెండవ దశలో వెళ్తున్న హజ్ యాత్రికులకు జెండా ఊపి వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ ప్రసంగిస్తూ ఐదేళ్ల పాలనలో గత ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులతో అన్ని వర్గాల ప్రజా సంక్షేమాన్ని,రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేసిందని విమర్శించారు.మైనారిటీల పట్ల గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించిందన్నారు.2014-2019లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంలోని ప్రభుత్వం కడపలో హజ్ భవన్ ను నిర్మించేందుకు నిధులు కేటాయించి దాదాపుగా పూర్తిచేయడం జరిగిందన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం సొంత జిల్లాలో హజ్ భవన్ చివరి దశలో ఉన్న పెండింగ్ పనులను కూడా పూర్తి చేయలేదని, ముఖ్యమంత్రి హోదాలో సొంత జిల్లాలో కూడా అభివృద్ధిని నిలిపివేసిన ఘనత గత ముఖ్యమంత్రి దేనని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ కక్ష సాధింపు చర్యలతో స్వయం ఉపాధి రుణాలను , మసీదులు, షాదీఖానాల నిధులను కూడా రద్దు చేసి మైనారిటీల అభివృద్ధిని గత ప్రభుత్వ పాలకులు అడ్డుకున్నారని మంత్రి ఫరూక్ దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజావేదికను కూల్చివేసినప్పుడే ఆ ప్రభుత్వ క్రూరత్వం ప్రజలకు అర్థమైందని అన్నారు. భవిష్యత్ ప్రణాళికలో అమరావతిలో హజ్ భవన్ నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు స్థలాన్ని కేటాయించారని, త్వరలోనే అక్కడ పనులు ప్రారంభిస్తామని మంత్రి ఫరూక్ హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. హజ్ యాత్ర విజయవంతం కోసం కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు సహకారంతో, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో విజయవాడ ఎంబర్కేషన్ కేంద్రానికి సౌదీ అరేబియా విమాన సర్వీసుల్లో ప్రాధాన్యత లభించిందని అన్నారు. కూటమి ప్రభుత్వం నేతృత్వంలో హజ్ యాత్రకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు, గన్నవరం నుంచి వెళ్తున్న వారికి రూ. లక్ష ఆర్థిక సహాయం, ప్రత్యేకంగా విడిది క్యాంపులు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుండి యాత్రికుల సంఖ్యను రానున్న కాలంలో భారీగా పెంచేందుకు కార్యాచరణ ప్రణాళిక అమలు చేసేందుకు నిర్ణయించడం జరిగిందని పేర్కొన్నారు. అందుకు కావాల్సిన అన్ని చర్యలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం శ్రీకారం చుడుతుందని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. హైదరాబాద్, బెంగళూరు తదితర ఎంబార్కేషన్ కేంద్రాల నుంచి వెళ్లే వారికి కూడా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేస్తూ రాష్ట్ర మైనారిటీ మంత్రిత్వ శాఖ అన్ని చర్యలను చేపట్టిందని మంత్రి ఫరూక్ వెల్లడించారు.లి

**మంత్రి ఫరూక్ నిరంతర పర్యవేక్షణతో..** విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుంచి హజ్ యాత్రకు వెళ్తున్న వారికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా సౌకర్యాలు కల్పించడానికి మైనారిటీ మంత్రి ఫరూక్ చేసిన నిరంతర పర్యవేక్షణ, కృషి పట్ల యాత్రికులు ప్రశంసల జల్లు కురిపించారు. విడిది కేంద్రం వద్ద పలువురు యాత్రికులను మంత్రి ఫరూక్ వారి వద్దకు వెళ్లి పలుకరిస్తూ, యోగక్షేమాలు అడిగి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా, విజయవంతంగా యాత్ర పూర్తి చేసి రావాలని సూచించడం జరిగింది.రాష్ట్ర, దేశ, ప్రపంచ అభివృద్ధి, శాంతికోసం కూడా ప్రార్థించాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనారిటీల సంక్షేమానికి, వారి పవిత్ర యాత్రలకు అత్యంత ప్రాధాన్యతనిస్తుందని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు. అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాట్ల తో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో హజ్ యాత్రికులకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని మంత్రి తెలిపారు.యాత్రికులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా శీతల వసతి, రుచికరమైన ఆహార సదుపాయాలు, వైద్య సేవలు అందుబాటులో ఉంచడం జరిగిందని అన్నారు. మైనారిటీ మంత్రిత్వ శాఖ, హజ్ కమిటీ సభ్యులు సమన్వయంతో అన్ని ప్రభుత్వ శాఖలతో కలిసి హజ్ యాత్రకు ఏర్పాట్లు చేయడంతో యాత్రికులందరికీ ఎలాంటి ఇబ్బందులు కలగలేదన్నారు. పోలీసు శాఖ ద్వారా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు జరిగాయని అన్నారు.

**తేలికపాటి ఆహారం తీసుకోవాలి.. యాత్రికులకు సూచించిన మంత్రి ఫరూక్** సౌదీ అరేబియాలో ఎండలు తీవ్రత ఎక్కువ గా ఉన్నందున యాత్రికులు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఫరూక్ సూచించారు. ముఖ్యంగా యాత్రలో ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నూనెతో చేసిన వంటకాలు తినకుండా నియంత్రణ పాటించి, త్వరగా జీర్ణమయ్యే తేలికపాటి ఆహారం తీసుకోవాలన్నారు.మక్కా, మదీనాలలో వసతి గృహాల దూరం పెరిగిన దృష్ట్యా సమయపాలన పాటించాలని సూచించారు. అక్కడి వసతి గృహాల్లో గ్యాస్ స్టవ్‌ల వాడకంపై ఉన్న ఆంక్షలను ఖచ్చితంగా గౌరవించాలని హజ్ యాత్రి కులకు మంత్రి ఫరూక్ సూచించారు.కాగా గన్నవరం వద్ద ఎస్ఎం కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన విడిది వద్ద హజ్ యాత్ర కు వెళ్తున్న వారికి ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలు, జాగ్రత్త లు, యాత్రలో అక్కడ పాటించాల్సిన నియమ, నిబంధనలు, ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవల వివరాలు, తదితర అంశాలపై పూర్తిస్థాయిలో మత పెద్దలు, హాజీలు, అధికారులు వివరించారు. హజ్ యాత్రకు వెళ్తున్న వారు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన అన్ని రకాల సౌకర్యాలు, సేవలు చాలా బాగున్నాయని, ప్రశంసిస్తూ సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి ఫరూక్ కు, సేవలందించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

**పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపిన మంత్రి ఫరూక్**

విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన విడిది కేంద్రంలో సౌకర్యాల కల్పన, భద్రతా ఏర్పాట్లు, వైద్య శిబిరం నిర్వహణ, పారిశుధ్యం, భోజన వసతి తదితర ఏర్పాట్ల లో సమన్వయంతో ముందుకు సాగిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులకు పేరుపేరునా మంత్రి ఫరూక్ రాష్ట్ర ప్రభుత్వం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. మైనారిటీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి సిహెచ్ శ్రీధర్ ఆధ్వర్యంలోని అధికార యంత్రాంగం, సిబ్బంది, హజ్ కమిటీ డైరెక్టర్లు, సిబ్బంది, మైనారిటీ సంక్షేమ శాఖ అనుబంధ కార్పొరేషన్ల చైర్మన్లు, అధికారులు, విభాగాల సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగాయని అభినందించారు. హజ్ యాత్రకు సంబంధించి ఎప్పటికప్పుడు తమ తమ ప్రచార సాధనాల ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా ప్రతినిధులు విస్తృత ప్రచారం కల్పించారని మంత్రి ఫరూక్ కృతజ్ఞతలు తెలిపారు.



# రేపు నగరపాలకలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

## నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్



**కర్నూలు నంది పత్రిక....** కర్నూలు నగరపాలక సంస్థలో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:00 గంటలకు స్థానిక ఎస్బిఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి నగరపాలకకు చెందిన అన్ని విభాగాల అధికారులు హాజరు అవుతారని, కాలనీల్లోని మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, వీధి వెలుగులు, పరిశుభ్రత వంటి సమస్యలను ప్రజలు లిఖిత పూర్వకంగా సమర్పించవచ్చని తెలిపారు.ప్రతి ఫిర్యాదు స్వీకరించబడిన వెంటనే సంబంధిత అధికారులకు పంపి, పరిష్కారం కోసం నిర్దిష్ట గడువులు నిర్ణయించబడతాయని ఆయన వెల్లడించారు. అదేవిధంగా, ప్రతి ఫిర్యాదు పురోగతిని పౌరులు స్వయశీ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని కమిషనర్ వివరించారు.

# నంద్యాల రెడ్ క్రాస్ బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ను సందర్శించిన ఇండియన్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్



**నంద్యాల ప్రతినిధి. ఏప్రిల్ 19 . (నంది పత్రిక ):**నంద్యాల రెడ్ క్రాస్ బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ను ఇండియన్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్/ రెడ్ క్రాస్ రాష్ట్ర కోశాధికారి డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బాలరాజులు సందర్శించారు. రెడ్ క్రాస్ అభివృద్ధికి వైద్యులు సహకరించాలని, రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాల్లో వైద్యులు భాగస్వాములవ్వాలని ఇండియన్ మెడికల్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్/ రెడ్ క్రాస్ రాష్ట్ర కోశాధికారి డాక్టర్ శ్రీహరిరావు, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బాలరాజు లు పిలుపునిచ్చారు.ఐఎంఏ రాష్ట్ర నాయకులతో పాటుగా నంద్యాలకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు నంద్యాల రెడ్ క్రాస్ బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ను విచ్చేసి నంద్యాల రెడ్ క్రాస్ సేవలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ శ్రీహరి రావును ఐఎంఏ రాష్ట్ర నాయకులను నంద్యాల జిల్లా రెడ్ క్రాస్ కమిటీ చైర్మన్ దస్తగిరి పర్ల, వైస్ చైర్మన్ డాక్టర్ మమతారెడ్డి, సెక్రెటరీ వజ్రాల శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు అరుణ కుమారి, ఉస్మాన్ భాషల ఆధ్వర్యంలో దుశ్శాలువతో సత్కరించారు.కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బాలరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుభాష్ చంద్రబోస్, నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాసరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ సునీల్, రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ ప్రసాద్ రెడ్డి, అనంతపురం రెడ్ క్రాస్ మాజీ వైస్ చైర్మన్ డాక్టర్ మనో రంజన్ రెడ్డి, అనంతపురం ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ అభిషేక్ రెడ్డి, నంద్యాల ఐఎంఎ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసరావు, ప్రభుత్వ హాస్పిటల్ రిటైర్డ్ సూపరింటెంట్ డాక్టర్ బాబన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ చైర్మన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులను నంద్యాల రెడ్ క్రాస్ కమిటీ అధ్వర్యంలో సన్మానించారు.

# నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ చేస్తున్న కర్నూలు పోలీసులు.

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి.



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లకు , నేరచరిత్ర గలవారికి , చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు.

# ఏప్రిల్ 20వ తేదీన ( సోమవారం) ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం

## అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక - అర్జీల పరిష్కారం సమాచారం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి కనుక్కోవచ్చు

## జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....**ఈ నెల 20వ తేదీ సోమవారం కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

**అర్జీల పరిష్కారం సమాచారం కోసం 1100 కు ఫోన్ చేయవచ్చు** అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.. అలాగే అర్జీదారులు (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.





# వాలీబాల్ టోర్నమెంట్ ను ప్రారంభించిన టీడీపీ నాయకులు వరదరాజు , బోయ వెంకటేష్



**మంత్రాలయం , ఏప్రిల్ 19,** మండల కేంద్రమైన మంత్రాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపిటిసి బోయ వెంకటేష్ జన్మదినని పురస్కరించుకుని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ శివ అధ్వర్యంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు వరదరాజు , ఎంపిటిసి బోయ వెంకటేష్ రిబ్బన్ కట్ చేసి టోర్నమెంట్ ప్రారంభించారు. టోర్నమెంట్ల్ మొత్తం 10 జట్లు పాల్గొన్నాయని ,ఇందులో మంత్రాలయం జట్టు గెలుపొందన్నారు. మొదటి విజేత కు రూ. 6000 రెండవ జట్టుకు రూ. 3000 నగదు ను ఎంపిటిసి తనయుడు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల సెక్రటరీ కమ్మసాలి నరసింహ , హైస్కూలు చైర్మన్ మద్రి నరసింహులు , మద్రి రాఘవేంద్ర తదితరులు ఉన్నారు.

# స్వచ్ఛ సంపద నిల్వ కేంద్రం ప్రారంభం.



**రుద్రవరం ప్రతినిధి ఏప్రిల్ 19 (నంది పత్రిక):** మండల కేంద్రం రుద్రవరం లోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలో స్వచ్ఛ సంపద నిల్వ కేంద్రమును ఆదివారం ప్రారంభించారు. స్వచ్ఛ సంపద నిల్వ కేంద్రం నిర్వాహకులు టిడిపి నాయకులు కొమ్మలపాటి రాజారావు ఆధ్వర్యంలో మండల టిడిపి కన్వీనర్ లింగం వెంకట రంగనాయకులు శెట్టి, టిడిపి సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ పోలా గురుమూర్తి, మండల టిడిపి కార్యదర్శి అల్లడి చంద్రశేఖర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించిన స్వచ్ఛ కార్యక్రమంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇళ్లలో ఉపయోగించే పనికిరాని ఇనుము వస్తువులు, ప్లాస్టిక్ వస్తువులు, సీసాలు ఇతర వస్తువులను స్వచ్ఛ సంపద నిల్వ కేంద్రంలో అమ్ముకోవచ్చు అన్నారు. వీటికి సరిపడా డబ్బు లేదా నిత్యవసర సరుకులను తీసుకోవచ్చు అన్నారు. ఈ అవకాశము ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం ప్రజల అభ్యున్నతి కోసం ఇలాంటి పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బండల గాంధీ శీను, మజ్జిగ చంద్ర, రెక్కల మనోహర్ రెడ్డి, బాలు, వెంకటసుబ్బయ్య, దస్తగిరి, పలువురు నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ ఎండల్లో ఉపశమనం

**పోరుమామిళ్ల ఏప్రిల్ 19 (నంది పత్రిక ):** పోరుమామిళ్ల బస్టాండ్ ఆవరణంలో ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ చలివేంద్రం వద్ద ఉపాధ్యాయుడు గుండెబోయిన శ్రీనివాసులు ఆధ్వర్యంలో, ప్రముఖ రచయిత బొల్లు రామ్మోహన్ సహకారంతో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తీవ్ర ఎండలు మండుతున్న ఈ రోజుల్లో, దూర ప్రయాణాలు చేసి బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అలాంటి సమయంలో ఒక గ్లాస్ చల్లని మజ్జిగ వారికి కేవలం దాహం తీర్చడమే కాకుండా, కొంత ఉపశమనం ఇచ్చి శరీరానికి తేలికపాటుగా అనిపించేలా చేస్తుంది. ఎండలో అలసిపోయిన వారికి ఇది ఒక చిన్న ఊరటలా మారుతోంది. బస్టాండ్ పరిసరాల్లో వేచి ఉన్న ప్రజలు, వ్యాపారస్తులు ఈ సేవను ఎంతో అభినందిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు మరింతగా కొనసాగాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో దంత వైద్యులు సునీల్ కుమార్ రెడ్డి, బాలరాజు, రామకృష్ణారెడ్డి, వాకా చంద్రశేఖర్, వెంకటరెడ్డి, రామ సుబ్బారెడ్డి, వెంకట రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కుమ్మరి కులవృత్తి పరిరక్షణకు సహకరించండి

## బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుకు శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ విన్నపం

**నందిపత్రిక –డోన్** నేటి ఆధునిక సమాజంలో అంతరించిపోతున్న కుమ్మరి కులవృత్తిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇందుకోసం మీ ప్రవచనాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ సుధాకర్ కుమ్మరి ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు కోరారు.నంద్యాల పట్టణంలో నిర్వహించిన 'మన ఊరు – మన గుడి – మన బాధ్యత' కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన చాగంటి వారిని సుధాకర్ కుమ్మరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హిందూ ధర్మంలో, మానవ జీవన విధానంలో మట్టి కుండకు ఉన్న ప్రాముఖ్యతను వివరిస్తూ ఒక వినతిపత్రం అందజేశారు. తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి వారికి ప్రతిరోజూ నైవేద్యం మట్టి కుండలోనే సమర్పిస్తారని, అలాగే గ్రామ దేవతల బోనాలకు, భగవంతుని నైవేద్యాల తయారీకి కుమ్మరి కుండ అత్యంత అవసరమని పేర్కొన్నారు. పుట్టినప్పటి పెళ్లి శుభకార్యాల నుండి మరణానంతర అంత్యక్రియల వరకు మానవ జీవితంలో మట్టి కుండ విడదీయలేని భాగమని గుర్తు చేశారు. మట్టి కుండలో వండిన ఆహారం, కుండలో నీరు ఆరోగ్యం పరంగా ఎంతో శ్రేష్ఠమని,ఈ విషయాన్ని ప్రజలకు తట్టిలేపాలని కోరారు. ప్రవచనాల ద్వారా మట్టి పాత్రల విశిష్టతను తెలియజేస్తే, సమాజంలో కుమ్మరి వృత్తిదారులకు తగిన గుర్తింపు లభిస్తుందని, తద్వారా ఆ కుల ఔన్నత్యం చాటబడుతుందని విన్నవించారు. సుధాకర్ కుమ్మరి అభ్యర్థనపై బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు సానుకూలంగా స్పందించారు. సమాజ హితం కోరి మీరు చేసిన ఈ ప్రతిపాదన చాలా బాగుందని, తన



ప్రవచనాలలో సందర్భానుసారంగా తప్పకుండా కుమ్మరి కుండ విశిష్టతను, మట్టి పాత్రల ప్రాముఖ్యతను వివరిస్తూ నా వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా శాలివాహన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కె. బలరాముడు, గురునాథ్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్‌పై కామెంట్స్‌డ మళ్లీ మాట్లాడితే సహించం- జనసేన అధ్యక్షుడు శీలంశెట్టి లక్ష్మయ్య



**పోరుమామిళ్ల, ఏప్రిల్ 19: (నంది పత్రిక)**వైయస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలంలో జనసేన నాయకులు శీలంశెట్టి లక్ష్మయ్య, బీసీ నాయకుడు శ్రీనివాస్ యాదవ్ చేసిన వ్యాఖ్యలపై ఆదివారం స్పందించారు. జనసేన నాయకుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గురించి మాట్లాడేటప్పుడు మరింత జాగ్రత్తగా, బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.బీసీల కోసం బీసీవై పార్టీ చేపట్టిన దీక్షను స్వాగతిస్తున్నామని, ప్రజల సమస్యలపై ప్రశ్నించే ప్రయత్నాలు మంచివేనని తెలిపారు. అయితే, ఆ సందర్భంలో ఉపయోగించిన కొన్ని పదాలు అనవసరంగా ఉన్నాయని, అలాంటి వ్యాఖ్యలను నివారించడం మంచిదని అన్నారు.గతంలో జరిగిన కొన్ని ఘటనల సమయంలో స్పందనపై కూడా ప్రశ్నలు లేవనెత్తిన లక్ష్మయ్య, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల పక్షాన జనసేన ఎప్పుడూ నిలబడిందని చెప్పారు. వ్యక్తిగత విమర్శలు కాకుండా సమస్యలపై చర్చించడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని సూచించారు.ఇకపై ఇటువంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా చూసుకోవాలని, పరస్పర గౌరవంతో రాజకీయాలు కొనసాగాలని కోరారు. అలాగే, ఏవైనా డిమాండ్లు ఉంటే ప్రభుత్వాన్ని సంప్రదించడం ఉత్తమ మార్గమని తెలిపారు. జనసేన రెండు రాష్ట్రాల్లో కూడా తన కార్యకలాపాలను విస్తరించుకుంటుందని, ప్రజల మద్దతుతో ముందుకు సాగుతుందని లక్ష్మయ్య పేర్కొన్నారు.

# రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదంలో ఓడిపోయిన మోదీ గారు రాజీనామా చేయాలి

## కర్నూలు జిల్లా నీటి ప్రాజెక్టులు మొదలుపెట్టకపోతే త్వరలో డీసీసీ ఆమరణ దీక్ష
## నీటి ప్రాజెక్టులు కోసం కాంగ్రెస్ పోరాటం తీవ్రతం చేస్తాం
## కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అడ్వకేట్ క్రాంతి నాయుడు బోయ

**కర్నూలు ప్రతినిధి నందిపత్రిక** ఆలూరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా మండల అధ్యక్షులు పూలు రామాంజనేయులు ఏర్పాటు చేసిన పత్రికా సమేవశంలో స్థానిక నాయకులతో జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ క్రాంతి నాయుడు బోయ మాట్లాడుతూ పార్లమెంట్ లో రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదంలో ఓడిపోయిన మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డం పెట్టుకొని డెలిమిటేషన్ బిల్లు ఆమోదం పొందాలి అని చూశారు రాహుల్ గాంధీ ఎంతో చాకచక్యంగా బిల్లు ఆమోదం పొందకుండా అడ్డుకోవడం చారిత్రక ఘట్టం అని అన్నారు. మన రాష్ట్రానికి



అన్యాయం జరుగుతుంది అని తెలిసి కూడా టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీ పార్టీలు మద్దతు తెలపడం విచారకరం అని అన్నారు. జనగణన, కులగణన చేసి మహిళా రిజర్వేషన్ మరియు డెలిమిటేషన్ బిల్లు చేయాలి అని, జనాభా తో పాటు జీఎస్డీపీ ను కూడా పరిగణలోకి తీసుకోవాలి అని కాంగ్రెస్ అగ్రనేతలు కోరిన అంశాన్ని తెలియజేశారు. కర్నూలు జిల్లా ప్రాజెక్టుల ఊసే లేకుండా మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం కు జిల్లా కాంగ్రెస్ కమిటీ తరుపున అల్టిమేటం జారీ చేస్తున్నట్లు తెలిపారు కర్నూలు జిల్లా ప్రాజెక్టులు అయినా వేదవతి, గుండ్రేవుల వెంటనే మొదలు పెట్టకపోతే ఆమరణ దీక్ష చేపడతాం అని తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గారు, లోకేష్ , పవన్ కళ్యాణ్ విజ్ఞతతో ఆలోచించి కర్నూలు జిల్లా గురించి ఆలోచన చేయాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ బోయ లక్ష్మన్న, ఖాదర్ భాష, వెంకట్ జైపాల్, తదితరులు పాల్గొన్నారు.

# పీఎం సూర్యఘర్ పథకంను ప్రారంభించిన మంత్రి



**బనగానపల్లె ఏప్రిల్ 19నందిపత్రిక** బనగానపల్లె పట్టణంలోని పంచమపేట దళిత కాలనిలో ఆదివారం పీఎం సూర్యఘర్ పథకాన్నిమంత్రి బీసి జనార్దన్ రెడ్డి ప్రారంభించారు ఈ సందర్భంగా ఇళ్లపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానళ్లను పరిశీలించారు. దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న ఈ పథకంలో భాగంగా కోటి సోలార్ కనెక్షన్లు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మన ఆంధ్రప్రదేశ్ లో నారా చంద్రబాబు నాయుడు చొరవతో రాష్ట్రానికి 20 లక్షల కనెక్షన్లు లభించాయని తెలిపారు. పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ కనెక్షన్లు అందిస్తున్నామని, 3 కిలోవాట్ల ద్వారా సుమారు 300 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని తెలిపారు. వినియోగానికి మించి మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. సూర్యఘర్ పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందంజలో ఉందని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు.

# ఐఎంఏ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంది






## -ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బాలరాజు

**నంద్యాల ప్రతినిధి. ఏప్రిల్ 19 . (నంది పత్రిక ):**నంద్యాలలో స్థానిక హోటల్ ఐఎంఏ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ వర్కింగ్ కమిటీ సమావేశం, నంద్యాల ఐఎంఏ నిర్వహణలో ఏర్పాటు చేశారు.ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ దగ్గుబాటి శ్రీహరి, రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ బాలరాజు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుభాష్ చంద్రబోస్, మాజీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు.ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎస్ బాలరాజు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర ఐఎంఏ వర్కింగ్ కమిటీ సమావేశంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఐఎంఏ నాయకులు పాల్గొన్నారు.ఐఎంఏ అసోసియేషన్ బలోపేతానికి తీసుకోవలసిన చర్యల పట్ల,వైద్యుల సమస్యల పరిష్కారానికి ఏ విధంగా కృషి చేయాలి, ఐఎంఏ సభ్యుల సంక్షేమానికి చేపట్టవలసిన కార్యక్రమాల గురించి సుదీర్ఘంగా చర్చించారు.ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బాలరాజు మాట్లాడుతూ ఐఎంఎలో ప్రైవేటు వైద్యులు, ప్రభుత్వ వైద్యులు సభ్యులుగా ఉన్నారని, రాష్ట్రంలోని 100 శాఖలలో 22 వేల మంది పైగా సభ్యులు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ రంగంలో, ప్రైవేటు రంగంలో వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐఎంఏ కృషి చేస్తుందని ప్రకటించారు. వైద్యం పొందుతున్న రోగులు వ్యాధి తీవ్రత వలన మరణించిన సమయాల్లో వైద్యులపై, ఆసుపత్రులపై భౌతిక దాడులు పెరుగుతున్నాయని, ఇది తీవ్ర ఆందోళన కలిగిస్తున్న విషయమని అన్నారు. వైద్యులపై దాడులు పెరిగితే అత్యవసర కేసులు చూడడానికి వైద్యులు వెనకంజ వేసే పరిస్థితి వస్తుందని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ వైద్యుల 2008 రక్షణ చట్టం సవరించి వైద్యులపై, ఆసుపత్రులపై దాడి చేసే వారికి కఠిన శిక్షలు విధించే విధంగా ప్రస్తుత చట్టాన్ని బలోపేతం చేయవలసిన అవసరం ఉందని అన్నారు. అగ్నిమాపక శాఖ నిరభ్యంతర పత్రం విషయంలో ఆసుపత్రిలో ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలన్నారు. వైద్యుల సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే ప్రభుత్వానికి వినతి పత్రం అందజేస్తామన్నారు.ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ వైద్యులు వైద్య వృత్తిని నైతిక విలువలతో, నిబద్ధతతో కొనసాగించాలని కోరారు. సమావేశం అనంతరం రాష్ట్ర నాయకులను నంద్యాల ఐఎంఏ తరపున డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ పనిల్ కుమార్, నంద్యాల ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మహమ్మద్ రఫీ, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి డాక్టర్ లక్ష్మీ సౌజన్య, వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ వసుద ,డాక్టర్ హరిత ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ,డాక్టర్ త్యాగరాజ రెడ్డి, డాక్టర్ నాగళ్ళ కిషోర్, డాక్టర్ అశోక్, డాక్టర్ బాల మద్దయ్య, డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ ప్రసాద్ రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శిలు డాక్టర్ ఫణి ధర్, డాక్టర్ రెహమాన్, నంద్యాల ఐఎంఏ నాయకులు డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, డాక్టర్ మధుసూదన రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్, రాష్ట్ర ఐఎంఏ ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ మధుసూదన శర్మ, సంయుక్త కార్యదర్శులు డాక్టర్ పనిల్ కుమార్, డాక్టర్ జంధ్యాల శివకుమార్, డాక్టర్ సునీల్, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





# ఉచితంగా టోపీలు పంపిణీ



**ఆళ్లగడ్డప్రతినిధి ఏప్రిల్ 19, నంది పత్రిక** ఆవోపా మహిళ విభాగ్ శాశ్విత సేవా నిధి ఆధ్వర్యంలో ఆదివారం ఆళ్లగడ్డలో ఉచితంగా టోపీలు పంపిణీ చేశారు. ఆవోపా సభ్యులు కసెట్టి ప్రభాకర్ రావు తల్లి దివంగత రామలక్ష్మమ్మ జ్ఞాపకార్థం ఆమె మనుమరాలు మీనాసింధు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని 10వేల రూపాయల విలువగల150 టోపీలను చిరు వ్యాపారులకు, పేదవారికి, రిక్షావారికి, హమాలీలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆవోపా మహిళా విభాగం అధ్యక్షురాలు కసెట్టి సుజాత, సెక్రటరీ టంగుటూరు లక్ష్మీ సునంద, ట్రెజరర్ ఆకుతోట కాత్యాయని, జాయింట్ సెక్రటరీ చాటకొండ శ్రీదేవి, వైస్ ప్రెసిడెంట్ గంగిశెట్టి పద్మజవల్లి, నల్లగట్ల లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.




# చలివేంద్రం ప్రారంభించిన మూడో పట్టణ సీఐ శేషయ్య

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** ఎండలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు కు దాహం తీర్చేందుకు చలివేంద్రం ప్రారంభించామని సిఐ శేషయ్య తెలియజేశారు. ఆదివారం కర్నూలు మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ముందు చలివెంద్రమును శేషయ్య మరియు ఎస్ఐలు చంద్రశేఖర్ రెడ్డి, బాల నరసింహులు, శ్రీనివాసులు, రాజేంద్రప్రసాద్ మరియు సిబ్బంది కలిసి రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడమైనది.

## క్రమంగా కోలుకుంటున్నాను.. మీ అందరి ఆదరణకు కృతజ్ఞతలు: పవన్ కళ్యాణ్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తాను క్రమంగా కోలుకుంటున్నానని వెల్లడించారు. ఇటీవల హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో శనివారం నాడు శస్త్రచికిత్స విజయవంతంగా జరిగింది. పవన్ కళ్యాణ్ కొంతకాలంగా సైనసైటిస్ సమస్యతో బాధపడుతున్నట్టు తెలుస్తోంది. సర్జరీ విజయవంతమైన నేపథ్యంలో తన ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని ఆకాంక్షించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సినీ ప్రముఖులతో పాటు యావత్ ప్రజానీకానికి ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. పలువురు నేతల ట్వీట్లకు స్పందిస్తూ, తన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితిపై ఆయన సోదరుడు, మెగాస్టార్ చిరంజీవి ఎక్స్ వేదికగా స్పందించారు. "కల్యాణ్ బాబుకు వైద్య ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. ప్రస్తుతం ఆయన క్షేమంగా, నిలకడగా కోలుకుంటున్నారు. వైద్యుల సూచన మేరకు, సాధారణ కార్యకలాపాల్లోకి తిరిగి రావడానికి సుమారు వారం రోజులు పట్టవచ్చు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మీ అందరి ప్రేమకు, ప్రార్థనలకు ధన్యవాదాలు" అని చిరంజీవి పేర్కొన్నారు. దీనికి పవన్ కళ్యాణ్ స్పందిస్తూ, "ధన్యవాదాలు అన్నయ్య. మీ ప్రేమ, ఆశీస్సులు, నిరంతర సంరక్షణకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. మీ మాటలు వెచ్చదనాన్ని, రక్షణను, బలాన్ని ఇస్తాయి. మీ ఆశీస్సులతో త్వరలోనే కోలుకుని తిరిగి ప్రజాసేవకు వస్తాను" అని బదులిచ్చారు. మరో సోదరుడు, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు కూడా పవన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. "మన ప్రియతమ నాయకుడు పవన్ కళ్యాణ్‌కు శస్త్రచికిత్స విజయవంతమైంది. ఆయన కొన్ని రోజులు విశ్రాంతి తీసుకుని, నూతన శక్తితో తిరిగి వస్తారు.

## చంద్రబాబు బర్త్ డే సీడీపీ విడుదల చేసిన నారా లోకేష్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు 76వ పుట్టినరోజు (ఏప్రిల్ 20) సందర్భంగా ఆయన తనయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఒక కామన్ డిస్ప్లే పిక్చర్ (సీడీపీ)ని విడుదల చేశారు. టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితుడైన తర్వాత లోకేష్ ఈ సీడీపీని ఆవిష్కరించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. "మన నాయకుడు ఎన్‌సీబీఎన్ గారి పుట్టినరోజు గౌరవార్థం ఈ సీడీపీని అధికారికంగా విడుదల చేయడం గర్వంగా ఉంది" అని లోకేష్ తన సోషల్ మీడియా ఖాతాలో పేర్కొన్నారు. చజదీచీంఅతీదీఅతీష్ట్రఝఎజఞూ అనే హ్యాష్‌ట్యాగ్‌ను కూడా జత చేశారు.

# మంత్రాలయాన్ని సందర్శించిన స్వర్ణాంధ్ర విజన్ అధికారి రాజు



నాగలదిన్నె రోడ్డు ,రామచంద్ర నగర్ కాలనీకి అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వేయడానికి ముందుకు వచ్చిన బెస్త పవన్ కుమార్

**మంత్రాలయం , ఏప్రిల్ 19,** కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ భారతి ఆదేశాల మేరకు జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో స్వర్ణాంధ్ర పది సూత్రాల లక్ష్యసాధన లో భాగంగా మంత్రాలయం టిడిపి ఇన్చార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి సూచనల మేరకు పది సూత్రాలు అమలుకై వాటినీ గ్రామస్థాయిలో పర్యవేక్షించేందుకు నియోజకవర్గం ప్రొఫెషనల్ ఆఫీసర్ రాజు బృందం ఆదివారం మంత్రాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలసరి ఆదాయం పెంచుటకు గ్రామాల అభివృద్ధిని సాధించుటకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4 విధానంలో ఎవరైతే మార్గదర్శిగా సభ్యత్వం చేసుకున్నారో వారికి అభివృద్ధి పనుల విషయమై ఎంత మేరకు చేయగలుగుతున్నారు అనే కోణంలో ఈ నియోజకవర్గ బృందం పర్యవేక్షణ చేస్తుందన్నారు. అదేవిధంగా మంత్రాలయంలో మార్గదర్శిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో సభ్యత్వం తీసుకున్న బెస్త పవన్ కుమార్ మంత్రాలయంలోని నాగలదిన్నె రోడ్డు , రామచంద్ర నగర్ కు అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పైపు లైన్ వేయాలని ముందుకు వచ్చారన్నారు. దానికి పర్యవేక్షణ కోసం మంత్రాలయ పంచాయతీ ఆఫీసర్ ఉపేంద్ర రెడ్డి స్వర్ణాంధ్రవిజన్ ఆఫీసర్ రాజు మరియు బృందం కాలనీ పరిసరాలను పరిశీలించారు . ఎవరైనా దాతలు స్వచ్ఛందంగా పీ4 లో రిజిస్టర్ అయి గ్రామాలను మరియు కుటుంబాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తామని వస్తే వారికి ప్రభుత్వం తరపున పూర్తిస్థాయిలో భరోసా భద్రత మరియు ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని ప్రొఫెషనల్ ఆఫీసర్ డాక్టర్ కే రాజుగారు పిలుపునిచ్చారు. మంత్రాలయం నియోజకవర్గంలో పేద ప్రజలు పడుతున్న కష్టాలు, నీటి ఎద్దడిని నివారించడానికి సంపన్న వర్గాల వారు కూడా మానవత కోణంలో ఆలోచించి ఆ భగవంతుడే చెప్పినట్టు గా మానవసేవే మాధవసేవ అన్నట్టు మీరు కూడా ఆలోచన చేసి మంత్రాలయం నియోజకవర్గాన్ని అభివృద్ధి వైపు నడిపించాలని మన భవిష్యత్ తరాలను కాపాడి వారి అభివృద్ధికి మనమందరం ముందుకు నడవాలని అన్నారు. మంత్రాలయ నియోజకవర్గం లో ప్లాస్టిక్ రహిత మంత్రాలయంగా తీర్చిదిద్ది రాష్ట్రంలో మంత్రాలయంను ఆధ్యాత్మిక స్వర్ణ మంత్రాలయంగా తీర్చిదిద్దడానికి మనమందరం ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా మంత్రాలయం డిప్యూటీ ఎంపీడీవో మాట్లాడుతూ మంత్రాలయంలో ప్లాస్టిక్ కాలుష్యం మరియు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలు చాలా ఎక్కువగా ఉన్నాయి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసువెళ్ళి సమస్యలను పరిష్కారిస్తాన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు ఉన్నారు.



# పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి సిపిఐ

## పలుకూరులో సీపీఐ నూతన కమిటీ ఎన్నిక

**బనగానపల్లె ఏప్రిల్ 19 నంది పత్రిక** మండల పరిధిలోని పలుకూరు గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వము ఐదు లక్షల రూపాయలు హౌసింగ్ స్కీం ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పలుకూరు గ్రామంలో సిపిఐ నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి కష్టం చేసుకుంటూ నివాసం ఉంటున్న నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని అలాగే నాపరాయి గనులలో పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్న కార్మికులకు కార్మికుల సంక్షేమ బోర్డు లొ పొందుపరిచిన సంక్షేమ పథకాలు కార్మికులకు అందించాలని ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న పెన్షన్ దారులకు పెన్షన్ ఇవ్వాలని గని కార్మికులకు ఉచిత వైద్య సేవలు అందించాలని కార్మికులకు ఉచిత పని ముట్లు ఇవ్వాలని దళితవాడలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు పలుకూరు నూతన శాఖను ఎన్నుకున్నారు బాలయ్య, సహాయ కార్యదర్శి గా గోపాల్ కమిటీ సభ్యులు గా చెన్నయ్య సంగు సుబ్బారాయుడు చిన్న బలి అపర్ణ మానస తదితరులు ఎన్నుకొన్నారు.

# శుభాకార్యానికి హాజరైన కాటసాని సోదరులు



**బనగానపల్లె ఏప్రిల్ 19నందిపత్రిక** అవుకు మండలం గుండ్ల సింగవరం గ్రామానికి చెందిన శీల వెంకటరామిరెడ్డి ఇంట జరిగిన కార్యక్రమానికి కాటసాని సోదరులు మాజీ శాసన సభ్యులు కాటసాని రామిరెడ్డి, నియెజకవర్గ వైసీపీ నాయకులు ప్రసాదరెడ్డి. అవుకు మండల వైసీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి హజరయ్యారు. అనంతరం వారు ఇచ్చిన విందు ఆహ్వానం మేరకు విందు లో పాల్గొని వారి అతిధ్యాన్ని స్వీకరించారు

# కార్మిక పోరాటాలను ఉధృతం చేస్తాం



ఇతర సంఘాలతో కలిసి పోరాట ప్రణాళిక

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 19 ( నంది పత్రిక )** ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక పోరాటాలను ఉధృతం చేస్తామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు పేర్కొన్నారు. నంద్యాలలోని ఎన్ జి ఓ కాలనీ లోని కో -ఆపరేటివ్ కమ్యూనిటీ హాల్ లో జరుగుతున్న సీఐటీయూ రాష్ట్ర మహాసభ ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సి హెచ్ నర్సింగ రావు మాట్లాడుతూ గత మూడు రోజులపాటు జరిగిన మహాసభలో 80 మంది చర్చల్లో పాల్గొన్నారన్నారు. రాబోయే మూడు సంవత్సరాలు కార్మికవర్గం స్థితిగతులు మెరుగుపడేందుకు పెద్ద ఎత్తున పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలన్నారు. ఇతర సంఘాలతో కలిసి పోరాట ప్రణాళిక రూపొందిస్తామన్నారు. వేల కోట్ల లాభాలను గడుస్తున్న షెడ్యూల్ పరిశ్రమల్లో కార్మికులకు ఐదు రూపాయలు కూడా వేతనం పెంచలేదన్నారు. అతి తక్కువ జీతంతో అతి ఎక్కువ పని చేయించుకుంటు న్నారన్నారు. మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్ లతో 12 గంటల పని విధానాన్ని తెచ్చిందని, దానిపై దేశ వ్యాప్తంగా కార్మికవర్గం పెద్ద ఎత్తున ఆందోళన చేస్తోందని చెప్పారు. రానున్న కాలం పోరాటాల కాలమని, కార్మిక చట్టాల అమలు కోసం, హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, రకరకాల పేర్లతో అతి తక్కువ జీతంతో పని చేయించుకుంటున్నారని, పర్మినెంట్ ఉద్యోగాలు లేకుండా చేస్తున్నారని అన్నారు. నాన్ పర్మినెంట్ కార్మికులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయబోతున్నామన్నారు.

మహాసభలో 25 తీర్మానాలకు ఆమోదం

**– సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి** రాష్ట్ర మహాసభ 25 తీర్మానాలను ఆమోదించినట్లు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి తెలిపారు. రాబోయే కాలంలో వివిధ తరగతులు, కార్మికులను, ఉద్యోగులను ఐక్యం చేసి పోరాటాలు చేయాలని మహాసభ నిర్ణయించిందన్నారు.

ప్రయివేటీకరణను ఆపాలని, కడపలో ఉక్కు పరిశ్రమ నెలకొల్పాలని, స్కీమ్ వర్కర్ల సమస్యలపై ఐక్య పోరాటాలు నిర్వహించాలని, గిగ్ వర్కర్లకు రక్షణ, భద్రత కల్పించాలని, మహిళలకు మూడు రోజులు నెలసరి సెలవులు ఇవ్వాలని తీర్మానించినట్లు వెల్లడించారు. రాష్ట్ర కార్యదర్శి సాయి మాట్లాడుతూ మహాసభలకు అన్ని ఏర్పాట్లు చేసిన జిల్లా కమిటీకి అభినందనలు తెలిపారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ నాగరాజు మాట్లాడుతూ మూడు రోజుల మహాసభకు, శ్రామికోత్సవాలకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ తమపై పెట్టిన బాధ్యతను నెరవేర్చామని ఆశిస్తున్నామన్నారు. తొలి రోజు ర్యాలీ, బహిరంగ సభ విజయవంతం అయ్యాయన్నారు.

# రుద్రవరంలో కళాజాతా ద్వారా పారిశుధ్యంపై అవగాహన



**రుద్రవరం ప్రతినిధి ఏప్రిల్ 19 (నంది పత్రిక):** మండల పరిధిలోని రుద్రవరం గ్రామ పంచాయతీలో ఆదివారం నాడు పెద్దమ్మ జాతరను పురస్కరించుకుని పారిశుధ్యం మరియు ప్రజారోగ్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మేజర్ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ మనోరంజన్ ప్రతాప్ మరియు ఇన్చార్జి ఈవో వడ్డే రామకృష్ణ, కార్యదర్శి సునీల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నారాయణ కళా బృందం సభ్యులు తమ ప్రదర్శనల ద్వారా గ్రామస్తులను ఆకట్టుకున్నారు. పాటలు, నాటికల ద్వారా పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, ప్లాస్టిక్ రహిత గ్రామంగా మార్చాలని ప్రజలను కోరారు. జాతర సమయాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత మరియు సామాజిక పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. పండుగలు, జాతరల సమయంలో వ్యర్థాలు పేరుకుపోకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, రుద్రవరం పంచాయతీని ఆదర్శంగా నిలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# గ్రామాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



**మహానంది ఏప్రిల్ 19 (నంది పత్రిక):–** గ్రామాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని డిప్యూటీ ఎంపీడీవో భార్గవి లత పేర్కొన్నారు. ఆదివారం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలో చేపట్టిన పారిశుధ్య పనులను పంచాయతీ సెక్రెటరీ స్వర్ణతో కలిసి పర్యవేక్షించారు. ప్రజలు చెత్త చెదారంను ఎక్కడపడితే అక్కడ వెయ్యరాదన్నారు. ఇంటి ముందుకు వచ్చే చెత్త సేకరణ వాహనాలలోనే వేయాలన్నారు.గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.



# ఎకోరైజ్' ప్రాజెక్టును ప్రారంభించిన శ్రీ చిన జీయర్ స్వామి

## 'శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్' ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లో ప్రారంభం

## అందరికీ అందుబాటులో నాణ్యమైన సదుపాయాలు

**హైదరాబాద్ నంది పత్రిక బ్యూరో....**భాగ్య నగరంలోని రాజేంద్రనగర్‌లో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ 'శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్' ప్రతిష్టాత్మక నివాస ప్రాజెక్ట్ 'ఎకోరైజ్'కు ఆదివారం ఘనంగా శ్రీకారం చుట్టారు. పరమపూజ్యులు శ్రీ త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి దివ్య సమక్షంలో, వారి మంగళాశాసనాలతో భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చినజీయర్ స్వామి మాట్లాడుతూ, "ప్రతి ఒక్కరూ మంచి ఇల్లు కోరుకుంటారు. కానీ నిజమైన ప్రశాంతత మనస్సులోనుంచే రావాలి. ఆ ప్రశాంతతను కలిగించే వాతావరణం కలిగిన ఇళ్లు నిర్మించడమే ముఖ్యం" అని పేర్కొన్నారు. నేడు పరశురామ జయంతి, రేపు అక్షయ తృతీయ ఇంతటి పుణ్యదినాల్లో ఇలాంటి శుభకార్యాన్ని ప్రారంభించడం శ్రేయస్కరమని ఆశీర్వదించారు. అనంతరం నిర్వాహకులు ప్రాజెక్టు గురించి వివరించారు. ప్రకృతి సౌందర్యం, ఆధునిక సౌకర్యాల సమ్మిళితంగా రూపుదిద్దుకుంటున్న ఈ 'ఎకోరైజ్' ప్రాజెక్ట్ ఆకర్షణీయంగా నిలుస్తోంది. సుమారు 5.24 ఎకరాల విస్తీర్ణంలో, కేవలం 516 యూనిట్లతో తక్కువ జనసాంద్రతతో ప్రణాళిక రూపొందించారు. 100 శాతం వాస్తు ప్రమాణాలతో 3, 4 బీహెచ్‌కే ఫ్లాట్లు 2,250 నుంచి 4,695 చదరపు అడుగుల విస్తీర్ణంలో అందుబాటులో ఉన్నాయి. ప్రాజెక్ట్‌లో పచ్చదనానికి పెద్దపీట వేస్తూ 1.2 ఎకరాల్లో ల్యాండ్‌స్కేపింగ్, 33,000 చదరపు అడుగుల 'స్కై గార్డెన్స్' ఏర్పాటు చేస్తున్నారు. అదనంగా 57,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ++7 అంతస్తులతో గ్రాండ్ క్లబ్ హౌస్ నిర్మాణం చేపడుతున్నారు. ఔటర్ రింగ్ రోడ్‌కు సమీపంలో ఉండటంతో గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైటెక్ సిటీ, శంషాబాద్ విమానాశ్రయాలకు సులభంగా చేరుకునే సౌలభ్యం ఉంది. సమీపంలో విద్యాసంస్థలు, ఆధునిక వైద్యశాలలు, జీఎంఆర్ బిజినెస్ పార్క్ ఉండటం ఈ ప్రాజెక్ట్‌కు మరింత బలం చేకూరుస్తోంది. అందరికీ అందుబాటులో ఉండేలా, నాణ్యమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తక్కువ ఖర్చుతో మెరుగైన సదుపాయాలు కల్పిస్తూ, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మరింత విస్తరణకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. దక్షిణ హైదరాబాద్‌లో నివాసాలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, లాంచింగ్ సందర్భంగా పరిమిత కాలం పాటు ప్రత్యేక ధరలను అందిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. రాజేంద్రనగర్ కారిడార్‌లో ప్రీమియం గృహాలను సొంతం చేసుకోవాలనుకునే వారికి ఇది సువర్ణావకాశమని వారు పేర్కొన్నారు.



# విద్యాసంస్థల్లో డ్రగ్స్ నియంత్రణ.. గవర్నర్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ



తెలంగాణలో విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాల (డ్రగ్స్) నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ అంశంపై చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో హైదరాబాద్ లోక్‌భవన్‌లో సమావేశమయ్యారు. ఈ భేటీలో డ్రగ్స్ కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రధానంగా చర్చించినట్లు ముఖ్యమంత్రి స్వయంగా వెల్లడించారు. ఈ సందర్భంగా గవర్నర్ పలు కీలక సూచనలు చేశారని, వాటిని ప్రభుత్వం తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటుందని ఆయనకు హామీ ఇచ్చినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. విద్యాసంస్థల్లో డ్రగ్స్ మహమ్మారిని అరికట్టేందుకు కఠినమైన చర్యలు చేపట్టే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు ఈ సమావేశం స్పష్టం చేస్తోంది. ఈ కీలక సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. రాష్ట్రంలో యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని డ్రగ్స్ నియంత్రణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

# హైదరాబాద్ పోలీసుల 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0'.. దేశవ్యాప్తంగా 52 మంది అరెస్ట్

దేశవ్యాప్తంగా విస్తరించిన భారీ సైబర్ మోసాల నెట్‌వర్క్‌ను హైదరాబాద్ నగర పోలీసులు ఛేదించారు. 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0' పేరుతో చేపట్టిన ఈ ఆపరేషన్‌లో భాగంగా 9 రాష్ట్రాల్లో 32 మంది బ్యాంకు అధికారులతో సహా మొత్తం 52 మందిని అరెస్టు చేశారు. ఈ వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ ఆదివారం మీడియాకు వెల్లడించారు. వారం రోజుల పాటు 16 ప్రత్యేక పోలీసు బృందాలు మహారాష్ట్ర, ఢిల్లీ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్ రాష్ట్రాల్లో ఏకకాలంలో ఈ ఆపరేషన్ నిర్వహించాయి. అరెస్టయిన వారిలో సైబర్ నేరగాళ్లకు సహకరించిన 32 మంది బ్యాంకు అధికారులు, మోసపూరిత లావాదేవీల కోసం తమ ఖాతాలను వాడటానికి అనుమతించిన 15 మంది మ్యూల్ ఖాతాదారులు, నేరగాళ్లకు ఈ ఖాతాలను అందించే ఐదుగురు మధ్యవర్తులు ఉన్నారు. ఇండస్‌ఇండ్ బ్యాంకుకు చెందిన ఆరుగురు, బంధన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాకు చెందిన ఐదుగురు చొప్పున, ఫెడరల్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకుకు చెందిన నలుగురు చొప్పున అధికారులతో పాటు మరో ఐదు ప్రైవేట్ బ్యాంకులకు చెందిన అధికారులు

# ఏలూరు ప్రజల అభిమానాన్ని మర్చిపోను.

**ఎంపీ పుట్టా మహేష్ కుమార్.**
**హైదరాబాద్ డ్రగ్ కేసుతో నాకు సంబంధం లేదు.**
**నేను ఏ తప్పు చేయలేదు.**
**40 రోజుల తర్వాత ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్.**
**ఘన స్వాగతం పలికిన కార్యకర్తలు, అభిమానులు.**



**ఏలూరుబ్యూరో చీఫ్ , ఏప్రిల్ 19: నంది పత్రిక** నిష్కళంకితుడననీ, హైదరాబాద్ డ్రగ్స్ కేసులో తన పాత్ర ఏమీ లేదని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు. హైదరాబాద్ లో ఒక ఫామ్ హౌస్ లో డ్రగ్స్ పార్టీకి వెళ్లారని ఆరోపణలు ఎదుర్కొన్న తరువాత ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆదివారం తొలిసారిగా ఏలూరులో అడుగు పెట్టారు. మధ్యాహ్న 12.40 సమయంలో ఏలూరు శాంతినగర్ లోని తన క్యాంపు కార్యాలయంకు చేరుకున్న ఎంపీకి అభిమానులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడకు వచ్చిన మీడియా ప్రతినిధులతో కొద్ది సేపు మాట్లాడిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్.. హైదరాబాద్ డ్రగ్స్ కేసులో తాను ఏ తప్పు చేయలేదని స్పష్టం చేశారు. తనపై వచ్చిన ఆరోపణలన్ని తప్పని, డ్రగ్స్ కేసు విచారణలో కడిగిన ముత్యంలా బయటకు వస్తానని ఎంపీ విశ్వాసం వ్యక్తం చేశారు. కేసు ఇంకా విచారణ దశలోనే ఉన్నందున దానిపై ఎక్కువగా మాట్లాడలేనని, మీడియా సంయమనం పాటించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. తాను ఏ తప్పు చేయకపోయినా మీడియాలో వచ్చిన కథనాలతో మనస్థాపానికి గురయ్యాయని చెబుతూ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ కార్యకర్తలు, అభిమానులు తనకు మద్దతుగా నిలిచారన్నారు. కష్ట సమయంలో తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. ఏలూరు పార్లమెంటు అభివృద్ధికి అంకితమై పని చేస్తానని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు.

**ఎంపీ లను కలిసిన ఎమ్మెల్యేలు, నేతలు..**దాదాపు 40 రోజుల తర్వాత ఏలూరు వచ్చిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ను టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య, ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, రోషన్ కుమార్, ధర్మరాజు, అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, ఇతర నేతలు మర్యాదపూర్వకంగా కలిసారు.

**ఎంపీకి భారీ స్వాగతం..** ఉదయం 10.40 సమయంలో గన్నవరం ఎయిర్ పోర్టుకు చేరుకున్న ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఎయిర్ పోర్టు నుంచి బయటకు రాగానే అభిమానులు పూలవర్షం కురిపించారు. వారి ప్రేమాభిమానాలతో తడిసి ముద్దైన ఎంపీ కాసేపు భావోద్వేగానికి గురయ్యారు. గన్నవరం నుంచి భారీ ర్యాలీగా ఏలూరు బయలుదేరిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెంట దాదాపు 300కు పైగా కార్లు వాహనాలతో అభిమానులు అనుసరించారు. ప్లకార్డులు, బ్యానర్లతో భారీగా తరలివచ్చిన అభిమానులు, టీడీపీ కార్యకర్తలు ఎంపీ పుట్టా కు మద్దతుగా నినాదాలు చేశారు. ఏలూరు నగరంతోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఎంపీ అభిమానులు, టీడీపీ కార్యకర్తలు భారీగా తరలిరావడంతో క్యాంపు కార్యాలయం ఉన్న శాంతినగర్ పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి.

# ప్రతి ఒక్కరూ జనగణన సదుపాయాన్ని వినియోగించుకోవాలి

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**



**బీమవరంబ్యూరో చీఫ్ ఏప్రిల్ బీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 19నంది పత్రిక** రాష్ట్రంలో జనాభా గణన-2027 మొదటి దశలో స్వీయ-గణన ద్వారా, ఇండ్ల జాబితా, ఇండ్ల గణన కార్యకలాపాల ప్రక్రియ ప్రారంభమైందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే సౌకర్యం మే 30వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ విధానం చాలా సులభమైందని పేర్కొంటూ, హ్ట్ట్ప్స://ంవ.ఎవఅంబం.స్త్రశీఙ.ఱఅ వెబ్సైట్‌లో లాగిన్ అయి, మొబైల్ నంబర్ ద్వారా ప్రవేశించి, ఇంటి జియో లొకేషన్ ఎంపిక చేసి అవసరమైన వివరాలను నమోదు చేయవచ్చని సూచించారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ ఇళ్ల వివరాలను డిజిటల్ విధానంలో నమోదు చేసుకోవాలని, అలాగే తమ సన్నిహితులు, పరిచయస్తులకు కూడా ఈ విషయాన్ని తెలియజేయాలని కోరారు. ముందస్తుగా వ్యక్తిగతంగా ఇళ్ల నమోదు ప్రక్రియను ఈ నెలాఖరు వరకు పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. ఇళ్ల వివరాలు నమోదు చేసే సమయంలో ఎటువంటి అపోహలకు గురికావద్దని ప్రజలకు సూచించారు. దేశ భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనకు ఈ గణన ఎంతో ముఖ్యమని, అందువల్ల ప్రజలు సహకరించాలని కోరారు. వ్యక్తిగత ఇళ్ల నమోదు పూర్తయ్యాక జనగణన అధికారికంగా ప్రారంభమవుతుందని తెలిపారు. మే 1వ తేదీ నుంచి ఎన్యుమరేటర్లు ఇళ్లకు వచ్చి వివరాలను నమోదు చేస్తారని తెలిపారు. ఈ నమోదు ప్రక్రియ వల్ల ప్రభుత్వ పథకాలు నిలిచిపోతాయని లేదా ప్రయోజనాలు ఆగిపోతాయనే అనుమానాలు వద్దని స్పష్టం చేశారు. ఇది పూర్తిగా దేశ అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమమని వివరించారు.

# ఏప్రిల్ 20న జిల్లా, డివిజన్, మండల కేంద్రాలలో పి జి ఆర్ ఎస్ కార్యక్రమం నిర్వహణ

**ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**



**బీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 19నంది పత్రిక** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ( పి జి ఆర్ ఎస్ ) కార్యక్రమాన్ని ఈ సోమవారం కలెక్టరేట్‌లోని పి.జి.ఆర్.ఎస్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లా కలెక్టరేట్ తో పాటు డివిజన్, మండల కేంద్రాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అర్జీదారులు తమ అర్జీలను అధికారిక వెబ్‌సైట్ మీవవనెశీయిఎ.ఖజూ.స్త్రశీఙ.ఱఅ ద్వారా నమోదు చేసుకోవచ్చును. అర్జీ స్థితి లేదా ఇతర వివరాలకు సంబంధించి సమాచారం కోసం నేరుగా 1100 కాల్ సెంటర్ ను సంప్రదించవచ్చును. జిల్లా మరియు మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అల్పాహారం, భోజనం, అర్జీల పర్యవేక్షణ తదితర ఏర్పాట్లు చేయడమైనది. అర్జీదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# జలధార-జల హారతి పనులను త్వరితగతిన ప్రారంభించాలి

**ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో రోజుకు 1.37 లక్షల మంది కూలీలు పనిచేయాలి**
**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....**జిల్లాలో గుర్తించిన జలధార-జల హారతి పనులను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు ఆదివారం రాత్రిఎంపీడీవోలు, ఇరిగేషన్ ఇంజనీర్లు, ఉపాధి హామీ సిబ్బందితో జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, జలధార జలహారతి ఉపాధి హామీ పనులపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జలధార-జల హారతి కింద గత పది రోజులుగా గుర్తించిన నీటి సంరక్షణ, చెరువుల మరమ్మత్తులు తదితర పనులకు ఎస్టిమేట్స్ వేసి పంపించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. అలాగే జిల్లాలో గతంలో గత పది సంవత్సరాలుగా గత పది, పదిహేనేళ్లుగా చేసిన నీటి సంరక్షణ పనులను గ్రామస్థాయిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు, ఉపాధి హామీ సిబ్బంది వాటికి ఏమైనా మరమ్మత్తులు ఉన్నాయా అని పున పరిశీలన చేయాలని కలెక్టర్ ఆదేశించారు.. ఇలాంటివి జిల్లాలో 48000 ఉన్నాయని, వీటిని పరిశీలించి నివేదిక పంపాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే మంజూరు చేసిన జల సంరక్షణ పనులు, చెరువుల మరమ్మత్తులు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో ప్రతిరోజు 1.37 లక్షల మంది కూలీలను పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డ్వామా పీడిని ఆదేశించారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ఉదయం 5.30 గంటల నుండి 6 గంటల లోపు కూలీలను పనులకు వచ్చేలా చూడాలన్నారు.. కూలీలు ఎక్కడా ఎండకు ఇబ్బంది పడకూడదని, 10 గంటలకు వర్క్ సైట్ నుండి వెళ్ళిపోయేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.. టెలి కాన్ఫరెన్స్ లో డ్వామా పిడి నరసింహారెడ్డి, ఇరిగేషన్ ఎస్ ఈ బాలచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిందితుడు ఆత్మహత్య



**బనగానపల్లె ఏప్రిల్ 19నందిపత్రిక** ఓ కేసు లో ముద్దాయిగా ఉన్న దొమ్మరి వెంకట సుబ్బయ్య అనే నిందితుడు 37 సంవత్సరాలు ఆత్మహత్య కు పాల్పడినట్లు సీఐ రమేష్ బాబు తెలిపారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ బెలుం గ్రామములో జరిగిన ట్రాక్టర్ దొంగ తనం కేసు లో సిసి పుటెజ్ ఆధారంగా నింది తులను 16 న అదుపులోకి తీసుకొన్నట్లు తెలిపారు. అయితే ఆదివారం బాత్రూం వెళ్లేందుకు పోయి నిందితుడు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు.నిందితుడి పై గతంలో స్టేషన్ లో మూడు కేసులు ఉన్నట్లు తెలిపారు.నిందితుడి భార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# మహిళలను వేధింపులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవు





**మహిళల భద్రత, బాల్య వివాహాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించిన ఎమ్మిగనూరు - డీఎస్పీ భార్గవి**

**మంత్రాలయం , ఏప్రిల్ 19** మహిళలను వేధింపులు , హింసిస్తే కఠిన చర్యలు తప్పవు ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలోని చిలకలడోణ గ్రామంలో మంత్రాలయం సిఐ దస్తగిరి బాబు నేతృత్వంలో మహిళల భద్రత, బాల్య వివాహాల నివారణ ,బాలికల విద్యాభివృద్ధిపై అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల భద్రత సమాజ అభివృద్ధికి పునాది అని తెలిపారు. మహిళలపై వేధింపులు, హింసకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అవి బాలికల విద్యా అవకాశాలను దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ కుమార్తెల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వేసవి కాలంలో దొంగతనాలు పెరిగే అవకాశం ఉండడంతో గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామానికి సమీపంగా ఎన్‌హెచ్167 జాతీయ రహదారి ఉండటంతో రోడ్డు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలని గ్రామ ప్రజలకు సూచించారు. అలాగే మాట్కా, జూదం, క్రికెట్ బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అనంతరం సిఐ దస్తగిరి బాబు మాట్లాడుతూ మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. మహిళలపై వేధింపులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాలికల చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలని తల్లిదండ్రులకు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, అతివేగాన్ని నివారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మల్లికార్జున , కానిస్టేబుల్ సోమశేఖర్ , రామకృష్ణ ,ఉన్నారు.

# ఓంకారంలో మహిళ అదృశ్యం



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 19:** బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఓంకార పుణ్యక్షేత్రంలో ఓ మహిళ అదృశ్యమైంది. ప్రొద్దుటూరు తాలూకా ఖాదరాబాద్ గ్రామానికి చెందిన జింకల లక్ష్మీదేవి (62)తో పాటు ఇద్దరు మహిళలు ఆదివారం ఓంకార పుణ్యక్షేత్రానికి దర్శనం నిమిత్తమై ఆటోలో ప్రొద్దుటూరు నుండి వచ్చారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో భోజనం చేసిన అనంతరం లక్ష్మీదేవి నీళ్ల కోసం అని వెళ్ళిన ఆమె కనిపించకుండా పోయింది. ఈ విషయంపై ఆమెతో వచ్చిన మహిళలు ఆమె ఆచూకీ కై ఓంకారం పుణ్యక్షేత్రంతో సోమయాజులపల్లె ప్రాంతమంతా గాలించారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఆదివారం సాయంత్రం ఎస్ఐ జగన్మోహన్ పోలీస్ సిబ్బందితో ఓంకార పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు. కాశిరెడ్డి నాయన ఆశ్రమం తో పాటు, చుట్టుపక్కల ప్రాంతాలనిలో గాలింపు చర్యలు చేపట్టారు. పుణ్యక్షేత్రంలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు కూడా పరిశీలించారు. ఓంకారం బేస్ ఎఫ్ బి ఓ హైమావతి తో పాటు ప్రొటెక్షన్ వాచర్లు కూడా ఓంకార పరిసర ప్రాంతాలలో గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ లక్ష్మీదేవి ఆచూకీ లభించలేదు. లక్ష్మీదేవి ఆచూకీ తెలియనందున ఆమె కూతురు అరుణ ఆదివారం రాత్రి బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ జరుగుతున్నట్లు ఎస్సై జగన్మోహన్ పేర్కొన్నారు.

# బీసీ వసతి గృహా వార్డన్ నిర్మల ను వెంటనే సస్పెండ్ చేయాలి

**- ఏ.ఐ.ఎస్.బి రాష్ట్ర అధ్యక్షులు సగిలి రాజేంద్ర ప్రసాద్**

**బద్వేల్ ఏప్రిల్ 19 (నంది పత్రిక):**అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న బద్వేల్ బీసీ కళాశాల వసతి గృహం వార్డన్ నిర్మల ను వెంటనే సస్పెన్ చేయాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏ.ఐ.ఎస్.బి) రాష్ట్ర అధ్యక్షులు సగిలి రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....

బద్వేలు బీసీ కళాశాల వసతి గృహంలో వార్డెన్ గా విధులు నివసిస్తున్న నిర్మల విద్యార్థినిలకు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సరైన మెనూ అమలు చేయకుండా, నాణ్యతలేని ఆహారం అందించడం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తూ, విద్యార్థినిల హక్కులను హరించడం అత్యంత ఆందోళనకరమైన విషయం అని వారు పేర్కొన్నారు. విద్యార్థినుల ఆరోగ్యం, భవిష్యత్తుతో ఆటలాడుతున్న ఇటువంటి వార్డన్‌పై వెంటనే విచారణ జరిపి, నిజానిజాలు బయటపెట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని వారు హెచ్చరించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నేను అమలు చేయకుండా అక్రమాలకు పాల్పడుతున్న వార్డన్ నిర్మలను తక్షణమే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కలెక్టరేట్ వద్ద ప్రత్యక్ష ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏ.ఐ.ఎస్.బి జిల్లా నాయకులు అఖిల్, సుమంత్ లు పాల్గొన్నారు.



# మహానంది పుణ్యక్షేత్రంలో హైకోర్టు జడ్జి జస్టిస్ హరి హరనాథ శర్మ పూజలు



**మహానంది,ఏప్రిల్ 19 (నంది పత్రిక):-** మహానంది పుణ్యక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్.హరిహరనాథ శర్మ పూజలు చేశారు.ముందుగా ఆలయానికి వచ్చిన వీరికి ఆలయ ఈవో ఎన్.శ్రీనివాసరెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీస్వర స్వామి అమ్మవారు దర్శించుకుని అభిషేకం,కుంకుమార్చన, పూజలు నిర్వహించుకున్నారు.పూజలు అనంతరం ఈవో స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి,స్వామివారి జ్ఞాపకను అందజేయగా,వేద పండితులు వేద ఆశీర్వాదాలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.వీరి వెంట మహానంది ఎస్ ఐ ఎన్.రామ్మోహన్ రెడ్డి, పాల్గొన్నారు.

# ఈనెల 20వ తేదీ సోమవారం యధావిధిగా పీజీఆర్ఎస్ మరియు రెవిన్యూ క్లినిక్ ల నిర్వహణ

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీర్స్ ) మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలకు విస్తరణ



**ఏలూరుబ్యూరో చీఫ్ , ఏప్రిల్, 19:నంది పత్రిక** ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని మరింత వేగవంతంగా, ప్రజల దృష్టికి మరింత చేరువ చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీర్స్ ) సేవలను ఈ నెల 20 వ తేదీ సోమవారం మండల, డివిజనల్ మరియు మున్సిపల్ స్థాయిల్లో కూడా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో ఈనెల 20వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి యధావిధిగా పిజి ఆర్ ఎస్, రెవిన్యూ క్లినిక్ కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. ఇప్పటివరకు జిల్లా స్థాయిలో అమలవుతున్న ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థను ప్రభుత్వం ఇప్పుడు వికేంద్రీకరించింది. దీని ద్వారా ప్రజలు తమ ఫిర్యాదులను సమీప మండల కార్యాలయాల్లో, డివిజనల్ కార్యాలయాల్లో, లేదా మున్సిపల్ కార్యాలయాల్లో నేరుగా సమర్పించుకోవచ్చు.

అలాగే, ఇంటి నుంచే ఆన్లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు, ప్రభుత్వం అందించిన అధికారిక వెబ్సైట్:

ఫ్త్రజూం://ఎవవనిశీయిఎ.ఖజూ.న్రశీఐ.ఱఅఫిర్యాదు నమోదు, ఫిర్యాదుల స్థితి తదితర సమాచారం తెలుసుకోవాలంటే, 1100 (డబుల్ వన్ డబుల్ జీరో) టోల్ఫ్రీ నంబర్కు కాల్ చేయవచ్చు. ఈ వ్యవస్థ వల్ల ప్రజల సమస్యలు తక్షణమే సంబంధిత అధికారులకు చేరి, సమయానుకూలంగా పరిష్కారమవుతాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు గుర్తించి పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి కోరారు.

# నవ గోప్యాలు

ఆయువు, విత్తము, ఇంటిగుట్టు, మంత్రం, ఔషధం, సంగమం, దానం, మానము, అవమానం అనే ఈ తొమ్మిదింటిని "నవగోప్యాలు" అంటారు. ఇవి రహస్యంగా ఉంచాల్సినవి

1) భగవంతుడు అన్ని జంతువులకు ఇచ్చినట్లు శరీరం ఇచ్చినప్పటికీ లివివేకములిఅనే గొప్ప గుణం మనిషికి ఇచ్చాడు. అలాగే నిన్న జరిగిన విషయం గుర్తుకుతెచ్చుకుంటే తప్ప గుర్తుకురాదు. ఇపుడు జరుగుతున్నది ఆలోచిస్తే తప్ప అర్థం కాదు. రేపు జరుగబోయేది ఏం చేసినా తెలియదు. ఈమూడు కారణాలవల్ల మనిషి పిచ్చెక్కకుండా సుఖంగా ఉండగలుగుతున్నాడు. మరుక్షణంలో మనిషి ఛస్తాడని తెలిస్తే ముందు క్షణమే ఆలోచనతో చావడం ఖాయం. నిజంగా నీ ఆయుఃప్రమాణం ఇదీ అని తెలిసినా, నిబ్బరంగా ఉండి, దాన్ని రహస్యంగా ఉంచాలి. లేకుంటే అది బహిరంగ రహస్యమై వాడిని బాధిస్తుంది. కాబట్టి భవిష్యత్తు జ్ఞానంలో ఆయుష్షుది ప్రధాన పాత్ర. అది తెలిసినా గోప్యంగా ఉంచమన్నాడు శాస్త్రకారుడు. 2) ధనం ఎంత ఉన్నా రహస్యంగా ఉంచాలి. దానివల్లఎన్నో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఎంత ధనం ఉన్నా మన జీవన విధానం క్రమబద్ధంగా, క్రమశిక్షణతో ఉన్నపుడు మనకు నష్టం జరుగదు. 'లక్షాధికారైనా లవణమన్నమే గాని మెరుగు బంగారంబు మ్రింగబోడు' అన్నట్లు నిరాడంబర జీవనం గడపడానికి అలవాటు చేసుకోవాలి. ధనం ఉప్పులాంటిది. అది ఎక్కువైనా, తక్కువైనా రెండూ కష్టమే. 'అతి సంచయేచ్ఛ తగదు' అన్న నీతి చంద్రిక వాక్యం ధనం విషయంలో నూటికి నూరుపాళ్ళు నిజం. అయినా మన దగ్గర ఉన్నవిషయం అనవసరంగా బయటకు వెల్లడించడం ప్రమాదకరం. ధనానికి ధర్మం, రాజు, అగ్ని, దొంగ అనే నలుగురు వారసులు. ఇందులో పెద్దవారసుడు ధర్మం. అతడు నలుగురికీ అన్న. తండ్రి ధనంలో పెద్దన్నకు పెద్ద వాటా రావాలి. అంటే ధర్మానికి డబ్బు ఎక్కువ వినియోగించాలి. ధర్మకార్యాలకు ధనం వినియోగించకపోతే పన్నుల మూలకంగా రాజు (ప్రభుత్వం) దాన్ని స్వాధీన పరచుకోవడమో, అగ్ని ప్రమాదాలవల్ల నష్టమో, దొంగలు దోచుకోవడమో జరుగుతుంది. 3) ఇంట్లో ఎన్నో సమస్యలుంటాయి. దానినె 'ఇంటిగుట్టు' అని పిలుస్తారు. కుటుంబంలో ప్రేమ పూర్వక వాతావరణం నిర్మాణం చేయాలి. అప్పుడప్పుడు ఆ ప్రేమలకు అవరోధం ఏర్పడి కలహాలు సంభవిస్తూంటాయి. వాటిలో రహస్యాలను బహిరంగం చేయాలనుకోవడం తెలివితక్కువ పని. సామరస్యంగా పరిష్కారం కనుక్కోవడం తెలివైన పని. తండ్రి- కొడుకు, భార్య భర్త, అన్నదమ్ములు, అక్కాచెలెళ్ల మధ్య గొడవలు వస్తుంటాయి. వ్యక్తిగత అహంకారాలు, ఒంటరిగా జీవించాలనుకొనే స్వార్థబుద్ధి, మా వరకే మంచిగా వుండాలనే వ్యక్తిత్వం- ఇవన్నీ ఈరోజు మన కుటుంబ వ్యవస్థను ధ్వంసం చేశాయి. ఏది జరిగినా ఇంటి గుట్టును ఈశ్వరునికే తెలిసేటట్లు ఉంచాలిగాని బహిరంగపర్చడం ధర్మంకాదు. 4) "మననం చేసేది మంత్రం"- మంత్రం రహస్యంగా చెవిలో ఉపదేశం చెయ్యడం మన సంప్రదాయం. మంత్ర వైశిష్ట్యం తెలిసినవారికి చెప్పడంవల్ల దాని ప్రయోజనం నెరవేరుతుంది కాని అపాత్రునికి చెప్పడంవల్ల నష్టమని భావన. దానిమీద భక్తిలేని వాడికి చెబితే అది అభాసుపాలవుతుంది. మంత్రంపై అచంచల నమ్మకం ఉండాలి. 5) పరపంచంలో ప్రతి మొక్క ఔషధమే. ఇవాళ భయంకర రసాయనాలు ఔషధాలుగా ఉపయోగిస్తున్నాం. ఇవి అందరికి బహిరంగ పరచి ఎవ్వరంటేవారు తయారుచేయకూడదు. ఔషధం రహస్యంగా ఉంచడం మంచిదే. 6) సంగమం అంటే కలయిక. మనం కొన్ని రహస్యమైన భేటీలు జరుపుతాం. అవి అధికారిక, అనధికారమైనవి ఏవైనా కావచ్చు. రహస్యంగా ఉంచడం ఉత్తమం. అలాగే గొప్పవారు అనుకునే వారి జీవితాల్లో ఎన్నో రహస్యలున్న సమావేశాలు ఉంటుంటాయి. అవి బహిర్గతమైనపుడు వారి వ్యక్తిత్వాలపై మచ్చ ఏర్పడుతుంది. కాబట్టి మనం చేసే సంగమం రహస్యంగా ఉంచడం మంచిది. 7) దనం అన్నింటిలో చాలా గొప్పది. అది రహస్యంగా చేస్తే మంచిది. చేసిన దానం ఊరికే చెబితే ఫలం ఇవ్వదు. మనం చేసిన దానం రహస్యంగా ఉంచితే వెంటనే ఫలం ఇస్తుంది. 8) మనం అంటే గౌరవం. దాన్ని ఎప్పుడూ కాపాడుకోవాలి. ఏమీ చేతగాకున్నా నేనింతవాణ్ణి అంతవాణ్ణి అని చెప్పకూడదు. మనం గౌరవాన్ని ఎంత రహస్యంగా ఉంచితే అంత పెరుగుతుంది. 9) అలాగే తనకు జరిగిన అవమానం మరిచిపోవాలి. అవమానాలను అస్తమానం మననం చేస్తే క్రోధం పెరుగుతుంది. దాంతో పగ.. అలా అంటే ఉండదు. ప్రపంచంలో ఉన్న ముళ్ళను మొత్తం మనం తొలగించలేం కానీ మన చెప్పులు వేసుకొని వెళ్ళడం సులభం. ఈ తొమ్మిది రహస్యలను కాపాడుకోవడం విజ్ఞుల లక్షణం అని పెద్దలు చెప్పిన జ్ఞానబోధ.

**సేకరణ- పెరుమాళ్ళ వెంకట సురేంద్ర**
**(రుద్రవరం ప్రతినిధి)**

# రహదారిపై ధాన్యం ఆరబోస్తే చర్యలు.. ఎస్సై రాజారెడ్డి



**చాగలమర్రి ఏప్రిల్ 19నంది పత్రిక** రోడ్డు నిబంధనలు పాటించకుండా రహదారిపై పండించిన ధాన్యం ఆరబోసి ప్రయాణికులకు అసౌకర్యం కలిగిస్తూ, రోడ్డు ప్రమాదాలకు గురి చేస్తే చర్యలు తప్పవని చాగలమర్రి ఎస్సై రాజారెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల రోడ్డుపై ఉన్న ధాన్యాన్ని తాకుతూ ప్రయాణించిన వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారన్నారు. రైతులు పండించిన మొక్కజొన్న పంటను ఆరబెట్టడానికి ప్రధాన రహదారులను, గ్రామాలకు వెళ్లే రోడ్లను ఉపయోగించడం ద్వారా వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురి కావడమే కాక ప్రాణాంతకమైన ప్రమాదాలకు గురవుతున్నారు. గారికి అడ్డంగా ఉన్న ధాన్యాన్ని తప్పించబోయి ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి జారి పడుతున్నాయని తెలిపారు. రాత్రి సమయాల్లో రోడ్డుపై ఉన్న ఆరబెట్టిన ధాన్యం కనిపించకపోవడంతో తీవ్రంగా గాయపడుతున్నారన్నారు. ప్రజల రాకపోకలకు రహదారి ఏర్పాటు చేయగా కొంతమంది రైతులు పంట ధాన్యాన్ని ఆరబోయడానికి ఉపయోగించుకుంటున్నారని ఈ చర్య చట్టరీత్యా నేరమన్నారు. పంటను కల్లాలలో, ఖాళీ ప్రదేశాల్లో దులుపుకొని అరబోసుకోవాలే తప్ప రోడ్లపైకి రాకూడదన్నారు. ప్రజల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలుసుకోవాలని తెలిపారు. నిబంధనలు పాటించని రైతులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

## ఎగువ అహోబిలంలో అగ్నిప్రమాదం: కంటైనర్ దగ్ధం



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఏప్రిల్ 19 నంది పత్రిక** ఎగువ అహోబిలం లోని శ్రీ కారంజ నరసింహస్వామి ఆలయం వద్ద ఆదివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. శ్రీ కారంజ నరసింహస్వామి గేట్ వద్ద సిబ్బందికి ఏర్పాటు చేసిన షెల్టర్ షార్ట్ సర్క్యూట్ తో కాలిపోయింది. ఈ ఘటనలో కంటైనర్లో భద్రపరిచిన సీసీ కెమెరా ఫుటేజ్, దానికి సంబంధించిన పరికరాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంపై దేవస్థానం అధికారులు ఆరా తీస్తున్నారు.

# డివైడర్ ని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

## తృటిలో తప్పిన ప్రమాదం




**ఆళ్లగడ్డ ప్రతినిధి ఏప్రిల్ 19 నంది పత్రిక** ఆళ్లగడ్డ మండలం చింతకొమ్మదిన్నే గ్రామం వద్ద ఆదివారం తెల్లవారుజామున కామాక్షి ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురైంది. హైదరాబాద్ నుండి తిరుపతి వైపు వెళ్తున్న కామాక్షి ట్రావెల్స్కు చెందిన ప్రైవేట్ బస్సు సుమారు 5 గంటల ప్రాంతంలో చింతకొమ్మదిన్నె గ్రామం మెట్ట వద్దకు చేరుకోగానే డ్రైవర్కు నిద్రమత్తు రావడంతో అదుపుతప్పి చీఎ 40 హైవేపై ఉన్న డివైడర్ను ఢీకొట్టింది. కాగా అదృష్టవశాత్తూ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులెవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. బస్సుకు మాత్రం స్వల్పంగా నష్టం వాటిల్లింది. సమాచారం అందుకున్న వెంటనే స్థానిక హైవే మొబైల్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

# డోర్నకల్లో ఆశా కార్యకర్తల నూతన కమిటీ ఎన్నిక.

## డిమాండ్ల సాధనకు పోరాటం కొనసాగిస్తామని నాయకుల స్పష్టం.



**డోర్నకల్, ఏప్రిల్ 19 :-** డోర్నకల్ మండలంలో ఆశా కార్యకర్తల యూనియన్ నూతన కమిటీని ఆదివారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ యూనియన్ అనుబంధ సంస్థ ఐఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు కూర వెంకన్న ఆదేశాల మేరకు రాష్ట్ర మహిళా ఐఎన్టీయూసీ అధ్యక్షురాలు మోమీద ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల కమిటీ అధ్యక్షురాలిగా అనిత, ప్రధాన కార్యదర్శిగా స్రవంతి, కార్యదర్శిగా నిర్మల, కోశాధికారిగా నాగరాణిని ఎన్నుకోగా, గౌరవ అధ్యక్షురాలిగా యల్లావుల సువర్ణను ఎంపిక చేశారు.అనంతరం జరిగిన సమావేశంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మాట్లాడుతూ ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలకు రూ.18 వేల జీతం ఇవ్వాలని, ఏఎన్ఎం ట్రైనింగ్ పూర్తి చేసిన వారికి ఉద్యోగావకాశాలు కల్పించాలని, విధి నిర్వహణలో మరణించిన ఆశా కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. 13వ వార్డు కౌన్సిలర్ యల్లావుల సువర్ణ హరికృష్ణ మాట్లాడుతూ ఆశా కార్యకర్తల సమస్యలను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వానికి తెలియజేస్తామని, తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా 20 సంవత్సరాల పాటు ఆశా కార్యకర్తగా సేవలందించి, అనంతరం మున్సిపల్ ఎన్నికల్లో 13వ వార్డు కౌన్సిలర్గా ఎన్నికైన యల్లావుల సువర్ణ హరికృష్ణను రాష్ట్ర నాయకులు, మండల ఆశా కార్యకర్తల యూనియన్ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. సమావేశానికి మండలంలోని ఆశా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ఆళ్లగడ్డ డిఎస్పీగా ఏ శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరణ

## అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కు పాదం మోపుతాం డీఎస్పీఏ శ్రీనివాసులు



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఏప్రిల్ 19 నంది పత్రిక** ఆళ్లగడ్డ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతామని నూతన డిఎస్పి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఆదివారం ఆయన నూతన డిఎస్పీగా ఆళ్లగడ్డ డిఎస్పి కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెల్లూరు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ గా పనిచేస్తూ ఉన్నతాధికారుల ఉత్తర్వులతో ఇక్కడికి రావడం జరిగిందని తెలిపారు. ఆళ్లగడ్డ సబ్ డివిజన్లో శాంతిభద్రతల సంరక్షణకు సిబ్బంది సహాయ సహకారాలతో తమ వంతు కృషి చేస్తామని డిఎస్పీ శ్రీనివాసరావు వివరించారు. నూతన డీఎస్పీకి టౌన్ సిఐ నాగరాజు రావు రూరల్ సీఐ బి వి రమణ, ఎస్సై లు వరప్రసాద్, చిన్న పీరయ్య , పోలీస్ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.

# పాఠశాలకు ఆటో కొనుగోలుకు దాతల విరాళాలు

## అనిత దుర్గారావు దంపతులు చావా రామకృష్ణ పుట్ట అనిల్ కుమార్







**అశ్వాపురం ఏప్రిల్ 19 –** మండల పరిధిలోని నెల్లిపాక బంజర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు ఇరవెండి, రామచంద్రాపురం సత్యనారాయణపురం గ్రామాల నుండి విద్యార్థులను తరలించేందుకు, ఆటో కొనుగోలుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో విరాళాలు సేకరిస్తున్నారు. స్పందిస్తున్న పాఠశాల పూర్వ విద్యార్థులు తమ శక్తి వంచన లేకుండా విరాళాలు అందజేస్తున్నారు. ఆదివారం పాఠశాల పూర్వ విద్యార్థిని భద్రాచలం కు చెందిన నిడదవోలు అనిత - దుర్గారావు దంపతులు 25 వేల రూపాయలు, టేకులగుట్టకు చెందిన చావా రామకృష్ణ 50 వేల రూపాయలు, నెల్లిపాక బంజరకు చెందిన పుట్ట అనిల్ కుమార్ 10 వేల రూపాయలు సర్పంచ్ మంద్రు రామకృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

# వడదెబ్బతో వ్యక్తి మృతి



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఏప్రిల్ 19 నంది పత్రిక** ఆళ్లగడ్డ మండలం మిట్టపల్లి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. మిట్టపల్లి గ్రామానికి చెందిన యాతం బాల చెన్నయ్య (65) వడదెబ్బతో మరణించాడు. గ్రామంలోని మామిడి తోటలో ఆయన కూలీగా పనిచేస్తూ శనివారం తోటకు కాపలా కాసి శనివారం మధ్యాహ్నం నాలుగు గంటల సమయంలో ఎండలో ఇంటికి తిరిగి వస్తూ క్రింద పడి పోయి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. గ్రామ సర్పంచ్ ఈ సమాచారాన్ని మండల అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగింది.

## కోటి హెల్మెట్లు... భారత మార్కెట్లో 'స్టీల్బర్డ్' జోరు

ప్రముఖ హెల్మెట్ల తయారీ సంస్థ స్టీల్బర్డ్ హై-టెక్ ఇండియా, భారత మార్కెట్లో ఓ అరుదైన మైలురాయిని అందుకుంది. సంస్థకు చెందిన పాపులర్ =ూశ సిరీస్ హెల్మెట్లు ఏకంగా 1 కోటి (10 మిలియన్) యూనిట్ల అమ్మకాలను పూర్తి చేశాయి. దేశంలో సరసమైన ధరలో లభించే ×ూ× సర్టిఫైడ్ హెల్మెట్లకు పెరుగుతున్న ఆదరణకు ఈ విజయం నిదర్శనంగా నిలుస్తోంది. కేవలం రూ. 969 ప్రారంభ ధరతో లభించడం, నాణ్యతా ప్రమాణాలను పాటించడం =ూశ సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించాయి. దీంతో రోజువారీ ప్రయాణికులు, యువ రైడర్లకు నాణ్యమైన భద్రత అందుబాటులోకి వచ్చింది. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా స్టీల్బర్డ్ తన విస్తృతమైన డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్ ద్వారా ఈ హెల్మెట్లను ప్రజలకు చేరువ చేసింది.

ఈ విజయంపై స్టీల్బర్డ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ కపూర్ హర్షం వ్యక్తం చేశారు. "కోటి హెల్మెట్ల అమ్మకాల మార్కును దాటడం మాపై లక్షలాది మంది రైడర్లు చూపిన నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది. సర్టిఫైడ్ హెల్మెట్లను అందరికీ అందుబాటులోకి తెచ్చి, రోడ్డు భద్రతను పెంచే జాతీయ ప్రయత్నాలకు మేము మద్దతిస్తున్నందుకు గర్వంగా ఉంది" అని తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 200కి పైగా ఎక్స్క్లూజివ్ రైడర్ షాపులు నిర్వహిస్తున్న స్టీల్బర్డ్, వాటి సంఖ్యను 1,000కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# 92 మంది భారతీయ యాత్రికులకు వీసా నిరాకరించిన పాకిస్థాన్

పాకిస్థాన్లోని పవిత్ర క్షేత్రాలను సందర్శించాలనుకున్న 92 మంది భారతీయులకు అక్కడి ప్రభుత్వం వీసాలు నిరాకరించింది. ఖల్సా సజ్నా దివస్ వేడుకల్లో భాగంగా గురుద్వారా పంజా సాహిబ్ను దర్శించుకునేందుకు వీరు సిద్ధమవగా, ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ ఘటనపై ఖల్సా వాక్స్ న్యూస్ పోర్టల్ ఒక కథనాన్ని ప్రచురించింది. ఈ 92 మంది భక్తుల పేర్ల చివర "సింగ్" లేదా "కౌర్" లేనప్పటికీ, వీరంతా పది మంది సిక్కు గురువులపై ప్రగాఢ విశ్వాసం ఉన్నవారని ఖల్సా వాక్స్ కథనంలో సుదీప్ సింగ్ పేర్కొన్నారు. మొదట ఏప్రిల్ 10 నుంచి 19 వరకు వీరికి వీసాలు మంజూరు చేసిన పాకిస్థాన్, ఆ తర్వాత వాటిని రద్దు చేయడం భారతీయ కుటుంబాల మత విశ్వాసాలను దెబ్బతీసిందని ఆయన విమర్శించారు.

## నూతన గృహప్రవేశ మహోత్సవానికి ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి హాజరు



బళ్లారి పట్టణంలో చిప్పగిరి మండలం దేగులపాడు గ్రామానికి చెందిన జూటూరు ధనుంజయ నూతన గృహప్రవేశ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ శుభకార్యానికి ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి ముఖ్య అతిథిగా హాజరై, గృహ యజమానులకు ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కుటుంబంలో కొత్త ఇంటి నిర్మాణం ఒక ముఖ్యమైన మైలురాయిగా భావించాల్సిందిగా పేర్కొన్నారు. కొత్త ఇంట్లో సుఖశాంతులు నెలకొనాలని, కుటుంబ సభ్యులందరూ ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, బీవీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని, జూటూరు ధనుంజయ కి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం ఆనందభరిత వాతావరణంలో కొనసాగింది.

## డిసిఎం పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని జనసేన పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

**శ్రీకాళహస్తి ఏప్రిల్ 19** జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని, వారు సంపూర్ణ ఆయురారోగ్యాలతో మళ్లీ ప్రజల సేవలో నిమగ్నం కావాలని ఆకాంక్షిస్తూ, శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో భాగంగా, శాస్త్రోక్తంగా చండీ హోమం మరియు మృత్యుంజయ హోమం నిర్వహించారు. పవన్ కళ్యాణ్ కి ఆ దేవుడి ఆశీస్సులు మెండుగా ఉండాలని, ఆయన సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా తిరిగి ప్రజాక్షేత్రంలోకి రావాలని నాయకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కొట్టేసాయి ప్రసాద్, ఏర్పేడు మండల అధ్యక్షుడు కిరణ్ రామిశెట్టి, కుమార్, జయప్రకాష్, గరికపాటి చంద్ర, మాధవ్ మహేష్, ఈర్ల చిరంజీవి, ఢిల్లీ బాబు, లీలాధర్, మోహన్,తేజ,జయరాం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొట్టే సాయి ప్రసాద్ మాట్లాడుతూ లక్షలాది మంది ప్రజల ఆశాజ్యోతి అయిన డిసిఎం పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆ పరమశివుడిని వేడుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిలో మరియు ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన పాత్ర ఎంతో కీలకం అని ,వారు క్షేమంగా తిరిగి వచ్చి, మరింత ఉత్సాహంతో ప్రజా సేవలో పాల్గొనాలని ఆకాంక్షిస్తున్నామని పేర్కొన్నారు.



## బంగారుపేట శాఖ బలోపేతం కోసం ప్రతి ఒక్కరు కృషి చెయ్యండి ::సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి



**కర్నూలు ప్రతినిధి నందిపత్రిక** కర్నూలు నగరంలోని బంగారుపేట శాఖ సమావేశం బీసన్న అధ్యక్షతన జరిగింది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ త్వరలో రాబోయే మున్సిపల్ ఎన్నికలలో బంగారుపేట శాఖ తరపున ఏస్సీ, బీసీ, ఓసీ, మైనారిటీ ఏ కులానికి వచ్చిన పోటీ చెయ్యాలి కాబట్టి ప్రతి ఒక్కరు గెలిపించే దిశగా మనం కృషి చెయ్యాలని ఇప్పుడు ఉన్న కార్పొరేటర్ ఇంత వరకు ఏపని చెయ్యడం లేదు కాబట్టి వచ్చే మున్సిపాలిటీ ఎన్నికలలో సిపిఐ పార్టీని గెలిపించాలని కోరారు సిపిఐ జిల్లా మహిళా అధ్యక్షురాలు మాజీ కార్పొరేటర్ గిడ్డమ్మ మాట్లాడుతూ నేను పదవిలో వున్నప్పుడు ప్రతి ఒక్కరికి అందుబాటులో వుంటూ ప్రతి రోజు వార్డులో తిరిగి ఎవరికీ ఏసమస్య వున్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లేదాన్ని అని చెప్పారు ఎంతో మందికి ఇల్లులు, స్థలాలు ఇప్పియడం జరిగింది వార్డులో వుండే ప్రతి సమస్యను పరిస్కారం చేశాను కాబట్టి ఇప్పుడు వచ్చే ఎన్నికలలో కూడా సిపిఐ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు ఈ కార్యక్రమం లో నాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, నల్లన్న,ధనలక్ష్మి, సీనియర్ నాయకురాలు నాగేశమ్మ, అఖిల్,రామచంద్రుడు బంగారుపేట నాయకులు ప్రజలు పాల్గొన్నారు.



# భక్తులతో పోటెత్తిన బోయకొండ



### భక్తుల సౌకర్యాలు దగ్గరుండి పరివేక్షించిన ఈ.ఓ ఏకాంబరం

: ప్రముఖ పుణ్యక్షేత్రం,భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి బోయకొండ గంగమ్మ దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. ఇటు ఆంధ్రప్రదేశ్ అటు కర్ణాటక,తమిళనాడు లనుండి భక్తులు అధికంగా వచ్చారు,భక్తులు ఉదయం నుండి క్యూలైన్లలో అమ్మవారి మొక్కులు తీర్చుకోవడానికి బారులు తీరారు.ప్రధాన అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి మరియు ఉపకమీషనర్ ఏకాంబరం ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఉచిత ప్రసాదాల వద్ద తోపులాటలు లేకుండా అందరూ క్యూలైన్లో వెళ్ళి ప్రసాదాలు తీసుకొనే విధముగా సిబ్బందిని ఆదేశించారు,అమ్మవారి బలిపీఠము వద్ద జంతుబలులను,అక్కడ గల సౌకర్యాలను,అలాగే తలల వేలం పాటవద్ద గల భక్తులతో చర్చించి,వేలం పాట సవ్యంగా జరుగుతున్నదా లేదా అనేవిషయాలపై,సిబ్బంది భక్తులతో మాట్లాడుతున్న తీరుపై భక్తులను అడిగి తెలుసుకున్నారు,కళ్యాణ కట్ట వద్ద భక్తులకు తలనీలాలు సమర్పించే భక్తులు టికెట్టు ద్వారానే తలనీలాలు సమర్పించాలనీ,ఎవరికీ అధనంగా పైకము చెల్లించవద్దని భక్తులకు తెలియజేశారు,కళ్యాణ కట్ట లో ఎవరైనాసిబ్బంది చేతివాటం ప్రదర్శించినట్లు కార్యాలయం దృష్టికి వస్తే ఖచ్చితమైన చర్యలు ఉంటాయని కళ్యాణ కట్ట సిబ్బందిని హెచ్చరించడం జరిగింది,అంతే కాకుండా అనునిత్యం సమాచార కేంద్రం నుండి ఆలయ ప్రాంగణం లో జేబుదొంగలున్నారని,తమ విలువైన వస్తువులు జాగ్రత్తగా చూసుకోవాలని భక్తులకు హెచ్చరికలు చేశారు,ఎవరికైనా ఏదైనా అసౌకర్యం కలిగినా,ఎవరైనా పిల్లలు తప్పిపోయినా పరిపాలనా కార్యాలయం ఎదురుగా గల సమాచార కేంద్రం లో సంప్రదించాలని సూచించడం జరిగింది.చౌడేపల్లి ఎస్సై చిన్నరెడ్డెప్ప తమ సిబ్బంది తో కలసి ట్రాఫిక్ నియంత్రణ చేశారు.భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదివారం భక్తుల సంఖ్య ఎక్కువగా ఉర్ఘుడటంతో పుంగనూరు రూలర్ సి ఐ సాయి ప్రసాద్ ట్రాఫిక్ పరివేక్షణ చేశారు. కొండపైన సైల్ ఫోన్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్ ల వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.ఈ కార్యక్రమం లో ఆయన వెంట సూపరింటెండెంట్ రామనాథం,సుధాకర్ రెడ్డి,మణి, చౌడేపల్లి పోలీసులు తదితరులు ఉన్నారు.



## బంగారుపేట శాఖ బలోపేతం కోసం ప్రతి ఒక్కరు కృషి చెయ్యండి ::సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి



**కర్నూలు ప్రతినిధి నందిపత్రిక** కర్నూలు నగరంలోని బంగారుపేట శాఖ సమావేశం బీసన్న అధ్యక్షతన జరిగింది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ త్వరలో రాబోయే మున్సిపల్ ఎన్నికలలో బంగారుపేట శాఖ తరపున ఏస్సీ, బీసీ, ఓసీ, మైనారిటీ ఏ కులానికి వచ్చిన పోటీ చెయ్యాలి కాబట్టి ప్రతి ఒక్కరు గెలిపించే దిశగా మనం కృషి చెయ్యాలని ఇప్పుడు ఉన్న కార్పొరేటర్ ఇంత వరకు ఏపని చెయ్యడం లేదు కాబట్టి వచ్చే మున్సిపాలిటీ ఎన్నికలలో సిపిఐ పార్టీని గెలిపించాలని కోరారు సిపిఐ జిల్లా మహిళా అధ్యక్షురాలు మాజీ కార్పొరేటర్ గిడ్డమ్మ మాట్లాడుతూ నేను పదవిలో వున్నప్పుడు ప్రతి ఒక్కరికి అందుబాటులో వుంటూ ప్రతి రోజు వార్డులో తిరిగి ఎవరికీ ఏసమస్య వున్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లేదాన్ని అని చెప్పారు ఎంతో మందికి ఇల్లులు, స్థలాలు ఇప్పియడం జరిగింది వార్డులో వుండే ప్రతి సమస్యను పరిస్కారం చేశాను కాబట్టి ఇప్పుడు వచ్చే ఎన్నికలలో కూడా సిపిఐ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు ఈ కార్యక్రమం లో నాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, నల్లన్న,ధనలక్ష్మి, సీనియర్ నాయకురాలు నాగేశమ్మ, అఖిల్,రామచంద్రుడు బంగారుపేట నాయకులు ప్రజలు పాల్గొన్నారు.



# ప్రజలు లేకుండానే ప్రజావేదిక ఏమిటి..?





### ఆగ్రహం వ్యక్తపరిచిన జడ్పిటిసి సభ్యులు చిత్తలూరు పోలయ్య

మండలంలోని గ్రామ పంచాయతీలలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2024-2025, సంవత్సరానికి సంబంధించి 17వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు జిల్లా పీడీ గంగాభవాని హాజరయ్యారు. మండలంలో రూ.9 కోట్ల రూపాయల కి పైన నిధులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. తనిఖీలలో రూ.18 లక్షల 13 వేలు గుర్తించి ఆ మొత్తాన్ని రికవరీ విధించారు. ఏపీడీ గాయత్రి ని ఎంక్వయిరీ నిమిత్తం ఆదేశించారు. ఈ ఆడిటింగ్ కి సంబంధించి సరైన పర్యవేక్షణ లేకపోవటంతో ప్రస్తుత ఏపీవో సురేంద్ర బాబు, ఆడిట్ కి సంబంధించిన ఏపీవో చంద్రయ్య పై యాక్షన్ తీసుకోవడం జరుగుతుందని పిడి గంగాభవాని తెలిపారు.సామాజిక తనిఖీల్లో బయటపడిన అవకతవకలపై మరింత కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రజా వేదికలో జడ్పిటిసి సభ్యులు చిత్తలూరు పోలయ్య, మాట్లాడుతూ ప్రజలు లేకుండానే ప్రజా వేదిక నిర్వహణపై జడ్పిటిసి సభ్యుడు పోలయ్య ఆగ్రహం వ్యక్తం చేసారు. మండలంలో గ్రామ ప్రజలు లేకుండానే ప్రజా వేదిక నిర్వహించడం సబబు కాదని ఆడిటింగ్‌కు సంబంధించి గ్రామ ప్రజల సమక్షంలో వాదోపవాదనలు జరగాల్సి ఉండగా, ప్రజల భాగస్వామ్యం లేకుండా కార్యక్రమం నిర్వహించడం సరైంది కాదన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లు, డిఆర్పిలు, ఎస్ఆర్పిలు, పీడీ గంగాభవాని ఆధ్వర్యంలో ప్రజలు లేకుండానే సోషల్ ఆడిటింగ్ నిర్వహించడాన్ని ఆయన తప్పుబట్టారు. ప్రజల అభిప్రాయాలు, ప్రశ్నలు, వాదోపవాదాలతో సోషల్ ఆడిటింగ్ పారదర్శకంగా జరగాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహన్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు, డిఆర్పీలు, ఎస్ఆర్పీలు, ఈసి ఏపీవోలు,జిల్లా స్థాయి ఆడిటింగ్ అధికారులు పాల్గొన్నారు .

## బూతుల కోచ్ పై వేటు పడింది!



భారత పారాలింపిక్ కమిటీ (పీసీఐ) సంచలన నిర్ణయం తీసుకుంది. ద్రోణాచార్య అవార్డు గ్రహీత, సీనియర్ కోచ్ నావల్ సింగ్‌ను పదవి నుంచి తొలగించింది. పారాలింపిక్ జావెలిన్ ఛాంపియన్ సుమిత్ ఆంటిల్ ఆరోపణల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు పీసీఐ చీఫ్ దేవేంద్ర ఝఝూరియా ఆదివారం ధృవీకరించారు. రెండుసార్లు పారాలింపిక్స్‌లో స్వర్ణం గెలిచిన సుమిత్ యాంటీల్.. కోచ్ నావల్ సింగ్ తనను మానసికంగా వేధిస్తున్నారని, తనను, తన కుటుంబాన్ని బూతులతో దుర్భాషలాడుతున్నారని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)కి ఫిర్యాదు చేశారు. సుమిత్‌కు ఒలింపిక్ స్వర్ణ పతక విజేత నీరజ్ చోప్రా కూడా మద్దతుగా నిలిచారు. దేశంలోని పలువురు అగ్రశ్రేణి అథ్లెట్లు కలిసి ఏప్రిల్ 10న సాయ్‌కి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అంతకుముందే సాయ్ డిప్యూటీ డైరెక్టర్, టాప్స్ సీఈఓతో సుమిత్ ఈ విషయంపై చర్చించారు. అధికారులు ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చేందుకు ప్రయత్నించగా, సుమిత్ దానిని తిరస్కరించారు. కోచ్ నుంచి తరచూ బూతు మాటలతో వేధింపులు, అవమానాలు ఎదుర్కొన్నానని, అందుకే చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఈ ఆరోపణల నేపథ్యంలో బోర్డు సమావేశమై నావల్ సింగ్‌ను విధుల నుంచి తొలగించాలని నిర్ణయించినట్లు పీసీఐ చీఫ్ ఝఝూరియా స్పష్టం చేశారు. 2015లో ద్రోణాచార్య అవార్డు అందుకున్న నావల్ సింగ్, ఎందరో జాతీయ స్థాయి జావెలిన్ అథ్లెట్లకు శిక్షణ ఇవ్వడంతో పాటు యువ కోచ్‌లకు మార్గనిర్దేశం చేశారు. అయితే అనూహ్య రీతిలో వివాదంలో చిక్కుకున్నారు.

## జూటూరు ధనుంజయ గృహప్రవేశ వేడుకలో వైయస్సార్సీపీ మహిళా నాయకురాలు శశికళ

బళ్లారి పట్టణంలో దేగులపాడు గ్రామానికి చెందిన జూటూరు ధనుంజయ కొత్త ఇంటి గృహప్రవేశ మహోత్సవం ఆనందోత్సాహాల మధ్య జరిగింది. ఈ వేడుకకు

వైఎస్సార్సీపీ మహిళా నాయకురాలు శశికళ కార్యక్రమంలో పాల్గొని, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ వారి సంతోషంలో భాగస్వామ్యమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త ఇంటి నిర్మాణం ప్రతి కుటుంబానికి గర్వకారణమని,

ఈ ఇంటిలో ఆనందం, ఐశ్వర్యం నిండాలని కోరుకున్నారు. ఈ వేడుకలో స్థానిక వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకను మరింత ఉత్సాహంగా మార్చారు.



# క్రీడా రంగానికి అంకితభావానికి ఘన సత్కారం

### ఉద్వేగాల నడుమ అశోక్ కుమార్‌కు వీడ్కోలు

**హనుమకొండ టౌన్ ఏప్రిల్ 19**హనుమకొండ జిల్లా యువజన క్రీడా అధికారి గుగులోతు అశోక్ కుమార్ డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది హైదరాబాదుకు బదిలీ అవుతున్న సందర్భంగా, హనుమకొండ జే ఎన్ ఎస్ స్టేడియం భావోద్వేగాలతో నిండిపోయింది. ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికేందుకు నిర్వహించిన సమావేశం క్రీడా కుటుంబం ఏకతాటిపై నిలిచిన అరుదైన వేడుకగా మారింది. క్రీడాకారులు, కోచ్‌లు, సహచర అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై అశోక్ కుమార్ సేవలను కొనియాడుతూ ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అజీజ్ ఖాన్, నిట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ, అశోక్ కుమార్ కేవలం ఒక అధికారి మాత్రమే కాదని, క్రీడాకారులలో నమ్మకం నింపిన మార్గదర్శకుడని అన్నారు. ఆయన నాయకత్వంలో జిల్లాలో క్రీడా సంస్కృతి కొత్త ఊపందుకుందని, గ్రామీణ స్థాయిలో ఉన్న ప్రతిభను వెలికి తీయడంలో కీలక పాత్ర పోషించారని వివరించారు. "క్రీడలంటే ఆసక్తి ఉండాలి, అవకాశం కల్పించాలి" అనే ధ్యేయంతో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. పదోన్నతి పొందిన అశోక్ కుమార్ తన ప్రసంగంలో భావోద్వేగానికి లోనయ్యారు. హనుమకొండ తనకు కేవలం విధి స్థలం మాత్రమే కాకుండా ఒక కుటుంబంలా మారిందని అన్నారు. "నేను సాధించిన ప్రతి విజయంలో మీ అందరి సహకారం ఉంది. ఈ నేల నాకు ఎంతో నేర్పింది" అని పేర్కొన్నారు. భవిష్యత్తులో డిప్యూటీ డైరెక్టర్‌గా మరింత బాధ్యతతో పనిచేసి క్రీడలకు సేవ చేస్తానని హామీ ఇచ్చారు. హనుమకొండ జే ఎన్ ఎస్ స్టేడియంలో నిర్వహించిన వీడ్కోలు సభలో గుగులోతు అశోక్ కుమార్ ఉద్వేగభరితంగా మాట్లాడారు. తన సేవా కాలాన్ని గుర్తుచేసుకుంటూ పలుమార్లు భావోద్వేగానికి లోనయ్యారు. "హనుమకొండ నాకు ఉద్యోగ స్థలం మాత్రమే కాదు నా జీవితాన్ని మలిచిన కుటుంబం. ఇక్కడి క్రీడాకారులు, కోచ్‌లు, సహచరులు ఇచ్చిన ప్రేమ, సహకారం లేకపోతే నేను ఈ స్థాయికి రావడం సాధ్యం కాదు" అని అన్నారు. ప్రతి గ్రామంలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలనే లక్ష్యంతో పనిచేశానని, ఆ ప్రయాణంలో ఎన్నో మధురమైన అనుభవాలు సొంతమయ్యాయని గుర్తు చేసుకున్నారు."జిల్లాలో ఒక చిన్న క్రీడాకారుడు జాతీయ స్థాయికి ఎదిగినప్పుడు నాకు కలిగే ఆనందం మాటల్లో చెప్పలేను. వాళ్ల విజయం నా విజయం" అంటూ ఆయన కళ్లలో ఆనందంతో పాటు విడిపోవాల్సిన బాధ కనిపించింది. "ఇక్కడి నుంచి వెళ్లిపోతున్నా నా మనసు మాత్రం ఎప్పటికీ హనుమకొండతోనే ఉంటుంది" అని చెప్పడంతో సభలో భావోద్వేగ వాతావరణం నెలకొంది. తన పదోన్నతి గురించి మాట్లాడుతూ, "ఇది నా ఒక్కరి విజయమేమీ కాదు ఇది మనందరి విజయం. మీరు నాపై ఉంచిన నమ్మకమే నన్ను ఈ స్థాయికి తీసుకువచ్చింది" అని కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో డిప్యూటీ డైరెక్టర్‌గా మరింత బాధ్యతతో పని చేసి క్రీడలకు సేవ చేస్తానని హామీ ఇచ్చారు.నేను ఎక్కడ ఉన్నా హనుమకొండ పేరు గర్వంగా వినిపించేలా పనిచేస్తాను" అంటూ భావోద్వేగంగా తన ప్రసంగాన్ని ముగించారు. ఈ సందర్భంగా పలువురు క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లు అశోక్ కుమార్ సేవలను గుర్తుచేసుకుంటూ ప్రసంగించారు. ఆయన ప్రోత్సాహంతో జాతీయ స్థాయికి ఎదిగిన క్రీడాకారుల కథలు సభలో



ప్రస్తావనకు వచ్చాయి. అనంతరం శాలువాలతో సత్కరించి స్మృతిచిహ్నాలు అందజేశారు. క్రీడాకారుల కళ్లలో ఆనందం, విడిపోవాల్సిన బాధ కలిసిన క్షణాలు సభను మరింత భావోద్వేగభరితంగా మార్చాయి. మొత్తానికి, అశోక్ కుమార్ వీడ్కోలు కార్యక్రమం ఒక అధికారికి ఇచ్చిన సన్మానం మాత్రమే కాదు, క్రీడల పట్ల ఆయన చూపిన అంకితభావానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచింది. ఆయన కొత్త బాధ్యతల్లో మరింత విజయాలు సాధించాలని అందరూ ఆకాంక్షిస్తూ, గర్వంతో వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరీ అధికారి శ్రీనివాస్, ఇండస్ట్రీ జీఎం నవీన్ కుమార్, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, హ్యాండ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పవన్ కుమార్, రెస్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కరీం, నిట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు రమేష్ రెడ్డి, శ్యాం , రాజేందర్, రాజలింగం, యాది రెడ్డి, సృజన్ , వెంకటస్వామి, లిల్లీ ఫ్లోరెన్స్, ఆయుబ్ ఖాన్, ప్రభాకర్ రెడ్డి, నాయకులు సతీష్, లక్ష్మణ్, క్రీడా సంఘాల ప్రతినిధులు, ఫిజికల్ డైరెక్టర్లు, కోచ్ లు, పీఈటీ,, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ నియామకం



**హనుమకొండ టౌన్ ఏప్రిల్ 19** వరంగల్ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీని 10 మంది సభ్యులతో ఏర్పాటు చేశారు. రాష్ట్ర సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ సిహెచ్ ప్రియాంక ఈ మేరకు శుక్రవారం నాడు ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీకి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద చైర్మన్ గా ఉంటారు. సభ్యులుగా శ్రీరామ్ రామచందర్, మెండు రవీందర్, దొంతు నవీన్, ఎండి హుస్సేన్ పాషా, మట్టా దుర్గాప్రసాద్, కోదాటి గోపాలకృష్ణ, పల్లెల్ల సోమేశ్వరరావు, పెద్దపల్లి వరప్రసాద్, బొడిగ శ్రీనివాస్, బొల్లెపల్లి రాజు సభ్యులుగా నియమిస్తూ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కమిటీకి జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి ఆయుబ్ అలీ మెంబర్ కన్వీనర్ గా వ్యవహరిస్తారు. ఈ కమిటీలో దక్షిణ మధ్య రైల్వే, టీ జి ఎస్ ఆర్ టి సి ప్రతినిధులు, సమాచార శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ కమిటీలో సభ్యులుగా ఉంటారు. కొత్తగా ఏర్పడిన నూతన కమిటీ తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# వేములవాడ భీమేశ్వర స్వామిని దర్శించిన హీరోయిన్ అనన్య నాగళ్ల



**వేములవాడ టౌన్ ఏప్రిల్ 19 :-** వేములవాడలోని ప్రసిద్ధ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో సినీ హీరోయిన్ అనన్య నాగళ్ల దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారి మండపంలో ఆలయ అర్చకులు, వేద పండితులు ఆమెకు ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం డీఈవో భాస్కర శర్మ ఆమెకు లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. 'లీసా' సినిమా షూటింగ్‌ను కరీంనగర్‌లో పూర్తి చేసుకున్న సందర్భంగా చిత్ర యూనిట్ సభ్యులు కూడా ఈ దర్శనంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ సతీష్ రెడ్డి, వీడియో గ్రాఫర్, డైరెక్టర్ జోహార్, ప్రొడ్యూసర్ చందు, అలాగే ప్రొడ్యూసర్ బీరప్ప నేని శివ పాల్గొన్నారు.



# మహిళా బిల్లుతో బీజేపీ మైండ్ గేమ్

### డీ-లిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాబల్యం తగ్గించే కుట్ర

### బీజేపీ అసత్య ప్రచారాలు, కుట్రలను ప్రజాక్షేత్రంలో ఎండగడతాం

### వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు

**హనుమకొండ టౌన్ ఏప్రిల్ 19** హన్మకొండ డీసీసీ భవన్‌లో కుడా చైర్మన్, హన్మకొండ జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రోజు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, టిపిసిసి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణలతో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కె.ఆర్. నాగరాజు పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ** డీ-లిమిటేషన్ పేరుతో మహిళా బిల్లును కలిపి కాంగ్రెస్ పార్టీని బద్నాం చేయాలనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోడీ రాజకీయ నాటకం ఆడారని విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను కచ్చితంగా అమలు చేశాయని, అదే కారణంగా ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే జనాభా తక్కువగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాబల్యాన్ని తగ్గించే ప్రయత్నంగానే డీ-లిమిటేషన్ అంశాన్ని తెరపైకి తీసుకువచ్చారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులతో చర్చించి డీ-లిమిటేషన్‌కు వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించారని పేర్కొన్నారు. మహిళల పట్ల కాంగ్రెస్ పార్టీకి అపారమైన గౌరవం ఉందని, మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రత్యేకంగా ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ నాయకత్వం ముందుగానే డిమాండ్ చేసిందన్నారు. బీజేపీ నేతలు అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, తెలంగాణ ప్రజలు వారి కుట్రలను



గమనించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్ని అగౌరవపరిచే విధంగా మాట్లాడిన బీజేపీ ఎంపీలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. చివరిగా, తెలంగాణ గౌరవాన్ని కించపరిచే ఎలాంటి వ్యాఖ్యలనైనా కాంగ్రెస్ పార్టీ ప్రజాక్షేత్రంలో ఎండగడుతుందని ఎమ్మెల్యే నాగరాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ భద్రకాళి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



**హనుమకొండ టౌన్ ఏప్రిల్ 19** కాకతీయుల రాజధాని ఏకశిలానగరంగా చరిత్ర ప్రసిద్ధిగాంచిన వరంగల్ మహానగరంలో స్వయం వ్యక్తమై దర్శింపవచ్చిన భక్తుల పాలిట కోరిన కోర్కెలకు కొంగు బంగారమగుచూ పరమపావనమైన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దివి: 19-04-202 ఆదివారం నుండి 30-04-2026 గురువారం వరకు అత్యంత వైభవోపేతంగా నిర్వహింపబడే శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల శ్రీ కళ్యాణ బ్రహ్మోత్సవాలకు ఈ రోజు (19-04-2026 ఆదివారం) అంకురార్పణ జరిగినది. ఉదయం గంవ 4-00లకు అమ్మవారికి నిత్యాహ్నికం నిర్వహించిన పిమ్మట ఆలయ అర్చకులు అమ్మవారికి ఉత్సవాంగీకార ప్రార్ధన జరిపారు. అనుజ్ఞ లభించిన వెంటనే అమ్మవారికి బ్రహ్మోత్సవ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ రోజు కార్యక్రమంలో భాగంగా ముందుగా గణపతి పూజ, పుణ్యహవాచనం, నాంది, ఇడాహవాచనం, బ్రహ్మకూర్చహెమం, పంచగవ్య ప్రాశన, ఋత్విగ్వరణం, మధుపర్కవిధి జరిపి వాస్తుయాగం, పర్యగ్నికరణం, మృత్సంగ్రహణం, ధ్వజాధివాస కార్యక్రమాలు నిర్వహించి ఉదయం గణవతి సేవను, సాయంకాలం శ్రీ సుబ్రహ్మణ్య సేవ నిర్వహించి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిపారు. ఈ బ్రహ్మోత్సవాలను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో ఎండపొడ లేకుండా నీడనిచ్చే విధంగా శాశ్వత ప్రాతిపదికపై భక్తుల సౌకర్యార్థం తెలంగాణా శాసనమండలి సభ్యులు శ్రీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి 10 లక్షల రూపాయల విరాళంతో నిర్మాణం జరిపిన జర్మన్ పెండాల్స్ రిబ్బన్ కట్ చేసి ఆవిష్కరించారు. అటు పిమ్మట దేవాలయ ధర్మకర్తల మండలి కార్యాలయమును కూడా ఎం.ఎల్.ఏ ప్రారంభించారు. తదుపరి ప్రతిసరబంధం, ఉదకశాంతి నిర్వహించి రక్షోఘ్న హెమం అనంతరం బ్రహ్మోత్సవ అంకురార్పణ జరిపి సాయంతన పూజ నిర్వహించడంతో ఈ రోజు కార్యక్రమం పూర్తయింది. ఈ రోజు అంకురార్పణ కార్యక్రమానికి వరంగల్ ఉమ్మడి జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం వారు ఉభయదాతలుగా వ్యవహరించారు. తెలంగాణా తొలి సభాపతి శాసనమండలి ప్రతిపక్ష నాయకులు సిరికొండ మధుసూదననాచారి, తెలుగు విశ్వవిద్యాలయ మాజీ రిజిస్ట్రార్ డా. త్రిమూర్తుల గౌరిశంకర్, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు డా.వేములవాడ మదన్మోహన్ ఆదివారం రోజు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు వందలాదిగా చొల్లేది కృష్ణమాచారి నేతృత్వంలో మేళతాళాలతో పట్టుచీరలు, పూజాద్రవ్యాలు అమ్మవారికి విశ్వబ్రాహ్మణ మహిళా సమాజం పెద్ద ఎత్తున తరలివచ్చి సమర్పించి పూజాదికములు నిర్వహింపజేశారు. గణపతి సేవను వరంగల్ ఉమ్మడి జిల్లా విశ్వబ్రాహ్మణసంఘం వారు నిర్వహించారు.

# పీహెచ్డీ సాధించిన నరహరి అజ్మీర



**రామగిరి ఏప్రిల్ 19 –** రామగిరి మండలం సెంటినరీ కాలనీలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్న నరహరి అజ్మీర పీహెచ్డీ పట్టా పొందారు. వరంగల్లోని కాకతీయ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం నుండి నరహరి అజ్మీరకు పీహెచ్డి లభించింది. డాక్టర్ పి. కామాక్షి మార్గదర్శకత్వంలో ఆయన పరిశోధన పూర్తి చేశారు. డీప్ లెర్నింగ్ విధానాలను ఉపయోగించి ప్రొడక్ట్ రివ్యూల ఆధారంగా భావ విశ్లేషణ (సెంటిమెంట్ అనాలసిస్)అనే అంశంపై ఆయన పరిశోధన నిర్వహించారు. ఈ పరిశోధన కృత్రిమ మేధస్సు(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్), సహజ భాషా ప్రక్రియ(న్యాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్)రంగాలకు సంబంధించినది. నర్సంపేట మండలం కమ్మపల్లి గ్రామంలోని చెక్రం తండాకు చెందిన నరహరి అజ్మీర సాధారణ రైతు కుటుంబానికి చెందినవారు. ఆయన తల్లిదండ్రులు అజ్మీర నర్సయ్య, చిలకమ్మ. ఈ సందర్భంగా తన గైడ్ పి. కామాక్షికి, విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, డీన్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్, ప్రిన్సిపల్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన తల్లిదండ్రులు అజ్మీరా నర్సయ్య, చిలకమ్మ, భార్య కల్పనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సహచరులు, మిత్రులు ఆయనను అభినందించారు.

# ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ రిసెప్షన్‌కు సీఎం రేవంత్.. నూతన దంపతులకు ఆశీస్సులు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ వివాహ రిసెప్షన్ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ యువ నేత, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఇటీవలే వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. జగిత్యాల జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న గడ్డం ఇందుజ రెడ్డితో ఆయన వివాహం ఏప్రిల్ 11న గోవాలో జరిగింది. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వివాహ వేడుకను నిరాడంబరంగా నిర్వహించారు.

ఈ నేపథ్యంలో, పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషుల కోసం తాజాగా వివాహ రిసెప్షన్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై, నూతన దంపతులు వెంకట్, ఇందుజలతో కాసేపు ముచ్చటించారు. వారి భవిష్యత్ జీవితం ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఆశీస్సులు అందించారు. ఈ విందుకు పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రముఖులు కూడా హాజరై వధూవరులను అభినందించారు.

# టిఆర్ఎస్ నాయకులు ఎవరూ కాంగ్రెస్ పార్టీలో చేరలేదు

**రామగిరి ఏప్రిల్ 19 సూర్య న్యూస్:-** రామగిరి మండలం కల్వచర్లకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ కాంగ్రెస్ పార్టీలో చేరలేదని టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బొంకూరి పోశం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారని కొన్ని వర్గాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆయన తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ పార్టీకి రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక తమ పార్టీలో ఎవరు చేరినా వారిని బీఆర్ఎస్ పార్టీ నుండి వచ్చినట్లుగా చూపిస్తూ ప్రజలను, కార్యకర్తలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. కల్వచర్ల గ్రామం నుండి బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఒక్క కార్యకర్త కూడా కాంగ్రెస్ పార్టీలో చేరలేదని ఆయన స్పష్టం చేశారు. ఇటువంటి తప్పుడు ప్రచారాలను బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు నమ్మవద్దని ఆయన కోరారు.

# మంత్రి లోకేష్ ను విమర్శించడం చెవిరెడ్డికి తగదు..!

### బొమ్మగుంట జగదీష్

### -ఎమ్మెల్యే నాని ని విమర్శిస్తే భారీ మూల్యం చెల్లించక తప్పదు...!

### చెంగల్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలి...! విజయ్ నాయక్

### ప్రెస్ మీట్ లో ఎర్రవారిపాలెం దళిత సంఘం నాయకులు ఫైర్



**చిన్నగొట్టిగల్లు ఏప్రిల్ 19** మంత్రి నారా లోకేష్ ను విమర్శించడం చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి తగదని, వైసిపి నాయకులు తీరు పై తెలుగుదేశం పార్టీ దళిత సంఘ నాయకులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆదివారం ఎర్రావారిపాలెం లో స్థానిక విలేకరుల సమావేశంలో మాజీ జెడ్పిటిసి కుమార్ తనయుడు బొమ్మగుంట జగదీష్ మాట్లాడుతూ వైసిపి హయాంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చేసిన అభివృద్ధి ఎందుకు పనికిరాని బల్లలు, కూరగాయలు, పప్పులు,బెల్లాలలో కనబడుతున్నదేమో గాని మాకైతే కంటికి కనబడడం లేదన్నారు. ఎమ్మెల్యే పులివర్తి నాని స్వయం కృషి తో వ్యవసాయంపై ఆధారపడి జీవించే రైతు కుటుంబాలకు సాగునీటిని అందించడానికి వృధాగా పోతున్న తలకోన నీటిని చెరువులకు అనుసంధానం చేసేలా 42 కోట్ల రూపాయల వ్యయంతో ప్రాజెక్ట్ నిర్మాణాలు చేపట్టే విధంగా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారని, తద్వారా ఎర్ర వారి పాలెం మండలం రైతాంగం వ్యవసాయ పంటలు సశ్య శ్యామలంగా మారుతుందని ప్రకటించారు. కబేలమే శరణ్యము అనుకున్న పశువులకు నిలువడానికి నీడ కూడా కల్పించని దుస్థితిలో వైసిపి పాలన కొనసాగిందన్నారు. అలాంటి పశుసంపదను కాపాడడానికి 568 కి పైగా గోకులం షెడ్లను మంజూరు చేసి రైతాంగానికి ఉన్న పశుసంపదను కాపాడిన ఘనత ఎమ్మెల్యే పులువర్తి నాని కె దక్కుతుందన్నారు. వైసిపి హయాంలో రైతాంగానికి ఒక్క గోకులం షెడ్డును కూడా ఇవ్వలేని మీరు? అభివృద్ధిని గురించి మాట్లాడడం గురవిందు నలుపుగా ఉందన్నారు. రాజకీయ పలుకుబడితో ఒక్క ఓటును కూడా, ప్రజలు మీకు వేసి గెలిపించిన దాఖలాలు లేకపోయినా,అడ్డదారిలో ఎన్నికైన మీరు ఎంపీపీ అని చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. మా ఎమ్మెల్యే పులివర్తి నాని 44 వేల పై చిలుక ఓట్లతో మెజారిటీ సాధించిన అస్సలు సిసలైన ప్రజా మద్దతు దారుడన్నారు. ఎర్ర వారిపాలెం మండలంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఏనాడైనా ఒక్క పూలమాల వేసి దళితులకు అండగా నిలిచిన దాఖలాలు చెవిరెడ్డి చరిత్రలో ఉందా అని ప్రశ్నించారు. మా ఎమ్మెల్యే పులివర్తి నాని దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడడానికి అంబేద్కర్ స్ఫూర్తితో అంబేద్కర్ భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారన్నారు. దళిత నాయకుడు పులిచెర్ల మహేష్ మాట్లాడుతూ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చరిత్రలో కూడా చూడలేని, చేయలేని శాశ్వత అభివృద్ధిని....తలకోన నిర్మాణం తో మా ఎమ్మెల్యే పులివర్తి నాని చేపట్టడం....చెవిరెడ్డి రాజకీయ చరిత్రకి ఒక మైలురాయి అని అన్నారు.అభివృద్ధి అంటే పదికాలాలు పాటు ప్రజలకు పనికి వచ్చేదిగా ఉండాలన్నారు. ఎన్నో కంపెనీలను ఆంధ్ర రాష్ట్రానికి తెచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే మా ప్రియతమ నాయకుడు మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే పులివర్తి నానిని విమర్శిస్తే వైసిపి నాయకులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు విజయ్ నాయక్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో భూదందాలు ఇసుక మాఫియాలో స్మగ్లింగ్లు రాజ్యమేలాయని అన్నారు. వైసిపి నాయకుడు చెంగల్ రెడ్డి విమర్శలను ఖండిస్తూ ఇక నుంచి ఎమ్మెల్యే పులివర్తి నాని పై విమర్శలు చేస్తే సహించే ప్రసక్తే లేదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఏ ఏం సి డైరెక్టర్ నాగరాజ, దనాసి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అండగా ఉంటా:

### చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి



**చిన్నగొట్టిగల్లు ఏప్రిల్ 19** దిగవూరు పంచాయతీ పరిధిలోని మట్లివారిపల్లిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. గ్రామంలో టీడీపీ నేతల అరాచకాల వల్ల రైతులు తమ పొలాలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని బాధితులు ఆయనకు విన్నవించారు.రైతుల సమస్యలను తెలుసుకున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి స్వయంగా గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ అనుకూల రైతుల పొలాలకు వెళ్లకుండా అడ్డంకులు సృష్టిస్తూ గుంతలు తవ్వడం, కంచెలు వేయడం వంటి చర్యలను తీవ్రంగా ఖండించారు. రైతుల భూములకు వెళ్లే మార్గాలను అక్రమంగా మూసివేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. రాజకీయ కక్షలతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం అనైతికమని, బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని కోరారు. పొలాలకు వెళ్లే దారులు మూసివేయడంతో పంటల సంరక్షణ కష్టమై, రోజువారీ వ్యవసాయ పనులు నిలిచిపోయాయని రైతులు వాపోయారు.రైతులకు భరోసా ఇస్తూ చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ, “మీ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు మీకు అండగా ఉంటాను. అవసరమైతే కోర్టులో కేసు వేయడానికి కూడా సహాయం చేస్తాను” అని హామీ ఇచ్చారు. ముందుగా ఈ సమస్యపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి, న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.అదేవిధంగా గ్రామంలో శాంతి భద్రతలు కాపాడాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.ఈ సందర్భంగా రంగన్నగారిగడ్డలో జరుగుతున్న అక్రమ మైనింగ్ పనులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలాగే తిప్పిరెడ్డిగారి పల్లి గ్రామపంచాయతీ కమ్మపల్లిలో గతంలో మంజూరు చేసిన ఇంటి పట్టాలను పట్టించుకోకుండా ఆక్రమణలు జరుగుతున్నాయని, లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో, ఇకనైనా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఉన్నతాధికారులను ఆశ్రయిస్తామని హెచ్చరించారు. రైతులను పరామర్శించిన కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ పెద్దలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాజీ మంత్రి ఆర్కేరోజా కుమార్తెకు అత్యున్నత అవార్డు



**నగరి ఏప్రిల్ 19** అమెరికాలోని బ్లూమింగ్ టన్ ఇండియానా యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్న మాజీ మంత్రి ఆర్కేరోజా కుమార్తె అన్షుమాలికకు ఆ యూనివర్సిటీ ఐదేళ్లకు ఒక్కసారి ప్రెసిడెంట్ హెర్మన్ బి వెల్స్ గౌరవార్థం అందించే ప్రతిష్టాత్మకమైన “హెర్మన్ బి వెల్స్ డిస్టింగ్విష్డ్ సీనియర్” అవార్డును ఆమెకు ప్రదానం చేసింది. అమెరికాలో ఈ అవార్డును అందుకున్న తొలి భారతీయ విద్యార్థి అన్షుమాలిక కావడం విశేషం. యూనివర్సిటీలో గౌరవ ప్రదర్శనగా ఉంచే బోర్డులో ఉత్తమ విద్యార్థిగా ఈమె పేరు లిఖించిన బంగారు ఫలకం జీవితకాలం ఉండిపోతుంది. శనివారం ఈ ఆవార్డును తల్లిదండ్రులైన ఆర్కే రోజా, ఆరేకే సెల్వమణి సమక్షంలో ఆమెకు యూనివర్సిటీ ఆమెకు ప్రధానం చేసింది. కుమార్తె అరుదైన అవార్డును స్వంతం చేసుకోవడంతో మాజీ మంత్రి ఆర్కేరోజా ఆనందానికి అవదులు లేవు. కాగా అన్షుమాలిక ఇప్పటికే యూనివర్సిటీ అవుట్‌స్టాండింగ్ లీడర్‌షిప్ అవార్డు”ను అందుకోగా ‘ది ఫ్లేమ్ ఇన్ మై హార్ట్’ నవలను రచించి దక్షిణ భారతదేశంలో ఉత్తమ రచయిత్రి గుర్తింపును అందుకున్నారు. నైజీరియాలో జరిగిన గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్ ఫెస్టివల్‌లో సోషల్ ఇంపాక్ట్ విభాగంలో “గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్స్ అవార్డు”ను, అలాగే “మౌరిన్ బిగ్గర్స్ అవార్డు”ను కూడా అందుకుంది. ప్రస్తుతం తీసుకున్న అవార్డుతో మరో మైలురాయిని చేరుకుంది. తల్లి ఆర్కే రోజా సినీ, రాజకీయ రంగాల్లో సాధించిన గుర్తింపుకు తగ్గట్టే, అన్షు మాలిక సాంకేతిక, సాహిత్య, వ్యాపార రంగాల్లో బహుముఖ ప్రజ్ఞను చూపుతోంది. యువతకు ఆదర్శంగా నిలుస్తూ, అంతర్జాతీయ వేదికపై తెలుగు ప్రతిష్టను చాటుతోంది. సామాజిక మాధ్యమాల్లో ఆమెకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

# ఏబీవీపీ ఆధ్వర్యంలో పాస్ కంటి సంపత్ ఆత్మీయ అభినందన సభ

**ఆలేరు ఏప్రిల్ 19 :-** ఆలేరు పట్టణ కేంద్రంలో నిపాషికంటి సంపత్ ఆధ్వర్యంలో ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన ఐదో వార్డు బిజెపి అభ్యర్థి సంపదను గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి బిజెపి సీనియర్ నాయకులు పులి వలపులమహేష్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి ఎదిగిన పాషకంటి సంపత్ కౌన్సిలర్గా గెలుపొందిన సందర్భంగా ఆత్మీయ అభినందన సభను ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు చెప్పారు. విద్యార్థి దశ నుండి చురుకుగా పాల్గొని విద్యార్థి సమస్యలను ముందుకు తీసుకెళ్లి ఈరోజు పార్టీలో ఒక కౌన్సిలర్ గా గెలుపొంది ప్రజలకు సేవలు అందించినందుకు కృతజ్ఞతలు అని అన్నారు. బీజేపీ తోనే పట్టణ కేంద్రం అభివృద్ధి చెందుతుందని, రాబోయే కాలంలో పార్టీని ప్రతిష్ట చేయాలని అన్నారు. నరేంద్ర మోడీ చేపట్టి ప్రతి ఒక్క సంక్షేమ పథకాలు ప్రజలలో తీసుకువెళ్లి వారికి విన్నపం చేయాలని అన్నారు. పట్టణాల అభివృద్ధి చెందాలంటే అది భారతీయ జనతా పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ రాష్ట్రీయ సేవా సంఘ నాయకులు బండి రాజుల శంకర్, బిజెపి సీనియర్ నాయకులు కమిటీ కారి కృష్ణ, మైదాన్ భాస్కర్, పేరపు ఆనంద్, ఏబీవీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# ఆలయ నిర్మాణ దాతలకు సత్కారం



**నగరి ఏప్రిల్ 19** బస్టాండ్ సమీపంలోని శ్రీ మునీశ్వర స్వామి ఆలయములోని అభివృద్ధి పనులకు సహకారం అందించిన దాతలకు ఆలయ నిర్వాహకులు ఆదివారం దుస్సాలువలతో సత్కరించి ఆలయ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద వేదపండితులు శ్రీనివాసాచార్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్మించిన గదులకు దివంగత జ్యోతి, బాలసుందరం మొదలియార్ జ్ఞాపకార్థం గ్రానైట్ ఫ్లోరింగ్‌కు వారి కుటుంబ సభ్యులు రూ.4.25 లక్షలు విరాళం అందించగా వారి కుమారులు నగరి అగముడి మొదలియార్ సంక్షేమ సంఘం కార్యదర్శి అయిన ఆటుపాకం మోహన్‌ను ఆలయ నిర్వాహకులు సత్కరించారు. అలాగే దైవ వృక్షం చుట్టూ స్టీల్ గేట్లు ఏర్పాటు చేయుటకు రూ. 60 వేలు విరాళం అందించిన నియోజకవర్గ కాపు సంక్షేమ సంఘ అధ్యక్షులు బాబు, రమాదేవిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

# పెట్రోలు బంకు సిబ్బంది అవగాహన



**నగరి ఏప్రిల్ 19** అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక పెట్రోల్ బంకులు, గ్యాస్ గోడౌన్‌ల వద్ద సిబ్బందికి అగ్నిప్రమాద నివారణపై అగ్నిమాపక అధికారి సుబ్బరాజు అవగాహన ఏర్పరిచారు. ఆదివారం సిబ్బందితో పాటు పెట్రోల్ బంకులు, గ్యాస్ గోడౌన్‌ల వద్దకు వెళ్లిన ఆయన అగ్నిప్రమాదాల నివారణ, మంటలను అదుపుచేసే ప్రక్రియలపైనా డెమో చేసి అవగాహన ఏర్పరిచారు. గ్యాస్ ద్వారా మంటలు ఎక్కువగా వచ్చినపుడు వాటిని ఎలా ఆర్పాలో ప్రత్యక్షంగా చేసి చూపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ప్రతాప్, ప్రవీణ్‌కుమార్, మనోహర్ రెడ్డి, పి. రామచంద్రయ్య, ఎస్.రాజేష్, పి.లోకయ్య పాల్గొన్నారు.

# రేణిగుంట ప్రత్యామ్నాయ రోడ్డు మార్గం కై వామపక్షలు శ్రమదానం



### సిపిఎం, సిపిఐ నేతలను అడ్డుకున్న ఆర్పిఎఫ్ పోలీసులు

**శ్రీకాళహస్తి ఏప్రిల్ 19** రేణిగుంట రైల్వే బ్రిడ్జి పనులు కారణంగా రోడ్డును మూసేయడం తో రేణిగుంట వామపక్ష పార్టీలైన సిపిఎం, సిపిఐ కలిసి ప్రత్యామ్నాయ రోడ్డు మార్గం కొరకు కమ్యూనిస్టులు శ్రమదానం కార్యక్రమం కు పిలుపు ఇచ్చారు. అందులో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటలకు రేణిగుంట చెక్ పోస్ట్ సర్కిల్ శ్రీనివాస జూనియర్ కాలేజీ ఉత్తరం వైపు ఉన్న రైల్వే అండర్ వార బ్రిడ్జి క్రింద నుండి స్కూటర్, కారు, ఆటో, జీపు, అంబులెన్స్ వంటి చిన్న వాహనాలు వెళ్లడానికి రోడ్డు మార్గం దారి కి అడ్డుగా ఉన్న డంపింగ్ చెత్తాచెదారం తొలగించారు. ఇంతలో రైల్వే ఆర్పిఎఫ్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రైల్వే స్థలంలో పనిచేయడానికి వీల్లేదని ముళ్ళ చెట్లను తొలగిస్తున్న కమ్యూనిస్టులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. శ్రమదానం ఆపేది లేదని మాపై కేసులు పెట్టిన ఈ పోరాటం ఆగదని, రేణిగుంట ప్రజలకు ప్రత్యామ్నాయ రోడ్డు మార్గాన్ని చూపిస్తాం అని రైల్వే,రెవెన్యూ అధికారులు తెలుగుదేశం కూటం ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చేంతవరకు ఈ పోరాటాన్ని ఆపేది లేదని శ్రమదానం ను అడ్డుకున్న రైల్వే ఆర్పిఎఫ్ పోలీసులకు తెగేసి చెప్పారు. వామపక్ష పార్టీలు సిపిఎం,సిపిఐ పార్టీ శ్రమదానం కార్యక్రమం కు మద్దతుగా వైసిపి రేణిగుంట మాజీ సర్పంచి నగేష్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, టిడిపి నేతలు, గ్రామ పెద్దలు అండగా నిలబడ్డారు.రైల్వే బ్రిడ్జి కింద ఉన్న ముళ్ళ చెట్లను కత్తి, గడపల తో నరికి మొక్కలను తొలగించడం జరిగింది. సిపిఎం సిపిఐ నేతలను అడ్డుకున్న రైల్వే ఆర్పిఎఫ్ సిబ్బంది సమక్షంలో శ్రీకాళహస్తి ఆర్డిఓ తో ఫోన్ చేసి రేణిగుంట గ్రామ పెద్దలు ప్రతిపాదించిన తరువాత ప్రత్యామ్నాయ రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేయాలని కమ్యూనిస్టు నేతలు కోరడంతో వెంటనే రేణిగుంట మండల తాసిల్దార్ ను శ్రమదానం కార్యక్రమం చేపట్టిన ఘటనా స్థలానికి పంపించి,రైల్వే బ్రిడ్జి రహదారిని పరిశీలించి, జిల్లా ఉన్నతాధికారులతో చర్చించి వామపక్ష పార్టీలు కోరిన విధంగా రేణిగుంట ప్రజలకు ప్రత్యామ్నాయ రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో శ్రమదానం ను తాత్కాలికంగా విరమించడం జరిగిందని సిపిఎం పార్టీ రేణిగుంట ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి వైఎస్ మణి, సిఐటియు మండల కన్వీనర్ సెల్వరాజ్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి కార్తిక్ మీడియా సమక్షంలో రేణిగుంట ప్రజలకు తెలియజేయడం జరిగింది. మూడు రోజుల్లో ప్రత్యామ్నాయ రోడ్డు మార్గానికి రైల్వే, రెవెన్యూ ఉన్నతాధికారులు అనుమతి ఇవ్వకపోతే లేదా రోడ్డు తాత్కాలికంగా ఏర్పాటు చేయకపోతే పాలక వర్గం అధికారుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా రేణిగుంట అంబేద్కర్ విగ్రహం వద్ద ఆమరణ నిరాహార దీక్ష కు సిద్ధమవుతామని ఆదివారం వామపక్ష పార్టీలు ఉమ్మడి ప్రకటన ద్వారా తెలిపాయి. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు వెంకటరమణ, కుప్పస్వామి, చీరలయ్య, మునిస్వామి, దస్తగిరి, హరినాథ్, సెల్వరాజ్, హేమనాథ్, సిపిఐ పార్టీ నేతలు వైయస్ మణి, కార్తీక్, సెల్వం, రసూల్, చంద్ర, భాను, పెంచలయ్య, వైసిపి నేతలు ప్రభాకర్, రేణిగుంట మాజీ సర్పంచ్ నగేష్, టిడిపి నేతలు పాల్గొన్నారు.



# శిల్పారామంలో బెంగాలీ నూతన సంవత్సర వేడుకలు

**మాదాపూర్ ఏప్రిల్ 19 :-** మాదాపూర్ లోని శిల్పారామంలో ఉత్తరన్ బంగియా సమాజం వారు బెంగాలీ నూతన సంవత్సరాన్ని “పొయిలా బోయిశాఖ్“ పండగను జరుపుకున్నారు. బెంగాలీ ఫోక్ మ్యూజిక్ తో పటు రవీంద్ర సంగీత్, రవీంద్ర నృత్య పై సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. బెంగాల్ స్ట్రీట్ ఫుడ్, స్వీట్స్, బెంగాలీ చేనేత హస్త కళాఉత్పత్తుల స్టాల్స్ ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ సోనిబాల దేవి ఐ ఎఫ్ ఎస్, వీసీ, ఎండి తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ వారు ముఖ్య అతిధి గ విచ్చేసి బెంగాలీ నూతన సంవత్సర వేడుకలో పాల్గొన్నారు.



# దక్షిణాదికి ముందుంది ముప్పు!

కేంద్ర పెద్దలు మితిమీరిన విశ్వాసంతో వ్యవహరించడం వల్ల గతంలో అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించిన మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా శుక్రవారంనాడు లోక్‌సభలో వీగిపోయింది. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా ఏదో ఒక మ్యాజిక్ చేయకపోతారా అని ఎన్డీయే ఎంపీలు ఆశపడ్డారు. అంతకు మించి వారికి ఏమీ తెలియదు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లుల విషయంలో అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటుచేసి ప్రభుత్వ పెద్దలు తమ నిబద్ధతను వివరించి ఉండాల్సింది. అన్ని రాష్ట్రాలలో 50 శాతం సీట్లు పెరుగుతాయని చెప్పి ఆ మేరకు బిల్లులో మార్పులు చేసి ఉండవలసింది. అన్నీ సాధించుకోగలిగిన మోదీ-షా ద్వయం ఇప్పుడెందుకు వైఫల్యం చెందారు? అని ప్రశ్నించుకుంటే, మితిమీరిన ఆత్మవిశ్వాసమే కారణం అన్న సమాధానం లభిస్తుంది. క్షవరం అయితే గానీ వివరం తెలియదు అని అంటారు. ఈ విషయంలో ఏ ఒక్క రాజకీయ పార్టీ మినహాయింపు కాదు. వరుస విజయాల రుచి మరిగిన పార్టీలు మితిమీరిన ఆత్మవిశ్వాసంతో తప్పటడుగులు వేస్తుంటాయి. దేశాన్ని సుదీర్ఘ కాలం పాలించిన కాంగ్రెస్ పార్టీకి ఎదురైన పరాభవాలు ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీకి కూడా అనుభవంలోకి వస్తున్నాయా? రాజ్యాంగ సవరణ బిల్లుల ఆమోదానికి పార్లమెంటులో తగిన బలం లేకపోయినా డీలిమిటేషన్ బిల్లుతో మహిళా రిజర్వేషన్ బిల్లును జోడించిన ఎన్డీయే ప్రభుత్వానికి శుక్రవారంనాడు లోక్‌సభలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు లోక్‌సభ, శాసనసభ సీట్లను 50 శాతం వరకు పెంచి 2029లో జమిలి ఎన్నికలకు శ్రీకారం చుట్టాలని ప్రధాని మోదీ తలపోశారు. తన హయాంలోనే ఇవన్నీ జరుగుతాయని ప్రధానమంత్రి వివిధ సందర్భాలలో అనధికారికంగా చెప్పుకొచ్చారు. ఎన్నికల్లో వరుస విజయాలతో జోరు మీదున్న బీజేపీ, ఈ విషయంలోనూ విజయం సాధిస్తుందని రాజకీయ విశ్లేషకులూ భావించారు. అయితే ఎక్కడో లెక్కలు తప్పాయి. ఆరంభంలోనే కేంద్ర ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. ఉద్దేశాలు మంచివే అయినా వాటి సాధనకు ప్రతిపక్షాల సహకారం అవసరం అని గుర్తించి ఉంటే బీజేపీకి ఈ పరిస్థితి ఎదురై ఉండేది కాదేమో! కేంద్ర పెద్దలు మితిమీరిన విశ్వాసంతో వ్యవహరించడం వల్ల గతంలో అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించిన మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా శుక్రవారంనాడు లోక్‌సభలో వీగిపోయింది. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా ఏదో ఒక మ్యాజిక్ చేయకపోతారా అని ఎన్డీయే ఎంపీలు ఆశపడ్డారు. అంతకు మించి వారికి ఏమీ తెలియదు. ప్రధాని మోదీ శక్తియుక్తులపై వారికి ఉన్న ధీమా వల్ల రాజ్యాంగ సవరణ బిల్లులకు అవసరమైన మద్దతును ఎలా సమకూర్చుకోబోతున్నారు? అని ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు కూడా ప్రశ్నించలేదు. పేరుకు ఎన్డీయే కూటమి అయినా అక్కడ సమష్టి నిర్ణయాలకు తావు లేదు. విషయం ఏదైనా ప్రధాని మోదీ అనుకున్నదే జరుగుతోంది. దేశ రాజకీయాల్లోనే ఆయన ఇప్పుడు తిరుగులేని శక్తిగా ఉన్నందున స్వపక్షం గానీ, మిత్రపక్షాలు గానీ ప్రశ్నించే సాహసం చేయడంలేదు. డీలిమిటేషన్ బిల్లులో అన్ని రాష్ట్రాలలో 50 శాతం సీట్లు పెరుగుతాయని పేర్కొనలేదు. జనాభా ప్రాతిపదికన అని మాత్రమే బిల్లులో ప్రస్తావించారు. దీంతో దక్షిణాదికి అన్యాయం జరుగుతుందని ప్రచారం జరిగింది. కేంద్ర ప్రభుత్వంలో కీలక భాగస్వామి అని అందరూ భావిస్తున్న తెలుగుదేశం పార్టీకి కూడా సదరు బిల్లులో ఏముందో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర మంత్రులకు ఫోన్లు చేసి అన్ని రాష్ట్రాలలో 50 శాతం సీట్లు పెంచబోతున్న విషయం తెలుసుకున్నారు. నిజానికి 50 శాతం సీట్లు పెంచడం వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదు. ఈ కారణంగా నిరసనలు సద్దుమణిగాయి. అయితే సభలో అవసరమైన మెజారిటీ లేనప్పుడు ఏకాభిప్రాయ సాధన ద్వారా బిల్లులకు ఆమోదం పొందడం ఆనవాయితీగా వస్తోంది. డీలిమిటేషన్‌కు రాజ్యాంగ సవరణ అవసరం అయినప్పుడు దానిపై అన్ని రాజకీయ పార్టీలనూ సంప్రదించి ఉండవలసింది. మహిళా రిజర్వేషన్ బిల్లును దానికి జోడించడం ద్వారా మద్దతు ఇవ్వక తప్పని పరిస్థితి ఇండియా కూటమికి కల్పించవచ్చునని కేంద్ర పెద్దలు తలపోసి ఉంటారు. ఈ కారణంగానే ఏకపక్షంగా వ్యవహరించారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లుల విషయంలో అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటుచేసి ప్రభుత్వ పెద్దలు తమ నిబద్ధతను వివరించి ఉండాల్సింది. అన్ని రాష్ట్రాలలో 50 శాతం సీట్లు పెరుగుతాయని చెప్పి ఆ మేరకు బిల్లులో మార్పులు చేసి ఉండవలసింది. కారణం తెలియదు గానీ, ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశం కూడా జరగలేదు. భారతీయ జనతా పార్టీ ఎంపీలకు కూడా ఏం జరగబోతున్నదో తెలియలేదు. అంతా మోదీషాలు చూసుకుంటారని వారు భావించారు. రాజ్యాంగ సవరణ బిల్లులను ఏకాభిప్రాయంతో ఆమోదింపజేసుకోవాలి. లేని పక్షంలో సభలో మూడింట రెండు వంతుల మెజారిటీ సమకూర్చుకోవాలి. ఈ రెండూ జరగకపోవడం వల్ల మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు డీలిమిటేషన్ బిల్లు కూడా వీగిపోయింది. ఇది కేంద్ర ప్రభుత్వానికి తొలి ఓటమి. ఇంకా చెప్పాలంటే ఇదొక అపశకునం. ఈ టర్మ్‌లోనే చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడంతో పాటు డీలిమిటేషన్ చేసి 2029లో జమిలి ఎన్నికలకు శ్రీకారం చుట్టాలన్న ప్రధాని మోదీ సంకల్పం ఇప్పుడు ప్రశ్నార్థకం అయింది. ఈ పరిణామం ప్రతిపక్షాల విజయమా? అధికార కూటమి అపజయమా? అన్నది పక్కనపెడితే ప్రధాని మోదీ తలపోసిన మూడు అంశాలు వాంఛనీయమే. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రయత్నాలు ఎప్పటి నుంచో జరుగుతున్నాయి. డీలిమిటేషన్ కోసం కూడా రాజకీయ పార్టీలు ఎదురుచూస్తున్నాయి. సీట్ల సంఖ్య పెరగాలని కోరుకుంటున్నాయి. జమిలి ఎన్నికలు కూడా దేశానికి అవసరమే. ఇందులో ప్రధాని మోదీకి రాజకీయ స్వార్థం ఉందా? అంటే ఉండవచ్చు. ఏ రాజకీయ పార్టీ అయినా స్వీయ రాజకీయ ప్రయోజనాలను వద్దనుకోదు కదా? అయితే ఇప్పటివరకు అనుకున్నవి అన్నీ సాధించుకోగలిగిన మోదీషా ద్వయం ఇప్పుడెందుకు వైఫల్యం చెందారు? అని ప్రశ్నించుకుంటే, మితిమీరిన ఆత్మవిశ్వాసమే కారణం అన్న సమాధానం లభిస్తుంది. రాజకీయంగా ఇప్పటివరకు వారి పాచికలన్నీ పారాయి. రాజ్యసభలో తగిన సంఖ్యా బలం లేకపోయినా అనేక బిల్లులకు ఆమోదం పొందగలిగారు. ఇప్పుడు రాజ్యాంగ సవరణ బిల్లుల విషయంలోనే అనూహ్యంగా ఎదురుదెబ్బ తగిలింది. స్వపక్షంలోనే కాకుండా భాగస్వామ్య పక్షాలలో కూడా వారిరువురి ప్రతిష్ఠకు ఇదొక మచ్చగా నిలుస్తుంది. ఇంతకూ ఈ పరిస్థితి ఎందుకు ఎదురైంది అని ప్రశ్నించుకుంటే, జాతీయ స్థాయిలో కూడా ఏకపక్ష నిర్ణయాలకు దారులు వేయడమే కారణం అని తెలుస్తోంది. రాజకీయ పార్టీలలో వ్యక్తి ఆరాధన పెరిగిపోతున్నది. వ్యక్తి ఆరాధన కారణంగానే కాంగ్రెస్ పార్టీకి ప్రస్తుత దుస్థితి దాపురించింది. సమష్టి నిర్ణయాలకు తావు లేకుండా, భిన్నాభిప్రాయాలను ప్రోత్సహించకుండా ఆ కుటుంబం అనుకున్నదే ఫైనల్ అన్నట్టుగా పార్టీ నడిచింది. ఫలితంగా కాంగ్రెస్ బలహీనపడుతూ వచ్చింది. భారతీయ జనతా పార్టీలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉండేది. సమష్టి నాయకత్వం ఉండేది. పార్టీని సరైన మార్గంలో నడిపించడం కోసం ఆరెస్సెస్ వంటి సంస్థలు ఉండనే ఉన్నాయి. అయితే నరేంద్ర మోదీ, అమిత్ షా ప్రాబల్యం పెరగడం మొదలయ్యాక బీజేపీలో కూడా పరిస్థితులు మారిపోయాయి. కాంగ్రెస్ బాటలోనే వ్యక్తి ఆరాధన మొదలైంది. పార్టీని మించి ప్రధాని మోదీ ఎదిగిపోయారు. ఆయన అనుకున్నదే పార్టీ నిర్ణయంగా చెలామణి అవుతూ వస్తోంది. నంబర్ వన్, నంబర్ టూ తర్వాత ఆ పార్టీలో ఎవరికీ ప్రాధాన్యం లేదన్న అభిప్రాయం సర్వత్రా వ్యాపించింది. ఇందుకు అనుగుణంగా పార్టీపరంగానూ, ప్రభుత్వపరంగానూ నిర్ణయాలన్నీ వారిద్దరి కనుసన్నల్లోనే జరుగుతూ వచ్చాయి. పార్టీ వ్యవస్థ, ప్రభుత్వ వ్యవస్థ కూడా ఇందుకు అలవాటు పడిపోయాయి. ఏ ఎన్నిక జరిగినా పార్టీని గెలిపించే బాధ్యతను వారిరువురే చేపట్టారు. ఫలితంగా సొంతంగా ఆలోచించడం అనే ప్రక్రియకు బీజేపీ నాయకులు స్వస్తి చెప్పారు. మంచైనా చెడైనా ప్రధాని మోదీయే చూసుకుంటారులే అనే అభిప్రాయానికి వచ్చారు. ఈ కారణంగానే డీలిమిటేషన్ వంటి రాజ్యాంగ సవరణ బిల్లుకు అవసరమైన మద్దతు ఎలా సమకూర్చుకోబోతున్నారని స్వపక్షంవారు గానీ, మిత్రపక్షాలు గానీ ప్రశ్నించలేదు. ప్రధాని మోదీ చెబుతున్నారు కనుక డీలిమిటేషన్ జరిగితే చట్టసభల్లో సీట్లు పెరుగుతాయని, మహిళలకు రిజర్వేషన్లు వస్తాయని, 2029లో జమిలి ఎన్నికలు జరుగుతాయని అందరూ నమ్మేశారు. ప్రతిపక్షాల సహకారం లేకుండా ఇదెలా సాధ్యం? అన్న సందేహం ఒక్కరికి కూడా రాలేదు. ప్రధాని మోదీ అనుకుంటే చేసి తీరుతారు అన్న భరోసా ఏర్పడటంతో జమిలి ఎన్నికలకు కూడా రాజకీయ పార్టీలు సిద్ధపడిపోయాయి. ఈ నేపథ్యంలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోవడం ఎన్డీయేకు షాకింగ్ పరిణామం.

**తొలి అవమానం!** సమష్టి నాయకత్వం లేకపోయినా సమష్టి నిర్ణయాలన్నా ఉండాలి. అలా జరగనప్పుడు ఫలితాలు ఇలాగే ఉంటాయి. ఇప్పుడు ఈ పరిస్థితిని మోదీషాలు ఎలా అధిగమిస్తారో చూడాలి. చట్టసభలలో తగిన సంఖ్యా బలం లేని సందర్భాలలో గతంలో ప్రభుత్వాలు ప్రతిపక్షాల సహకారం తీసుకొనేవి. తమ లక్ష్యాలను వివరించి నచ్చజెప్పేవి. కేంద్ర ప్రభుత్వానికి తాజా పరిణామం ఒకరకంగా అవమానమే. ప్రధాని మోదీ భావిస్తున్నట్టు మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు డీలిమిటేషన్, జమిలి ఎన్నికలకు రంగం సిద్ధం కావాలంటే ప్రతిపక్షాల సహకారం తీసుకోవలసిందే. డీలిమిటేషన్ ఇప్పుడు జరగని పక్షంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నట్టుగా 2026 జనాభా ప్రాతిపదికనే తర్వాత డీలిమిటేషన్ జరుగుతుంది. అదే జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గిపోతుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాలు 35 సీట్ల వరకు కోల్పోయే ప్రమాదం ఉంది. అదే సమయంలో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, బిహార్ రాష్ట్రాల సీట్లు అధికంగా పెరుగుతాయి. ఇలా జరిగితే డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకించిన దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు తమ గొయ్యి తామే తీసుకున్నట్టు అవుతుంది. ప్రస్తుత బిల్లు ఆమోదం పొందివుంటే ఈ నష్టం తప్పి ఉండేది. ఉత్తరాదిన సీట్లు అదనంగా పెరగడం భారతీయ జనతా పార్టీకి లాభం అన్నది విస్మరించకూడదు. అన్ని రాష్ట్రాలలో ఒకే తీరుగా 50 శాతం సీట్లు పెరిగితే ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదు. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన పార్టీలు ఇప్పటికైనా చొరవ తీసుకొని 50 శాతం సీట్లు అదనంగా పొందడానికి అవసరమైన మద్దతును కేంద్రానికి ఇవ్వడం మంచిది. భారతీయ జనతా పార్టీ కూడా ప్రస్తుత ధోరణికి స్వస్తి చెప్పి ప్రతిపక్షాలకు, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీకి నచ్చజెప్పే ప్రయత్నం చేయాలి. ఏకాభిప్రాయ సాధనకు ప్రయత్నించడం ద్వారా రాజ్యాంగ సవరణ బిల్లులకు ఆమోదం పొందడానికి కృషి చేయాలి. పార్లమెంటు పరిష్కరించవలసిన ఈ సమస్యకు వీధుల్లో ఆందోళన చేయడం వల్ల పరిష్కారం లభించదు. ప్రతిపక్షాలను ప్రజల ముందు దోషులుగా నిలబెట్టడం వల్ల సమస్య ఏ మాత్రం పరిష్కారం కాదు.

**ఎన్టీఆర్ నుంచి కేసీఆర్ దాకా..** ఏ పార్టీలో అయినా ఏక వ్యక్తి ఆధిపత్యం వల్ల అనర్థాలే అనుభవంలోకి వస్తాయి. తెలుగునాట ప్రధాన రాజకీయ పార్టీలు కూడా ఇందుకు మినహాయింపు కాదు. ప్రాంతీయ పార్టీల ఆవిర్భావం తర్వాత రాజకీయాలలో వ్యక్తి ఆరాధన పెరిగింది. తెలుగుదేశం పార్టీని ఏర్పాటు చేసిన ఎన్టీఆర్‌ను పార్టీ శ్రేణులు కర్త, కర్మ, క్రియగా భావించేవారు. ఆయన కూడా నాతో పుట్టిన పార్టీ నాతోనే పోతుంది అనేవారు. అనేక సందర్భాలలో ఆయన ఏకపక్ష నిర్ణయాలు తీసుకొనేవారు. అవన్నీ పార్టీకి నష్టం చేశాయి. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కొంతకాలం పాటు ఐఏఎస్ అధికారి యూబీ రాఘవేంద్రరావు ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు. ఆయన ఉన్నంతవరకు ఎన్టీఆర్ తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా చాకచక్యంగా నిలువరించేవారు. దురదృష్టవశాత్తు విజయవాడలో మార్నింగ్ వాక్‌కు వెళ్లిన ఆయన రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆ తర్వాత ఎన్టీఆర్‌కు తగిన సలహాలు సూచనలు ఇవ్వగలిగిన అధికారి లభించలేదు. ఈ నేపథ్యంలోనే మంత్రి మండలి సమావేశం వివరాలు లీక్ చేస్తున్నారని చెప్పి 31 మంది మంత్రులను ఎన్టీఆర్ ఒక్క కలం పోటుతో తొలగించారు. ఆ తర్వాత రెండు మూడు వారాల పాటు క్యాబినెట్ లేకుండా ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని నడిపారు. దీనిపై ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడింది. ఎన్టీఆర్ నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు నిర్ధారణకు వచ్చారు. ఫలితంగా 1989 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఓడించారు. సమష్టి ఆలోచనలకు తావు లేనందున ఎన్టీఆర్ అంతటివాడు కూడా ఫలితం అనుభవించక తప్పలేదు. ఆ తర్వాత 19992004 మధ్య చంద్రబాబు కూడా ఏకపక్షంగా వ్యవహరించారు. విద్యుత్ సంస్కరణలు అని చెప్పి విద్యుత్ చార్జీలను అడ్డగోలుగా పెంచేశారు. ప్రజా వ్యతిరేకతను గుర్తించి పెంచిన చార్జీలను కొంత మేరకు తగ్గించినా 2004 ఎన్నికల్లో చంద్రబాబు ఓడిపోవడానికి అదే ప్రధాన కారణమని కూడా చెప్పవచ్చు. 19951999 మధ్య తెలుగుదేశం పార్టీలో సమష్టి నిర్ణయాలు ఉండేవి. 19992004 మధ్య చంద్రబాబు పార్టీ నాయకులకు కూడా అందుబాటులో లేకుండా పోయారు. సలహాలు, సూచనలు స్వీకరించే దశ దాటిపోయారు. రాజకీయంగా ఆలోచించకుండా బ్యూరోక్రాట్ తరహాలో ఆలోచించి ప్రభుత్వాన్ని నడిపారు. పార్టీ నాయకులు, ప్రజలకు అందుబాటులో లేకుండా తన చుట్టూ కంచె ఏర్పాటు చేసుకున్నారు. రాజశేఖరరెడ్డి వంటి బలమైన నాయకుడు ప్రతిపక్షంలో ఉన్న విషయాన్ని విస్మరించి కడప జిల్లా నుంచి సరస్వతి అనే ఆమెను మంత్రిని చేశారు. ఎదురు చెప్పేవాళ్లు లేకపోవడంతో ఇటువంటి అపసవ్య నిర్ణయాలు అనేకం అప్పట్లో ఆయన తీసుకున్నారు. ఫలితంగా 2004లో ఓడిపోయారు. 2014 2019 మధ్య కూడా పార్టీలో ఉమ్మడి ఆలోచనలకు తావు లేకుండా చేసుకున్నారు. అధినాయకుడు ఎంత సమర్థుడైనా వారిలో అతి విశ్వాసం ఏర్పడకుండా ఉండటానికి ఏదో ఒక యంత్రాంగం ఉండాలి. లేని పక్షంలో చేదు అనుభవాలే ఎదురవుతాయి. తెలంగాణలో భారత రాష్ట్ర సమితి విషయమే తీసుకుందాం.

అపర చాణక్యుడిగా పేరొందిన కేసీఆర్ 2023 ఎన్నికల్లో ఓడిపోయారు. పార్టీ పేరును మళ్లీ తెలంగాణ రాష్ట్ర సమితిగా మార్చే విషయం పరిశీలిస్తున్నామని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తాజాగా చెప్పుకొచ్చారు. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చాలనుకున్నప్పుడు అది సరైన నిర్ణయం కాదని ఇదే వీకెండ్ కామెంట్/కొత్త పలుకులో రెండు మూడు పర్యాయాలు స్పష్టంగా పేర్కొన్నాను. ఇంటి పార్టీగా ప్రకటించుకున్న తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చాలనుకోవడం ఆత్మహత్యాసదృశం అవుతుందని హెచ్చరించాను. తెలంగాణ అన్న పేరుకు దూరమవడం తెలివి తక్కువ నిర్ణయమని విమర్శించాం కూడా. పార్టీలోని మెజారిటీ నాయకులు కూడా ఇదే అభిప్రాయంతో ఉండేవారు. అయితే ఎవరూ నోరు విప్పడానికి సాహసించలేకపోయారు. భిన్నాభిప్రాయాలను కేసీఆర్ ప్రోత్సహించేవారు కాదు. కాలక్రమంలో ఆ పార్టీ నాయకులు సొంతంగా ఆలోచించడం మానేశారు. కేసీఆర్‌లో అపారమైన తెలివితేటలు ఉన్నాయని, ఆయన వేసే రాజకీయ ఎత్తుగడలకు తిరుగుండదని, ఆయన ఎలా చెబితే అలాగే జరుగుతుందని నమ్మే స్థితికి చేరుకున్నారు. ఈ కారణంగానే తెలంగాణ రాష్ట్ర సమితిని జాతీయ పార్టీగా విస్తరించి భారత రాష్ట్ర సమితి పేరిట ఇతర రాష్ట్రాలలో కూడా పోటీ చేసి తగినన్ని సీట్లు గెలుచుకొని కేంద్రంలో చక్రం తిప్పుతానని కేసీఆర్ చెప్పగానే కాబోలు అని నమ్మేశారు. జాతీయ రాజకీయాలు అంటూ నేల విడిచి సాము చేసిన ఎన్టీఆర్, చంద్రబాబుకు ఎదురైన చేదు అనుభవాల గురించి నాబోటివాడు చెప్పినా ఆ పార్టీ నాయకులు చెవికెక్కించుకోలేదు. తెలంగాణను బాగుచేయమని ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటే జాతీయ రాజకీయాలు అంటూ కేసీఆర్ ఎగరడాన్ని తెలంగాణ సమాజం కూడా హర్షించలేదు. ఫలితంగానే 2023లో ఓడించారు. పార్టీలో సమష్టి నిర్ణయాలు, ఆలోచనలకు తావులేకుండా చేయడం వల్లనే కేసీఆర్ రాజకీయంగా దెబ్బతిన్నారు. సొంత బుర్రలతో ఆలోచించే వారిని పార్టీలో లేకుండా చేయడం వల్లనే బీఆర్ఎస్‌కు ప్రస్తుత దుస్థితి. అలా ఆలోచించగలిగే వారిని పార్టీ ప్రోత్సహించి ఉంటే తెలంగాణ రాష్ట్ర సమితి పేరు కూడా మారి ఉండేది కాదు. అధినాయకుల్లో నియంతృత్వ పోకడలు పెరగడానికి సమష్టి నిర్ణయాలు లేకపోవడమే కారణం. అధికారంలో ఉన్నప్పుడు తప్పులు చేశామని ఇంత కాలానికి కేటీఆర్ అంగీకరించారు. ఇదొక శు భ పరిణామం. అధికారంలో ఉన్నప్పుడు అహంకారంతో, అతిశయంతో వ్యవహరించిన వారికి గుణపాఠాలు తప్పవు. ఎన్టీఆర్ అంతటి నాయకుడు కూడా ఎన్నికల్లో ఓడిపోయారు. ఈ ఉదంతాలు తెలిసి కూడా కేసీఆర్ అదే బాటలో అహంభావంతో వ్యవహరించారు. నేల విడిచి సాము చేశారు. అనూహ్యంగా పరాజయం మూటగట్టుకున్నారు. ఏ పార్టీకైనా బలమైన నాయకుడు ఎంత ముఖ్యమో స్వతంత్రంగా ఆలోచించి ప్రజాభిప్రాయాన్ని అధినాయకుడికి నిక్కచ్చిగా చెప్పగలిగిన నాయకులు కూడా అంతే అవసరం. అలాంటి నాయకులు ఉండి ఉంటే కేసీఆర్ ఆలోచనలు పెడమార్గం పడుతున్నాయని అనుకున్నప్పుడు అడ్డుపడేవారు కదా!

**జగన్‌రెడ్డిదీ కేసీఆర్ బాటే!** కేసీఆర్ మార్గంలోనే వైసీపీ కూడా నడుస్తోంది. ఆ పార్టీలో కూడా అధినాయకుడు జగన్‌రెడ్డి మాటలకు ఎదురుండదు. బీఆర్ఎస్‌లో కంటే వైసీపీలో మరింతగా వ్యక్తి పూజ ఉంటోంది. కేసీఆర్ వద్ద అభిప్రాయాలు పంచుకోవడానికి కేటీఆర్, హరీశ్‌రావు వంటివారు ఇప్పుడు ఉన్నారు. జగన్‌రెడ్డి వద్ద అలాంటి వారు ఒక్కరు కూడా కనిపించరు. సలహాలు, సూచనలు అంటే అతనికి మహా చెడ్డ చిరాకు అని చెబుతారు. జగన్‌రెడ్డి వద్ద తాము ఆత్మాహుతి దళంలా పనిచేస్తామని, ఆయన ఏం చెబితే అదే చేస్తామని ఎంపీ మిథున్‌రెడ్డి స్వయంగా చెప్పుకొంటున్నారు. దీన్నిబట్టి ఆ పార్టీలో పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. రాజధానికి సంబంధించి జగన్‌రెడ్డి నోటివెంట వెలువడిన 'మావిగన్' అనే ప్రతిపాదనను ప్రజలు ఎగతాళి చేస్తున్నారు. తమ రాజధాని అమరావతి అని ప్రజలు నిర్ణయానికి వచ్చేశారు. అయినా 'మావిగన్' అనే పేరును ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, జగన్ ప్రతిపాదించిన మావిగన్.. అమరావతి కంటే గొప్పదని ప్రచారం చేయడానికి వైసీపీ నాయకులు వెనుకాడటం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మావిగన్‌కు ప్రజామోదం లేదని తెలిసి కూడా జగన్‌రెడ్డి చెబుతున్నారు కనుక అదే పేరును పట్టుకొని వేలాడటాన్ని ఏమనుకోవాలి? వైసీపీలో వ్యక్తి ఆరాధన పరాకాష్ఠకు చేరుకున్నందునే ఇలాంటి అసంబద్ధ ప్రతిపాదనలకు అడ్డుచెప్పేవారు లేకుండా పోయారు. అయితే ఇలా జరగడం వలన నష్టం ఎవరికి? వైసీపీకే కదా? నాయకుడిని అభిమానించడం వేరు.. గుడ్డిగా ఆరాధించడం వేరు. తప్పు జరిగినప్పుడు సరిదిద్దుకున్న వారినే ప్రజలు మళ్లీ మళ్లీ ఆదరిస్తారు.

## హైదరాబాదులో ఈదురుగాలులు, వడగళ్ల వాన బీభత్సం

**హైదరాబాద్‌లో పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన**

**గాలివాన ధాటికి నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు**

**హైదరాబాద్ నగరానికి రాత్రి 7 గంటల వరకు వర్ష సూచన**

**మేడ్చల్, రంగారెడ్డి సహా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ**



హైదరాబాద్ నగరంలో ఆదివారం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉదయం నుంచి ఎండలు మండిపోగా, మధ్యాహ్నం తర్వాత ఆకస్మికంగా ఆకాశం మేఘావృతమైంది. నగరంలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. చాలాచోట్ల వడగళ్లు కూడా పడటంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈదురు గాలుల ధాటికి చింతల్, పద్మనగర్ ప్రాంతాల్లో ఒక భారీ చెట్టు వేర్లతో సహా కూలిపోయింది. దీని ప్రభావంతో రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈ ఘటనలో పలు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. అయితే, ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని ప్రాథమిక సమాచారం. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, సికింద్రాబాద్, జీడిమెట్ల, కొంపల్లి, దుండిగల్, నిజాంపేట, బాలానగర్ సహా నగరంలోని అనేక ప్రాంతాల్లో వడగండ్ల వాన ప్రభావం చూపింది. ఇదిలా ఉండగా, హైదరాబాద్‌లో రాత్రి 7 గంటల వరకు భారీ వర్షం కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, వికారాబాద్ సహా మరికొన్ని జిల్లాలకు యెల్లో అలర్ట్ ప్రకటించింది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచించారు.

## ఏకతాటిపైకి దక్షిణాది సినీ నిర్మాతలు... 'సిఫ్పా' పేరిట కొత్త సంఘం ఏర్పాటు


**ఒక్కటైన దక్షిణ భారత సినీ నిర్మాతలు**

**'సౌత్ ఇండియన్ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్' (సిఫ్పా) ఏర్పాటు**

**థియేటర్, ఓటీటీ నిబంధనలపై ఏకపక్ష నిర్ణయాలకు వ్యతిరేకంగా తీర్మానం**

**తక్షణ సమస్యల పరిష్కారానికి స్టీరింగ్ కమిటీ నియామకం**

**ఓటీటీ గడువుపై ఎలాంటి హామీ పత్రాలు ఇవ్వొద్దని సభ్యులకు సూచన**



దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమలో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ చిత్ర పరిశ్రమలకు చెందిన ప్రముఖ నిర్మాతలు, ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ల ప్రతినిధులు ఏకతాటిపైకి వచ్చారు. సినీ నిర్మాణ రంగం ఎదుర్కొంటున్న తీవ్రమైన సవాళ్లను సమష్టిగా ఎదుర్కోవాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా 'సౌత్ ఇండియన్ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్' (రా×ఖీూూ) పేరుతో ఒక కొత్త సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఆదివారం హైదరాబాద్‌లోని దసపల్లా హోటల్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానాలు చేశారు. థియేట్రికల్ నిబంధనలు, 8 వారాల ఓటీటీ విడుదల గడువు వంటి కీలక అంశాలపై పరిశ్రమలోని ఇతర వర్గాలు తమతో సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడాన్ని ఈ సమావేశం తీవ్రంగా ఖండించింది. వేలాది మందికి జీవనోపాధి కల్పిస్తున్న సినిమా నిర్మాణ వ్యవస్థను ఒక్కసారిగా మార్చడం సాధ్యం కాదని, ఇలాంటి ఆకస్మిక మార్పులు నిర్మాణంలో వివిధ దశల్లో ఉన్న ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం చూపుతాయని, గందరగోళానికి దారితీస్తాయని నిర్మాతలు అభిప్రాయపడ్డారు. నిర్మాత ప్రయోజనాలను దీర్ఘకాలికంగా కాపాడే లక్ష్యంతోనే 'సిఫ్పా'ను ఏర్పాటు చేసినట్టు స్పష్టం చేశారు. తక్షణ సమస్యల పరిష్కారం, నాలుగు పరిశ్రమల మధ్య సమన్వయం కోసం ప్రతి పరిశ్రమ నుంచి ప్రతినిధులతో ఒక ఉన్నతస్థాయి స్టీరింగ్ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలకు పలు కీలక సూచనలు జారీ చేశారు. ప్రస్తుతం అనుసరిస్తున్న నిర్మాణ ప్రక్రియలు, హక్కుల విక్రయాలు, విడుదల ప్రణాళికలను యథాతథంగా కొనసాగించాలని తెలిపారు. ముఖ్యంగా, ఓటీటీ విడుదల గడువుకు సంబంధించి ఏ సంఘానికి గానీ, రంగానికి గానీ ఎలాంటి హామీ పత్రాలు ఇవ్వవద్దని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఇలాంటి నిబంధనలపై సమిష్టి చర్చల ద్వారానే తుది నిర్ణయం తీసుకోవాలని, అప్పుడే నిర్మాతలకు ఆర్థికంగా ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. సినిమాకు ప్రాథమిక పెట్టుబడిదారు, నష్టభయాన్ని భరించేది నిర్మాతే కాబట్టి, పరిశ్రమకు సంబంధించిన అన్ని నిర్ణయాధికార ప్రక్రియలలో నిర్మాతదే సార్వభౌమాధికారం అని ఈ సమావేశం పునరుద్ఘాటించింది. ఈ కొత్త స్టీరింగ్ కమిటీ తరచూ సమావేశమై నిర్మాత ప్రయోజనాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటుందని ప్రకటనలో తెలిపారు.

## అలీ ఖమేనీ అంత్యక్రియలు ఇప్పటికీ జరగలేదు... ఇరాన్ ఎందుకు వెనుకంజ వేస్తోంది?

ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ఇజ్రాయెల్-అమెరికా దాడుల్లో మరణించి నెల రోజులు దాటినా, ఆయన మృతదేహానికి ఇంకా అంత్యక్రియలు జరగలేదు. అమెరికా, ఇజ్రాయెల్ దాడుల భయం, దేశంలో అంతర్గత నిరసనల ఆందోళనల నడుమ భారీ ఎత్తున బహిరంగ అంత్యక్రియలు నిర్వహించడానికి ఇరాన్ ప్రభుత్వం వెనుకాడుతున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామం దేశంలో నెలకొన్న తీవ్ర రాజకీయ అనిశ్చితికి, ప్రభుత్వ బలహీనతకు అద్దం పడుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడిలో ఖమేనీ (86) మరణించారు. మార్చి 4న అంత్యక్రియలు నిర్వహించాలని తొలుత ప్రణాళిక వేసినా, యుద్ధం తీవ్రరూపం దాల్చడంతో వాయిదా వేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి తేదీని ప్రకటించలేదు. ప్రజలు లక్షలాదిగా తరలివస్తారన్న కారణంతో ఆలస్యమవుతోందని ప్రచారం జరుగుతున్నా, వాస్తవ పరిస్థితులు వేరేలా ఉన్నాయి. గతంలో 1989లో అప్పటి సుప్రీంనేత ఖొమైనీ అంత్యక్రియలకు లక్షల మంది హాజరైనా, ఇప్పుడు అలాంటి వాతావరణం కనిపించడం లేదు. "ప్రస్తుత పాలనాయంత్రాంగం భయంతో, బలహీనంగా ఉంది. అందుకే పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించడానికి సాహసించడం లేదు" అని ఫౌండేషన్ ఫర్ డిఫెన్స్ ఆఫ్ డెమోక్రసీస్‌కు చెందిన బెహ్నామ్ తాలెబ్లు పేర్కొన్నారు. అంత్యక్రియల సమయంలో ఇజ్రాయెల్ దాడులు జరగవచ్చనే భయంతో పాటు, ఖమేనీ వారసుడిగా భావిస్తున్న ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీ బహిరంగంగా కనిపించకపోవడం కూడా ఈ ఆలస్యానికి కారణమని ఆయన విశ్లేషించారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com